ఆదివారం
23•2•2020
కరీంనగర్
• వెల. రూ. 8
• సంపుటి 9 • సంచిక 239
• పేజీలు : 12 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






## తెలంగాణ నీటిపారుదల అద్భుతం

- సంప్రదాయ నీటివనరులను పరిరక్షించాలి
- సాగును లాభసాటిగా మార్చాలి
- రైతును మించిన శాస్త్రవేత్త లేడు: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- రాష్ట్రంలో అన్నదాతల అనుకూల ప్రభుత్వం
- 'అగ్రిటెక్ సౌత్-2020' సదస్సులో మంత్రులు మహమూద్అలీ, నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నీటిపారుదల రంగంలో తెలంగాణ ప్రభుత్వం అద్భుత పనితీరు కనబరుస్తున్నదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు. దేశవ్యాప్తంగా సంప్రదాయ నీటివనరుల పరిరక్షణ అత్యవసరమని అభిప్రాయపడ్డారు. శనివారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అగ్రిటెక్‌సౌత్-2020 సదస్సుకు ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మించిన శాస్త్రవేత్తలు లేరని, అందుకే నూతన ఆవిష్కరణలతో వ్యవసాయం చేస్తున్న రైతులకు పద్మ అవార్డులు వస్తున్నాయని చెప్పారు. రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా కృషిచేసి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. కొత్త

మిగతా 2వ పేజీలో

## ట్రంప్‌తో విందుకు కేసీఆర్



### ముఖ్యమంత్రిని ఆహ్వానించిన రాష్ట్రపతి కోవింద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గౌరవార్థం భారత రాష్ట్రపతి ఇచ్చే విందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ఆహ్వానించారు. ఈ నెల 25న రాత్రి 8 గంటలకు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో విందుకు హాజరుకావాల్సిందిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తూ లేఖ పంపారు. ఆహ్వానం పొందినవారిలో తెలంగాణ, అసోం, హర్యానా, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల సీఎంలు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు మాత్రమే ఉన్నారు. ఈ విందులో పాల్గొనడానికి సీఎం కేసీఆర్ ఈ నెల 25న ఢిల్లీకి వెళ్లే అవకాశమున్నది.


శ్రీశైలం డ్యాం

## శ్రీశైలాన్ని వీడని కృష్ణమ్మ

### సాగర్‌కు 59 టీఎంసీల విడుదలకు ఆదేశించిన కృష్ణాబోర్డు
### పదిరోజుల్లో విడుదలైంది నాలుగు టీఎంసీలే
### పోతిరెడ్డిపాడుద్వారా మళ్లీ నీటివిడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నాగార్జునసాగర్ జలాశయంనుంచి రెండు తెలుగు రాష్ట్రాలు నీటిని వినియోగించుకోవడానికి వీలుగా శ్రీశైలం నుంచి దిగువకు నీటిని విడుదలచేయాలని కృష్ణాబోర్డు ఆదేశించి పదిరోజులు గడుస్తున్నా.. ఏపీ అధికారుల నుంచి ఆ మేరకు స్పందనలేకుండాపోయింది. మరోవైపు పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ.. రెండురోజులుగా నీటిని విడుదల చేసుకుంటున్నది. దీనితో ఒక వైపు శ్రీశైలం నుంచి రెండు రాష్ట్రాల్లోని ఇతర ప్రాజెక్టుల అవసరాలతోపాటు సాగర్‌కు విడుదలచేయాల్సిన నీటిపరిమాణం కూడా తగ్గుతుందనే అనుమానంతో కృష్ణాబోర్డు అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే రెండు రాష్ట్రాలకు మరోసారి లేఖరాసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. నాగార్జునసాగర్ ఎండీడీఎల్ ఎగువన నిల్వలు రెండు రాష్ట్రాల తాగు, సాగునీటి అవసరాలకు కేటాయించిన నీటి పరిమాణం కంటే తక్కువగా ఉండటంతో శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 63 టీఎంసీలను విడుదలచేయాలని కృష్ణాబోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఒకవైపు సాగర్‌నుంచి నీటివినియోగం జరుగుతున్నది. కానీ, ఎగువన శ్రీశైలం నుంచి రావాల్సిన నీటి విడుదల జరగటంలేదు. దీంతో సాగర్‌లో నీటి పరిమాణం మరింత తగ్గే అవకాశం ఉండటంతో ఈ నెల 12న బోర్డు రెండు రాష్ట్రాలకు లేఖరాసింది. శ్రీశైలం నుంచి 4 టీఎంసీలు మాత్రమే సాగర్‌కు వచ్చినందున 59 టీఎంసీలను రెండు రాష్ట్రాల విద్యుత్ కేంద్రాల ద్వారా విడుదలచేయాలని ఆదేశించింది. అప్పట్నుంచి గత పదిరోజుల్లో శ్రీశైలంనుంచి కేవలం నాలుగు టీఎంసీలు మాత్రమే

మిగతా 2వ పేజీలో

# జీహెచ్‌ఎంసీకి కొత్తచట్టం

### కొత్త మున్సిపల్ చట్టం స్ఫూర్తిగా రూపకల్పన
### పారదర్శక పాలనే లక్ష్యం.. టీఎస్‌బీపాస్‌తో భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియ సులభతరం
### అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనాటికి చట్టాన్ని సిద్ధంచేయాలి
### జీహెచ్‌ఎంసీ అధికారులకు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం


శనివారం ఎంసీహెచ్చార్డీలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు. చిత్రంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ నగరపౌరులకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించడానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) చట్టాన్ని మార్చనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో అమలులోకి తీసుకొచ్చిన కొత్త మున్సిపల్ చట్టంలోని అన్ని కీలకమైన అంశాలను జీహెచ్‌ఎంసీ నూతన చట్టంలో పొందుపరచనున్నట్లు చెప్పారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధికేంద్రంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి కేటీఆర్.. మున్సిపల్ చట్టం స్ఫూర్తితో అందులోని నిబంధనలను యథాతథంగా జీహెచ్‌ఎంసీ చట్టంలోకి తీసుకొనిరావాలని సూచించారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నాటికి నూతన చట్టాన్ని ఆమోదంకోసం సిద్ధంచేయాలన్నారు. కొత్త చట్టంలో పొందుపరచాల్సిన అంశాలపై పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌కు పలు సూచనలుచేశారు. జీహెచ్‌ఎంసీ చట్టం ద్వారా భవన నిర్మాణ అనుమతులు, పౌరసేవల వేగవంతం, ప్రజాప్రతినిధులపై బాధ్యత పెంచడం, అధికారులు బాధ్యతగా వ్యవహరించేలా చూడటం వంటి అంశాలను ఈ చట్టంలో పొందుపరచాలని పేర్కొన్నారు. కొత్త చట్టం ద్వారా ప్రజలకు అనేక సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ముఖ్యంగా త్వరలో తీసుకురానున్న తెలంగాణ భవన అనుమతుల ప్రక్రియ (టీఎస్‌బీపాస్) నేపథ్యంలో దానికి అనుగుణంగా అవసరమైన మార్పులను జీహెచ్‌ఎంసీ నూతన చట్టంలో తీసుకొనిరావాలని ఆదేశించారు. దీంతోపాటు హెచ్‌ఎండీఏ పరిధిలో కూడా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను సరళతరంచేస్తామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ జోనల్ స్థాయిలో ప్రతి కమిషనర్ మరింత చొరవగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ఇప్పుడు కొనసాగుతున్న ఎస్సార్డీపీ, రోడ్ల నిర్వహణ, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ వంటి కార్యక్రమాల పట్ల ప్రత్యేక

మిగతా 2వ పేజీలో

## అబద్ధాల ఈనాడు

- ఆధారాలుంటే చూపండి.. లేదంటే రూ.వెయ్యికోట్లకు పరువునష్టం దావావేస్తాం
- దేశంలోనే తెలంగాణ పోలీస్ నంబర్‌వన్.. ప్రతిష్ఠ దిగజార్చేందుకే కుట్రపూరిత కథనం
- ఈనాడు 'దొంగలతో దోస్తీ' కథనంపై హోంమంత్రి మహమూద్‌అలీ సీరియస్
- న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలి: ఈనాడుకు డీజీపీ హెచ్చరిక
- ఈనాడు కథనంపై పోలీసు అధికారుల సీరియస్
- తీవ్రంగా ఖండించిన కమిషనర్లు, పోలీసు అధికారుల సంఘం

2


మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్‌అలీ

## పీఎం కిసాన్ కింద రైతులకు 50,850 కోట్లు

8.46 కోట్ల మందికి అందజేత

ఏడాది ప్రగతిని విడుదలచేసిన కేంద్ర వ్యవసాయశాఖ

5



# హెలికాప్టర్‌లో చక్కర్ కొడుదాం!

హెలికాప్టర్ సేవలకు అనూహ్య స్పందన

- రూ.మూడువేలు చెల్లిస్తే హెలిరైడ్
- మేడారం, వేములవాడకు రూ.30 వేలు
- సేవలు విస్తరించే యోచనలో ప్రభుత్వం


శనివారం వేములవాడలో హెలికాప్టర్ వద్ద సెల్ఫీ దిగుతున్న ఔత్సాహికులు


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గాల్లో తేలుతూ గగనపువీధి నుంచి నేలను చూస్తే కలిగే అనుభూతి వర్ణనాతీతం! విమానం ఎక్కే వెసులుబాటు అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ.. గాల్లోకి ఎగిరాక కొద్దిసేపు, దిగేముందు మాత్రమే విహంగవీక్షణం సాధ్యం. తక్కువ ఎత్తులో ప్రయాణించే హెలికాప్టర్‌లోనైతే కూర్చున్నంతసేపు గాజుద్వారాల నుంచి ప్రతిక్షణాన్ని ఆస్వాదించవచ్చు. రూ.మూడువేలు ఖర్చుపెడితే సామాన్యులు సైతం హెలిరైడ్‌కు (ఐదు నుంచి పది నిమిషాలపాటు చక్కర్) అవకాశం అందుబాటులోకి వచ్చింది. మొన్న మేడారం జాతరకు, నిన్న వేములవాడకు నడిపిన హెలికాప్టర్ సేవలకు సైతం అనూహ్యస్పందన లభించింది. వేములవాడ నుంచి మిడ్‌మానేరు విహంగవీక్షణకు బయలుదేరిన ఓ చిన్నారి భూమికి ఆకాశానికి మధ్య హెలికాప్టర్‌లో కేక్ కట్‌చేసి జన్మదినవేడుకను ఆస్వాదించాడు. ఈ నేపథ్యంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం ప్రాముఖ్యాన్ని గుర్తించిన ప్రభుత్వం వినూత్నంగా శాశ్వతంగా హెలికాప్టర్ సేవలు కొనసాగించాలని భావిస్తున్నది.

**తొలిసారి వేములవాడకు హెలికాప్టర్**

తెలంగాణ ప్రభుత్వ చొరవతో పర్యాటకశాఖ వివిధ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. నాలుగురోజులపాటు మేడారం జాతరకు హెలికాప్టర్ నడుపగా 170 మందికిపైగా సేవలను వినియోగించుకొన్నారు. వేములవాడ రాజరాజేశ్వరుడి సన్నిధికి చరిత్రలో తొలిసారి హెలికాప్టర్ నడుపగా శుక్ర, శనివారాల్లో 200 మంది సేవలను వినియోగించుకున్నారు. ఆదివారం కూడా హెలికాప్టర్ నడుపుతున్నారు. మేడారంలో మాదిరిగానే వేములవాడలోనూ హెలిరైడ్ కొనసాగిస్తున్నారు. ఒక్కసారైనా హెలికాప్టర్ ఎక్కి ఫొటో తీసుకోవాలనే కోరికను చాలా మంది నెరవేర్చుకుంటున్నారు. మిడ్‌మానేరు విహంగవీక్షణానికి రూ.5,500, హైదరాబాద్ నుంచి వేములవాడకు ఒక్కొక్కరికి రూ.30వేలుగా

మిగతా 3వ పేజీలో




## అన్నీఅబద్ధాలే

- నిర్భయ దోషి వినయ్ ఆరోగ్యంగానే ఉన్నాడు
- ఢిల్లీ కోర్టుకు తీహార్ జైలు అధికారుల వెల్లడి
- మెరుగైన చికిత్స కోసం వినయ్ దాఖలుచేసిన పిటిషన్ తిరస్కరణ

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 45.00 | రిటైల్ లైవ్ | 67.00 |
| డ్రెస్డ్ | 97.00 | స్కిన్‌లెస్ | 111.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 340.00 | రంగారెడ్డి | 340.00 |
| మెదక్ | 340.00 | కరీంనగర్ | 343.00 |
| వరంగల్ | 343.00 | డజన్ ధర | 60.00 |

## ముగ్గురు జలసమాధి

### యాదాద్రి జిల్లా వెల్లంకిలో చెరువులోకి దూసుకెళ్లిన కారు


చెరువులో నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

**రామన్నపేట:** ప్రమాదవశాత్తు కారు చెరువులోకి దూసుకెళ్లడంతో ముగ్గురు జలసమాధి అయ్యారు. ఇందులో ఇద్దరు తండ్రీకొడుకులు కాగా మరో వ్యక్తి ఉన్నారు. ఈ ఘటన శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో వెలుగుచూసింది. రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ దర్నె రాణి భర్త మధు(35), తన కుమారుడు మణికంఠ(12), సాగుబాయిగూడేనికి చెందిన టీఆర్‌ఎస్ నన్నూరి శ్రీధర్‌రెడ్డి(25) కలిసి శుక్రవారం మధ్యాహ్నం కారు కడిగేందుకు వెల్లంకిలోని తన స్నేహితుడి వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. సాయంత్రం

మిగతా 8వ పేజీలో

## మోదీతో మతస్వేచ్ఛపై చర్చిస్తాం

- సీఏఏ, ఎన్నార్సీపై మేమూ ఆందోళన చెందుతున్నాం
- ఈ అంశాన్ని మోదీ వద్ద ట్రంప్ ప్రస్తావిస్తారు
- అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ వెల్లడి
- 'ట్రంప్ ప్లాటర్' సిద్ధంచేస్తున్న ఐటీసీ మౌర్య

5

# డీసీసీబీ ఎన్నికలపై కేటీఆర్ కసరత్తు

## త్వరలో అభ్యర్థులను ఖరారుచేయనున్న సీఎం కేసీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)ల పాలకవర్గాల కు జరుగనున్న ఎన్నికలపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శనివారం ప్రాథమిక కసరత్తు పూర్తిచేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తొమ్మిది ఉమ్మడిజిల్లాలకు చెందిన మంత్రులు, ముఖ్యనాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాలవారీగా డీసీసీబీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. డైరెక్టర్ల నామినేషన్లు, చైర్మన్ ఎన్నికపై జిల్లా నాయకుల నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు. డీసీసీబీ డైరెక్టర్, చైర్మన్ పదవులను ఆశిస్తున్నవారిలో అర్హులు, పార్టీకి చేసిన సేవలు, సామాజికవర్గం తదితర సమాచారాన్ని పంపించాలని సూచించారు. సీఎం కేసీఆర్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. ఈ నెల 25తో డీసీసీబీ డైరెక్టర్ల నామినేషన్లకు గడువు ముగుస్తుంది. పార్టీకి విధేయులు, ఇన్నాళ్లు సేవచేసినవారు, సామాజిక సమీకరణలు, రైతు సమస్యల పట్ల వారికున్న అవగాహన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని కేటీఆర్ తెలిపారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. జిల్లా నాయకులను మంత్రులు సమన్వయం చేయాలని సూచించారు.

# జీహెచ్‌ఎంసీకి కొత్తచట్టం

మొదటిపేజీ తరువాయి...

శ్రద్ధ వహించాలని చెప్పారు. జోన్ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకుపోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా టాయిలెట్ల నిర్మాణం, పార్కుల నిర్వహణ, జంక్షన్ల అభివృద్ధి, బస్తీ దవాఖానాల ఏర్పాటు వంటి ప్రాథమిక కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఇలాంటివాటి కోసం ప్రత్యేక ఐటీ డ్యాష్‌బోర్డు ఏర్పాటుచేయాలని, దీనిద్వారా ఆయా కార్యక్రమాల పురోగతిని నిరంతరం సమీక్షిస్తానని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ పాల్గొన్నారు.

# శ్రీశైలాన్ని వీడని కృష్ణమ్మ

మొదటిపేజీ తరువాయి...

విడుదలయ్యాయి. ఇందులోనూ తెలంగాణ పరిధిలో ఉన్న ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో కరంట్ ఉత్పత్తి ద్వారా విడుదలచేసిన నీటి పరిమాణమే ఎక్కువగా ఉన్నది. ఏపీ నుంచి కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా నీటి విడుదల జరుగటంలేదని తెలిసింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 863 అడుగులతో నీటి నిల్వ 115.502 టీఎంసీలుగా ఉన్నది. అంటే ఎండీడీఎల్ ఎగువన సుమారు 62 టీఎంసీల మేర మాత్రమే నిల్వ ఉన్నది. తెలంగాణకు సంబంధించి కల్వకుర్తి లిఫ్టు పథకానికి బోర్డు అనుమతించినదానిలో ఇంకా 12 టీఎంసీల నీటి వినియోగానికి వాటా ఉన్నది. పైగా శ్రీశైలం నుంచి సాగర్‌కు విడుదలచేయాల్సిన నీటి పరిమాణం ఇంకా 55 టీఎంసీల మేర ఉన్నది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. గత రెండురోజులుగా ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల ప్రారంభించింది. తొలుత 1500 క్యూసెక్కులు, శనివారం 2500 క్యూసెక్కుల డిశ్చార్జి కొనసాగుతున్నది. దీని వల్ల శ్రీశైలంలో నిల్వలు తగ్గుతుంటాయి. ఇలాగైతే కల్వకుర్తి లిఫ్టుతోపాటు సాగర్‌కు విడుదలచేయాల్సిన నీటికి ఇబ్బందయ్యే అవకాశమున్నది. దీంతో బోర్డు అధికారులు అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. బోర్డు ఆదేశానుసారం శ్రీశైలంనుంచి సాగర్‌కు నీటి విడుదల చేయాల్సిందిగా మరోసారి లేఖ రాసేందుకు అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

# మే 27న లాసెట్

- మార్చి 2న నోటిఫికేషన్
- ఆరోజు నుంచే దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని న్యాయవిద్య కళాశాలల్లో 2020-21 విద్యా సంవత్సరానికి ప్రవేశాల నిమిత్తం షెడ్యూల్ విడుదలైంది. మార్చి 2వ తేదీన నోటిఫికేషన్ జారీచేసి అదే రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 27న లాసెట్, పీజీ లాసెట్ నిర్వహించనున్నారు. శనివారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన లాసెట్, పీజీ లాసెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. మార్చి 2న లాసెట్, పీజీలాసెట్ నోటిఫికేషన్లు విడుదల చేసి ఆరోజు నుంచి మొదలుకొని ఏప్రిల్ 6 వరకు (పీజీలాసెట్‌కు ఏప్రిల్ 4 గడువు) ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో దరఖాస్తులను మే 20 వరకు అందజేయవచ్చు. దరఖాస్తు రుసుం రూ.800, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం రూ.500గా నిర్ణయించారు. పీజీ లాసెట్‌కు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.800 చెల్లించాల్సి ఉంటుంది.

### ముహూర్తం



సూర్యోదయం: 6.46 గంటలకు



సూర్యాస్తమయం: 6.14 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం అమావాస్య రాత్రి 9.02 వరకు, తదుపరి ఫాల్గుణ మాసం, శుక్లపక్షం పాడ్యమి, నక్షత్రం: ధనిష్ఠ మధ్యాహ్నం 1.43 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: సాయంత్రం 4.47 నుంచి 6.14 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.41 నుంచి 5.27 వరకు, వర్జ్యం: రాత్రి 9.42 నుంచి 11.29 వరకు.

# అబద్ధాల ఈనాడు

## ఆధారాలుంటే చూపండి.. లేదంటే రూ.వెయ్యికోట్లకు పరువునష్టం దావావేస్తాం

### ఈనాడు 'దొంగలతో దోస్తీ' కథనంపై హోంమంత్రి మహమూద్‌అలీ సీరియస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకంటే అగ్రపథంలో దూసుకుపోతున్న తెలంగాణను బద్నాం చేయడానికి ఈనాడు దినపత్రిక కుట్రచేసిందని, నిరాధారంగా.. నిస్సిగ్గుగా అబద్ధపు వార్తలను ప్రధానంగా వండివారుస్తూ.. రాష్ట్ర పోలీసుశాఖ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే దుస్సాహసానికి దిగిందని విమర్శలు వెల్లువెత్తాయి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఏదో ఒక అలజడి తేవాలని.. ప్రజల్లో అభద్రతాభావాన్ని సృష్టించాలన్న దుర్బుద్ధితో కట్టుకథలను అల్లిందని పలువురు పోలీసు అధికారులు మండిపడ్డారు. 'దొంగలతో దోస్తీ' అంటూ శనివారం తప్పుడు వార్త రాసి జాతీయస్థాయిలో ఎంతో కీర్తి గడించిన తెలంగాణ పోలీసుల ప్రతిష్ఠను మసకబార్చే యత్నంచేసిందని ఆగ్రహించారు. గత ఆరేండ్లలో మన రాష్ట్ర పోలీస్‌శాఖ పనితీరు.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో శాంతిభద్రతల పరిరక్షణకు చేస్తున్న కృషి, మహిళల భద్రతకోసం తీసుకొంటున్న చర్యలను చూసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు, కేంద్రమంత్రులు వేనోళ్ల కొనియాడుతుంటే.. మన పోలీసుల స్థాయిని తగ్గించడానికి కుయుక్తి పన్ని రాసిన సదరు వార్తపై హోంమంత్రి మహమూద్ అలీ తీవ్రంగా మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వార్తలు రాసిన ఈనాడు.. క్షమాపణలు చెప్పకుంటే వెయ్యికోట్ల రూపాయలకు పరువునష్టం దావావేస్తామని హోంమంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసుల బదిలీలు, పోస్టింగుల్లో రాజకీయ జోక్యం ఉండదని తెలిపారు. దొంగలతో పోలీసులు కలిసిపోయారంటూ ఈనాడు దినపత్రికలో వచ్చిన 'దొంగలతో దోస్తీ' కథనం పూర్తిగా అవాస్తవమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈనాడు కుట్రపూరితంగా కథనం రాసిందని ఆగ్రహించారు. శనివారం ఆయన లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయ జోక్యంతో పోస్టింగులు ఇస్తున్నారంటూ ఆధారాలు లేకుండా ఎలా రాస్తారని మండిపడ్డారు. 'ఎవరు డబ్బులు వసూలు చేస్తున్నారు.. ఎట్లా చేస్తున్నారు? అన్న దేనికీ ఆధారాలు లేవు. నేను ఈనాడు ఎడిటర్, చీఫ్ ఎడిటర్‌కు ఒక్కటే డిమాండ్‌చేస్తున్నా.. ఈ ఆరోపణలను మీరు నిరూపించండి. లేదంటే క్షమాపణ చెప్పండి' అని డిమాండ్‌చేశారు. లేకుంటే రూ.వెయ్యి కోట్లకు పరువునష్టం దావావేస్తామని హెచ్చరించారు. పోలీస్‌శాఖ ఎంతో బాధ్యతాయుతమైనదని, ప్రజల్లో ఎంతో భరోసా ఉన్న పోలీసుశాఖపై నిరాధార కథనాలు రాయడం సరికాదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఒక్క నిమిషం కూడా కర్ఫ్యూ విధించలేదని పేర్కొన్నారు. చరిత్రలో ఏనాడూ లేనంత ప్రశాంతంగా తెలంగాణ ఉందన్నారు. పోలీస్‌శాఖకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్నారు. పోలీసు విధుల్లో ఎక్కడా రాజకీయ జోక్యం లేదని స్పష్టంచేశారు. వాస్తవం ఇలా ఉంటే ప్రభుత్వాన్ని, పోలీస్‌శాఖను అప్రతిష్ఠపాలు చేయడానికి ఈనాడు చేస్తున్న కుట్రలో భాగమే ఈ వార్తాకథనమని పేర్కొన్నారు. మీడియాలో వచ్చే కథనాలకు సామాన్యుల్లో విశ్వసనీయత ఉంటుందని, ఇలాంటి కథనాలను ఆధారాలులేకుండా రాయడం సరికాదన్నారు. రాష్ట్రంలో పోలీస్‌శాఖ అత్యుత్తమంగా పనిచేస్తున్నదని, 24 గంటలపాటు గస్తీ ముమ్మరం చేశామని చెప్పారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయంటే తెలంగాణ పోలీసులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నారో అర్థమవుతుందని మహమూద్ అలీ అన్నారు.

**ప్రతి బదిలీలో ఎంతో కసరత్తు..**

ఒక ఎస్సైని బదిలీ చేయాలంటే డీఐజీతోపాటు ఆ జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ కలిసి నిర్ణయం తీసుకొంటారని.. సీఐని బదిలీ చేయాలంటే సంబంధిత జోన్ ఐజీ, ఆ రేంజ్‌కు చెందిన డీఐజీ, సంబంధిత జిల్లా ఎస్పీ, ఇంటెలిజెన్స్ ఎస్పీ కలిసి చర్చించి.. పనితీరు ఆధారంగా చేస్తారని హోంమంత్రి మహమూద్ అలీ వివరించారు. డీఎస్పీని బదిలీచేయాలంటే స్వయంగా డీజీపీతోపాటు శాంతిభద్రతల అడిషనల్ డీజీ, అడిషనల్ డీజీ సీఐడీ, ఇంటెలిజెన్స్ ఐజీ సమిష్టిగా నిర్ణయం తీసుకొంటారని చెప్పారు. పూర్తిస్థాయి అధికారి పనితీరు, సమర్థత, గతంలో రికార్డు.. అన్నీ పరిగణనలోకి తీసుకొన్నాకే పోస్టింగ్ ఇస్తారని తెలిపారు. ఇంత కసరత్తు జరుగుతుంది కాబట్టే రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు. సివిల్ తగాదాల్లో ఎక్కడా పోలీసులు జోక్యం చేసుకోవడంలేదని, ఎక్కడైనా దాడులు జరిగి గాయాలైన ఘటనలు ఉంటే కేసులు నమోదుచేస్తున్నారని వివరించారు.

**సత్యదూరం: పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి**

ఈనాడు పత్రికలో వచ్చిన 'దొంగలతో దోస్తీ' కథనం పూర్తిగా సత్యదూరమని, ఈ కథనాన్ని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు వై గోపిరెడ్డి అన్నారు. పోలీస్ అధికారుల సంఘం సైబరాబాద్ అధ్యక్షుడు భద్రారెడ్డి, వెల్ఫేర్ లైజన్ ఆఫీసర్ కే శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్డీకాపూల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీస్ అధికారుల నియామకాలను పూర్తిగా నిబంధనలు, పనితీరు, ఇతర ఇండికేటర్ల ఆధారంగానే చేపడుతారన్నారు.

**ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు: హైదరాబాద్ సీపీ అంజనీకుమార్**

ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నాణ్యమైన సేవలందించడంపై దృష్టిసారించి ప్రజల భద్రతకోసం రేయింబవళ్లు పనిచేస్తున్నామని హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ అన్నారు.

**తీవ్రంగా ఖండిస్తున్నాం: రాచకొండ సీపీ మహేశ్ భగవత్**

ఈనాడులో వచ్చిన కథనంలో ఏమాత్రం వాస్తవం లేదని.. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ చెప్పారు. తాము ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటున్నామని, వారికి పూర్తి భద్రతాపరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు.

**పోలీసులపై బురద జల్లితే ప్రజలకు నష్టం: సైబరాబాద్ సీపీ సజ్జనార్**

రాష్ట్రంలో ఎలాంటి సంచలనాత్మకమైన కేసునైనా 24 నుంచి 48 గంటల్లో ఛేదిస్తున్నామని సైబరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. పోలీసులపై బురద జల్లి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే అది రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగిస్తుందని చెప్పారు. షీ టీమ్స్‌తో మహిళలకు భద్రత పెరిగిందని వివరించారు. నగరంలో నెలకొన్న భద్రతతోనే దేశవిదేశాల నుంచి వందల కంపెనీలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు.

## నిరూపించకపోతే చర్యలు

### ఈనాడు కథనాన్ని ఖండించిన డీజీపీ మహేందర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలీస్‌శాఖ ప్రతిష్ఠను తగ్గించేలా ఈనాడులో ప్రచురితమైన కథనం పూర్తిగా అసత్యమని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కథనంలోని అరోపణలు నిరూపించకుంటే క్షమాపణలు చెప్పాలని, లేదంటే న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. డీజీపీ శనివారం ఓ ప్రకటన విడుదలచేశారు. ఈనాడులో వచ్చిన కథనం తెలంగాణ పోలీస్‌శాఖ సిబ్బందితోపాటు వారి కుటుంబసభ్యులను, బంధువులను, సన్నిహితులను ఎంతో బాధించిందని తెలిపారు. శాంతిభద్రతల రక్షణకోసం రోజుకు 16 గంటలపాటు పనిచేస్తూ, పండుగలు, సెలవులు అన్నీ వదులుకొని వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతూ, కుటుంబాన్ని, పిల్లలను పట్టించుకోకుండా పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. పదోన్నతులు, పోస్టింగ్‌ల విషయంలోనూ పూర్తిగా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని వెల్లడించారు. విధినిర్వహణలో తప్పుచేసే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకొంటున్నామని, ఒకరిద్దరు అధికారులు తప్పుచేస్తే.. మొత్తం పోలీస్‌శాఖకు దాన్ని ఆపాదించడం సరికాదని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీస్‌శాఖలో మరింత పారదర్శకత పెంచేలా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు 24 గంటలపాటు విధి నిర్వహణలో ఉంటున్న పోలీస్‌శాఖకు ఈనాడులో వచ్చిన కథనం మచ్చగా మారిందని ఆవేదన చెందారు.



లక్డీకాపూల్‌లో మాట్లాడుతున్న పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి. చిత్రంలో సంఘం సైబరాబాద్ అధ్యక్షుడు భద్రారెడ్డి, వెల్ఫేర్ లైజన్ ఆఫీసర్ కే శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్. చిత్రంలో ఐజీ ప్రమోద్‌కుమార్, డీఐజీ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

## ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

**దేశంలోనే** నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్ హెచ్చరించారు. ఈనాడు దినపత్రికలో 'దొంగలతో దోస్తీ' పేరిట పోలీస్‌శాఖ ప్రతిష్ఠను తగ్గించేలా ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. ఈ వార్తతో పోలీస్‌శాఖలోని దాదాపు లక్ష మంది అధికారులు, సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతినడంతోపాటు, రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగించేలా ఉన్నదన్నారు. నిరాధారంగా పోలీస్‌శాఖలోని అధికారులు, సిబ్బందిని కించపర్చేలా 'ఈనాడు' ప్రచురించిన కథనంపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామని చెప్పారు. శనివారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐజీ ప్రమోద్‌కుమార్, డీఐజీ శివశంకర్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఏ చిన్న ఘటనకు తావులేకుండా 24 గంటలపాటు శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్‌శాఖ పనిచేస్తున్నదని తెలిపారు. వరుస ఎన్నికల బందోబస్తులు, ప్రపంచస్థాయి ఈవెంట్ల సమయంలో కూడా సమర్థంగా వ్యవహరించామని చెప్పారు. టెక్నాలజీ వినియోగంతో.. కేసుల ఛేదనలోనూ తెలంగాణ పోలీసులు బెస్ట్ అని నిరూపించుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణకు వచ్చే కేంద్ర, ఇతర రాష్ట్రాల మంత్రులు, నాయకులు సైతం మన పోలీసింగ్‌ను ప్రశంసించారన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ అత్యంత పారదర్శకంగా పనిచేస్తున్నదని, పోలీస్ అధికారుల నియామకాలను పూర్తిగా నిబంధనలను అనుసరించి, పనితీరు, ఇతర ఇండికేటర్ల ఆధారంగానే చేపడుతున్నట్టు స్పష్టంచేశారు. విధి నిర్వహణలో విఫలమైన పోలీసులపై ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉన్నామని వివరించారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా పోలీసింగ్‌లో ఎన్నో విప్లవాత్మక, వినూత్న, పారదర్శక కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజలకు మరింత చేరువైన ఘనత తెలంగాణ పోలీసులదేనని అన్నారు. ఈ తప్పుడు వార్త మొత్తం పోలీస్ వ్యవస్థకే మచ్చతెచ్చేలా ఉన్నదన్నారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు తీసుకెళ్తుందన్నారు. ఆయా జిల్లాల్లో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు 'ఈనాడు' కథనాన్ని ఖండించారు.

# తెలంగాణ నీటిపారుదల అద్భుతం

మొదటిపేజీ తరువాయి...

విధానాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయం దేశానికి వెన్నెముకని, మౌలిక సంస్కృతి అని తెలిపారు. మన వ్యవసాయ విధానాలను అవలంబించి ఇతర దేశాలు అధిక ఉత్పత్తి, ఉత్పాదకత సాధిస్తున్నాయని పేర్కొన్నారు. మొత్తం దేశ ఎగుమతుల్లో 10 శాతం వ్యవసాయ ఉత్పత్తులేనని గుర్తుచేశారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధుమేహాన్ని నియంత్రించే కొత్త వరి వంగడాలకు రూపకల్పన చేయడాన్ని అభినందించారు. ఈ రకమైన వరిసాగును ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయంతోపాటు పాడి, కోళ్ల పెంపకం, చేపల సాగు చేపడితే రైతులకు లాభదాయకమని చెప్పారు.

**సాగు బడ్జెట్ 12 వేల కోట్లు: మంత్రులు మహమూద్‌అలీ, నిరంజన్‌రెడ్డి**

రాష్ట్రంలో రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలుచేస్తూ సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలుస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతు అనుకూల ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. వ్యవసాయ రంగానికి చేయూత కోసం అనేక పథకాలు, విధానాలను ప్రవేశపెట్టారని వివరించారు. 57 లక్షల పైచిలుకు రైతులకు రైతుబంధు పథకం కింద ఏడాదికి ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతుందని, దీనికోసం గత బడ్జెట్‌లో రూ.12 వేలకోట్లు కేటాయించినట్టు తెలిపారు. తిరిగి చెల్లించాల్సిన అవసరంలేని పంట పెట్టుబడిని తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందజేస్తున్నదని, తద్వారా రైతులు అప్పులు చేసి ఇబ్బందుల్లో పడకుండా చేయూతనిస్తున్నదని చెప్పారు. రైతుల సామాజిక, ఆర్థిక భద్రత కోసం రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టామని, ప్రమాదవశాత్తు రైతులెవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు పదిరోజుల్లోనే రూ. ఐదులక్షల నగదు సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మెరుగైన సాంకేతికతను ఉపయోగించుకొని దిగుబడులు పెంచడం, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయడం, పంటకు గిట్టుబాటు ధర, రాయితీ అందించి ఆదాయం పెంచుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నదని వివరించారు. సదస్సులో పీజేటీఎస్‌ఏయూ వీసీ ప్రవీణ్‌రావు, సీఐఐ తెలంగాణ చైర్మన్ డీ రాజు, అగ్రిటెక్‌సౌత్-2020 చైర్మన్ అనిల్‌కుమార్, వర్సిటీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



అగ్రిటెక్ సదస్సులో వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, అగ్రివర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు కూడా ఉన్నారు.



హైదరాబాద్ హాకాభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి కూడా ఉన్నారు.

# 45 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు

- తెలంగాణ విజ్ఞప్తికి కేంద్రం సానుకూలం
- రైతులను ఆర్థిక పరిపుష్టి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యం
- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయిల్‌పాం సాగు అనుమతి కోసం తెలంగాణ పెట్టిన ఫైలుకు అనుమతి లభించిందన్నారు. ఆయిల్‌పాం సాగుకు కేంద్రం అనుమతి నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని హాకాభవన్‌లో మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. రానున్న రెండేండ్లలో 45,250 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం లేఖ పంపిందని తెలిపారు. విదేశీ మారకాన్ని ఆదాచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఇప్పటికే పంటకాలనీల ఏర్పాటుకు సంబంధించిన నివేదిక సిద్ధమైందని వెల్లడించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయహోదా కల్పించి తోడ్పాటునందించాలని మంత్రి విజ్ఞప్తిచేశారు. రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వ్యవసాయంలో పథకాలను ప్రవేశపెడుతున్నారని, ఆయన నాయకత్వంలో వ్యవసాయం స్వరూపమే మారిపోయిందన్నారు. కంది రైతులు ఆందోళన చెందవద్దని, కందుల కొనుగోలుపై కేంద్రానికి విజ్ఞప్తిచేశామని తెలిపారు. కందులన్నింటినీ కొనుగోలు చేస్తామని చెప్పారు.

### అందరికీ అందుతున్న రైతుబంధు నిధులు

ప్రభుత్వం పంట పెట్టుబడిగా అందిస్తున్న రైతుబంధు నిధులు అందరికీ అందుతున్నాయని మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు. రైతుల ఖాతాల్లోనే నేరుగా నిధులను జమచేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల సాంకేతికలోపం కారణంగా నిధులు ఖాతాలకు బదిలీ కావడంలేదని, ఈ లోపాన్ని త్వరలోనే అధిగమిస్తామని చెప్పారు. దీనికోసం ప్రత్యేకసెల్ ఏర్పాటుచేసి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. రైతుబంధు సీలింగ్‌పై ప్రభుత్వం ఇప్పటివరకు ఆలోచన చేయలేదని, పంట రుణాల స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని కేంద్రాన్ని కోరామని పేర్కొన్నారు. రైతుబంధు అమలుతో రైతు ఆత్మహత్యలు తగ్గాయని తెలిపారు.

### లోకం పోకడ




ఈ కరోనా వైరస్ రాకుండా యాంటీ వైరస్ వేయడం మా వల్ల కాదంటే వినరేమయ్యా?!

# 'సైలెంట్ వాయిస్'కు అంతర్జాతీయ అవార్డు

- హైదరాబాద్ షార్ట్‌ఫిల్మ్‌కు మొదటి బహుమతి
- న్యూయార్క్‌లో జరిగిన లంపా ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదానం

**మణికొండ, నమస్తే తెలంగాణ:**

చెరువుకు నోరుంటే ఎవరైనా ఆక్రమిస్తారా? కలుషిత జలాలు దానిని కబళిస్తాయా? తనచుట్టూ పచ్చదనంతో.. పక్షుల కిలకిలారావాలతో ఆహ్లాదాన్ని పంచే చెరువులు దురాక్రమణకు గురవుతూ, కాలుష్యంబారిన పడుతూ మౌనంగా రోదిస్తున్నాయి. ఈ రోదనను ఆలకించలేని సమాజం చెరువులను కబళిస్తూ తన అంతాన్ని తానే కొనితెచ్చుకుంటున్నది. ఈ ఇతివృత్తంతో నిర్మించిన ఓ లఘు చిత్రానికి అంతర్జాతీయ అవార్డు దక్కింది. హైదరాబాద్ శివారులోని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోగల నెక్నాంపూర్ చెరువులో కాలుష్యం, దురాక్రమణలతోపాటు మరో 17 అంశాలతో యువ దర్శకుడు అన్‌శూల్ ఈ లఘుచిత్రాన్ని తెరకెక్కించారు. 'సైలెంట్ వాయిస్ (మౌనరోదన)' పేరుతో రూపొందిన ఈ షార్ట్‌ఫిల్మ్‌లో ఓ మూగ బాలికతో చెరువు తన గోడును వెళ్లబోసుకుంటుంది. చెరువులకు నోరుంటే తనను తాను రక్షించుకుని మరింత మందికి ఆహ్లాదాన్ని పంచగలదు, కాలుష్యాన్ని అరికట్టగలదన్న సందేశాన్ని దర్శకుడు ఈ చిత్రం ద్వారా అందించేందుకు ప్రయత్నించారు. కేవలం రెండున్నర నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రం అమెరికాలోని న్యూయార్క్‌లో శనివారం జరిగిన లంపా అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతిని దక్కించుకుంది. తమ లఘుచిత్రానికి అంతర్జాతీయ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని చిత్ర నిర్మాత సునీల్ సత్యవోలు తెలిపారు.



న్యూయార్క్ లంపా ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్న అన్‌శూల్‌ను అభినందిస్తున్న ప్రతినిధులు



నటి అమల అక్కినేని, రాజస్థాన్ అధికారి సుచిశర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న టెమ్రిస్ కార్యదర్శి షఫీఉల్లా

## టెమ్రిస్‌కు వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్ అవార్డు

- ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్నందుకు ఎంపిక
- అవార్డు అందుకున్న టెమ్రిస్ కార్యదర్శి షఫీఉల్లా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టెమ్రీస్)కు 'వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్-2020' అవార్డు దక్కింది. పేద మైనార్టీ విద్యార్థులకు ఉన్నతప్రమాణాలతో విద్యను అందిస్తున్నందుకుగాను అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్రప్రభుత్వ సహకారంతో ఎలెట్స్ టెక్నోమీడియా ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఐదో వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్-2020 సదస్సులో రాజస్థాన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సుచిశర్మ, సినీనటి అమల అక్కినేని చేతుల మీదుగా టెమ్రీస్ కార్యదర్శి షఫీఉల్లా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా షఫీఉల్లా మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు మొట్టమొదటిసారి తెలంగాణలో సాకారమయ్యాయన్నారు. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మైనార్టీల కోసం సీఎం కేసీఆర్ 204 గురుకులాలను ఏర్పాటుచేశారని గుర్తుచేశారు.

## ఇమ్యునైజేషన్‌లో తెలంగాణది ఉన్నతస్థానమే!

- 94.89 శాతం ఇమ్యునైజేషన్
- 54.20% సాంకేతిక తప్పిదం
- లోక్‌సభలో సరైన నివేదిక ఇస్తాం
- ఇమ్యునైజేషన్ విభాగం ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శిశువులకు సకాలంలో టీకాలు వేయించడంలో తెలంగాణ రాష్ట్రం ఉన్నతస్థానంలో ఉన్నదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ఇమ్యునైజేషన్ విభాగం స్పష్టంచేసింది. టీకాలు వేయించడంలో తెలంగాణ రికార్డుస్థాయిలో 94.89 శాతాన్ని నమోదుచేసిందని వెల్లడించింది. ఉద్దేశపూర్వకంగా కాకుండా సాంకేతిక తప్పిదంతోనే తమ నివేదికలో 54.20 శాతంగా అచ్చయిందని పేర్కొన్నది. సవరించిన నివేదికను మార్చి 2న ప్రారంభమయ్యే లోక్‌సభ సమావేశంలో ప్రవేశపెడుతామని ప్రకటించింది. 'తెలంగాణ ఎట్ బాటమ్ ఇన్ చైల్డ్ ఇమ్యునైజేషన్; రికార్డ్స్ పాయింట్ అవుట్ లాక్సిటీ ఇన్ కవరేజ్' పేరిట టైమ్స్ ఆఫ్ ఇండియా శుక్రవారం తప్పుడు కథనాన్ని ప్రచురించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, రాష్ట్ర ఆరోగ్యశాఖ తీవ్రంగా ఖండించింది. ఈ కథనం వివాదాస్పదం అవడంతో శనివారం కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టనిస్తూ ఒక ప్రకటన జారీచేసింది. వాస్తవానికి భావిపౌరుల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఇమ్యునేజేషన్ శాతం క్రమంగా పెరుగుతున్నది. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం నివేదిక -2019 ప్రకారం జనవరి నాటికి ఇమ్యునైజేషన్‌లో దేశంలోనే తెలంగాణ పదో స్థానంలో నిలిచింది.





శనివారం కేరళ పోతన్‌కోడ్‌లోని శ్రీ శాంతిగిరి ఆశ్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సత్కరిస్తున్న శాంతిగిరి ఆశ్రమం అధ్యక్షుడు చైతన్య జ్ఞాన తపస్వి తదితరులు

## తెలంగాణ, కేరళ మధ్య స్నేహబంధం

### తెలంగాణలో 'శాంతిగిరి ఆయుర్వేదం' విస్తరణకు చర్యలు

### కేరళ పర్యటనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలున్నాయని, తమ రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది మలయాళీలు సంతోషంగా జీవిస్తున్నారని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన శనివారం పోతన్‌కోడ్‌లో ఉన్న శ్రీ శాంతిగిరి ఆశ్రమాన్ని సందర్శించారు. గురువు అభివంద్య అమృతజ్ఞాన తపస్వి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శ్రీ శాంతిగిరి ఆయుర్వేద రిసెర్చ్ ఫౌండేషన్ కొత్త వెంచర్‌ను కేంద్ర మంత్రి మురళీధరన్, ఎంపీ అదూర్ ప్రకాశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేరళలో వరదలు సంభవించినపుడు తెలంగాణ సీఎం కేసీఆర్ స్నేహహస్తాన్ని అందించారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శాంతిగిరి ఆయుర్వేద రిసెర్చ్ ఫౌండేషన్ సేవలను తెలంగాణలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మిడ్‌మానేరు, లోయర్ మానేరు, అనంతగిరి, మయూరి ఎకో టూరిజం పార్కుల్లో ఆయుర్వేద సేవలు ప్రారంభించాలని శాంతిగిరి సంస్థను కోరారు. కార్యక్రమంలో శాంతిగిరి ఆశ్రమం అధ్యక్షుడు చైతన్య జ్ఞాన తపస్వి, ప్రధాన కార్యదర్శి స్వామి గురురత్నం జ్ఞాన తపస్వి, కేరళ సభ, కాన్ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ప్రాంత మలయాళీ అసోసియేషన్ సభ్యుడు లిబి బెంజిమెన్ పాల్గొన్నారు.

# పట్టణప్రగతికి మార్గదర్శకాలు జారీ

- నిర్మాణ వ్యర్థాలను, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తొలిగించాలి
- సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణప్రగతికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ జారీచేసింది. ఈ నెల 24 నుంచి పదిరోజులపాటు పట్టణప్రగతి కార్యక్రమం జరగనున్నది. దీనిపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్లతో సమావేశమయ్యారు. పట్టణప్రగతిలో ప్రజలను భాగస్వాములను చేయాలని నిశ్చయించిన ప్రభుత్వం ఈ విషయమై ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడంతోపాటు పారిశుద్ధ్యం, పచ్చదనంతో పట్టణ ప్రాంతాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

**మార్గదర్శకాలు ఇవీ..**

- రహదారుల పక్కనున్న పొదలు, తుప్పలు, పిచ్చిమొక్కలు, గడ్డి మొక్కలతోపాటు జిల్లేడు, తుమ్మ చెట్లను తొలిగించాలి.
- రహదారి పక్కన ఉండే భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలి. పూడిక తీసి మురుగుకాల్వలను శుభ్రం చేయాలి. ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాలతోపాటు ప్రభుత్వ సంస్థలు, సముదాయ ప్రాంతాలను శుభ్రం చేయాలి.
- శిథిలావస్థలో ఉన్న గృహాలను తొలిగించాలి. ఎండిపోయిన, పాడుపడిన బోరు బావుల్ని మూసేయాలి. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలి.
- చెత్త సేకరణ, రవాణా కోసం బ్రాండింగ్ కలిగిన వాహనాలను సేకరించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలి.
- వంగిపోయిన, తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలను మార్చి వదులుగా ఉండే వైర్లను బిగించాలి. మీటర్లను మరమ్మతు చేయాలి. మోటర్లకు కొత్త కెపాసిటర్లను బిగించాలి. పాదాచారుల బాటలపై ఉన్న స్తంభాలను గుర్తించి వాటిని తొలిగించడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలి.
- ఇండ్లపై నుంచి వెళ్లే విద్యుత్ వైర్లను గుర్తించి ప్రభుత్వానికి అంచనాలు పంపాలి. రోడ్లపై ఉన్న స్తంభాలను గుర్తించి అదనపు స్తంభాలను ఏర్పాటు చేయాలి.
- పార్కులు, సామూహిక మరుగుదొడ్లు, కూడళ్లు తదితర ప్రాంతాల్లో అవసరమైన చోట వీధిదీపాల మదింపు జరగాలి.
- చిన్న మున్సిపాలిటీల్లో నర్సరీల ఏర్పాటు వీలుకాకపోతే జిల్లా కలెక్టర్ల సహకారం, సమన్వయంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సమీప పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేయాలి.
- ఇండ్లలో నాటేందుకు మొక్కలను పంపిణీ చేయాలి. గతంలో నాటిన మొక్కలకు ట్రీగార్డులతో రక్షణ కల్పించాలి. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలి. పచ్చదనాన్ని పెంపొందించేందుకు వార్డులవారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.
- డంపింగ్ యార్డుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలి.
- శ్మశానవాటికలకు స్థలాలను గుర్తించాలి.
- సమీకృత మార్కెట్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలి.
- ఆటో, రిక్షా స్టాండ్లతోపాటు వీధి వ్యాపారుల జోన్ ఏర్పాటు చేయాలి.
- హరిత ఉద్యానవనాలు, పార్కులు, ఆటస్థలాలు ఏర్పాటుచేయాలి.

## త్వరలోనే వీసీల నియామకం

### ఈసీ సభ్యుల కసరత్తు పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో పాలకమండళ్లను (ఈసీ) నియమించే అంశంపై కసరత్తు దాదాపు పూర్తికావచ్చింది. మూడువారాల్లో వీసీల నియామకం చేపట్టాలనే సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. వీసీల నియామకం పూర్తికాగానే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులను కూడా భర్తీచేసే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

## మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అర్హులైన విద్యార్థులు మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టెమ్రీస్ కార్యదర్శి షఫీఉల్లా కోరారు. ఇందుకు టెమ్రిస్ అధికారిక వెబ్‌సైట్‌ను ప్రెసిడెంట్ ఏకే ఖాన్ శనివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతిలో 14,640 సీట్లు, 83 జూనియర్ కళాశాలల్లో 6,640 సీట్లు అందుబాటులో ఉన్నాయని షఫీఉల్లా, ఏకే ఖాన్ తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 20 వరకు గడువు ఉన్నదన్నారు. వివరాలకు www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## టిక్‌టాక్ కలిపిన బంధం

- ఏడేండ్ల క్రితం తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు
- రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలోని ఇంటికి చేరిన కొడుకు



రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ఇంటికి చేరుకున్న ఖాసింతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు

**తలకొండపల్లి:** టిక్‌టాక్ వీడియో ఓ కుటుంబంలో ఎనలేని సంతోషం నింపించింది. ఏడేండ్ల క్రితం తప్పిపోయిన ఒక్కగానొక్క కొడుకును ఇంటికి చేర్చింది. ఓ తల్లి కడుపు కోత తీర్చింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలకేంద్రానికి చెందిన కుమ్మరి పద్మమ్మ, పెంటయ్య దంపతులకు కొడుకు, కూతురు. కొడుకు ఖాసిం మూగవాడు. 15 ఏండ్ల వయస్సులో ఏడేండ్ల క్రితం తప్పిపోయాడు. అప్పటినుంచి అతడి కోసం కుటుంబసభ్యులు వెతుకుతూనే ఉన్నారు. అసలు బతికున్నాడో లేక చనిపోయాడో అని తరుచూ బాధపడేవారు. ఈ క్రమంలో వారం క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొల్లూరు గ్రామానికి చేరుకున్న ఖాసింను మూగవాడిగా గుర్తించిన స్థానిక యువకులు.. అతడి వివరాలతో టిక్‌టాక్ వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఒక గ్రూప్ నుంచి మరో గ్రూప్‌లోకి మారిన ఖాసింవీడియో.. తలకొండపల్లి వాట్సప్ గ్రూపుల్లోకి వచ్చింది. వీడియోను చూసిన గ్రామస్థులు ఖాసింను గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

**అంతలోనే మాయం..**

టిక్‌టాక్ వీడియోచూసి కొడుకు ఖాసిం కోసం కుటుంబసభ్యులు కొల్లూరుకు వెళ్లారు. ఖాసింను మూడ్రోజులపాటు తమ వద్ద ఉంచుకున్న గ్రామస్థులు అదేరోజు రాత్రి రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి వెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఖాసిం తల్లిదండ్రులు.. తమ కొడుకు ఎక్కడని పోలీసులను ప్రశ్నించగా.. ఉదయం టిఫిన్ కోసం బయటకు వెళ్లాడని సమాధానమిచ్చారు. నాలుగు రోజులపాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో నిరాశగా ఇంటికి చేరుకున్నారు. శనివారం తలకొండపల్లికి చెందిన తుమ్మ వీణ అనే యువతి వ్యక్తిగత పనినిమిత్తం సికింద్రాబాద్‌కు వెళ్లగా.. అక్కడే ఉన్న ఖాసింను గుర్తించి గ్రామస్థులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. సికింద్రాబాద్ నుంచి సంతోష్‌నగర్ వరకు తనతోపాటు తీసుకొచ్చింది. అక్కడే ఉంటున్న బంధువులకు ఖాసింను అప్పగించింది. బంధువు ఖాసింను తీసుకుని తలకొండపల్లికి చేరుకున్నారు. కొడుకు ఇంటికి రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.








బడ్జెట్ రూపకల్పనపై శనివారం బీఆర్కేభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

## 25లోగా బడ్జెట్ ప్రతిపాదనలివ్వండి

### అధికారుల సమీక్షలో ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను షెడ్యూల్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమశాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ ప్రతిపాదనలను ఈ నెల 25 (మంగళవారం)లోగా సిద్ధంచేయాలని ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. బడ్జెట్ రూపకల్పనపై శనివారం ఆయన బీఆర్కేభవన్‌లో అధికారులతో సమీక్షించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించేందుకు మరోసారి సమావేశం కావాలని సూచించారు. సమావేశంలో మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు ఏకే ఖాన్, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి అహ్మద్ నదీం, డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, ఎస్సీ గురుకులాల కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, టెమ్రీస్ కార్యదర్శి షఫీఉల్లా, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కరుణాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలవద్దకే జీఎస్టీ అధికారులు

- సమస్యల పరిష్కారానికి అవుట్‌రీచ్ కార్యక్రమాలు
- 25 నుంచి జిల్లాలవారీగా ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిటర్నుల దాఖలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలతోపాటు పన్ను రేట్లకు సంబంధించిన ఇబ్బందులను, ఇతర సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు జీఎస్టీ అధికారులు ఈ నెల 25 నుంచి వచ్చేనెల 5 వరకు 'జిల్లా జిల్లాలో మీవద్దకు కేంద్ర జీఎస్టీ' అనే నినాదంతో అవుట్‌రీచ్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పన్ను చెల్లింపుదారులు, ట్రేడర్లు, ట్యాక్స్ ప్రాక్టీషనర్లు, వ్యాపారవర్గాలతో సమావేశాలను నిర్వహించనున్నట్లు కేంద్ర జీఎస్టీ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో ఈ నెల 25న జీఎస్టీ అవుట్‌రీచ్ కార్యక్రమం ఉంటుందని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు అమరేందర్, తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సంఘం అధ్యక్షుడు నగేశ్ తెలిపారు. తెలంగాణలోని ట్యాక్స్ ప్రాక్టీషనర్లంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

## వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు

### గుజరాత్ భాగస్వామ్య సదస్సులో తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ శోభ



గుజరాత్ గాంధీనగర్‌లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ శోభ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గుజరాత్ గాంధీనగర్‌లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-కాప్-13)లో తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో స్టాల్‌ను నెలకొల్పారు. రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణకు తీసుకొంటున్న చర్యలను అధికారులు వివరించారు. వన్యప్రాణులు, వలసజాతుల సంరక్షణపై అంతర్జాతీయ కాప్ సదస్సు ఈ నెల 17 నుంచి ఆరురోజులపాటు జరిగింది. 130 దేశాలకు చెందిన దాదాపు మూడువేల మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో తెలంగాణ అటవీశాఖ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతర్ధాన దశకు చేరుకొన్న మూషిక జింకలు (మౌజ్ డీర్) పునరుత్పత్తిని హైదరాబాద్ జూపార్కులో చేపట్టి తిరిగి అడవుల్లో విడుదల చేస్తున్న తీరుతెన్నులను అధికారులు వివరించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ అటవీ ప్రాంతంలో రాబందులను సంరక్షిస్తున్న విధానం విశేషంగా ఆకట్టుకొన్నది. ఈ స్టాల్‌ను కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్, కేంద్ర సహాయమంత్రి బాబుల్ సుప్రియో, గుజరాత్ సీఎం విజయ్ రూపానితోపాటు పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు సందర్శించి ప్రశంసించారు. ఈ సదస్సులో తెలంగాణ అటవీశాఖ తరపున పీసీసీఎఫ్ ఆర్ శోభ, అదనపు పీసీసీఎఫ్ సిద్ధానంద్ కుక్రేటీ, నెహ్రూ జూపార్కు డైరెక్టర్ క్షితిజ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.






## 675 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

- రూ.3వేల కోట్ల పెట్టుబడికి ఆమోదం
- సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2020- 21 ఆర్థిక సంవత్సరంలో 675 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి లక్ష్యం నిర్దేశించుకొన్నది. ఇందుకు రూ.3 వేల కోట్ల పెట్టబడి పెట్టాలని నిర్ణయించింది. శనివారం సింగరేణిభవన్‌లో సీఎండీ ఎన్ శ్రీధర్ అధ్యక్షతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం జరిగింది. లక్ష్యాలు, పెట్టుబడుల అంచనా వ్యయానికి బోర్డు ఆమోదం తెలిపింది. అనుకున్న మేర బొగ్గు ఉత్పత్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకోవాలని బోర్డు నిర్ణయించింది. ఓపెన్‌కాస్టు గనుల్లో ఓబీ తొలిగింపు, ఇతర పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు బోర్డు అంగీకారం తెలిపింది. మైన్ ప్లాన్ల కొత్త ప్రతిపాదనలను బోర్డు ఆమోదించింది. సమావేశంలో బోర్డు సభ్యులైన రాష్ట్ర ప్రభుత్వ ఇంధనశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ మిశ్రా, బొగ్గు మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ పీఎస్ పాల్‌స్వామి, వెస్టన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా, సింగరేణి డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# హెలికాప్టర్‌లో చక్కర్ కొడుదాం!


మొదటిపేజీ తరువాయి...


ధర నిర్ణయించారు. ఈ సేవలను పొందేందుకు బుకింగ్ కోసం పెద్దసంఖ్యలో ఆసక్తి చూపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకే హెలికాప్టర్ నడిపేందుకు అవకాశం ఉండటంతో అందరికీ సేవలు అందడంలేదు.

### హెలిసేవలకు డిమాండ్



అన్ని వర్గాలవారికి ఇది మంచి అవకాశం. హెలికాప్టర్ బుకింగ్ కోసం చాలామంది ప్రయత్నిస్తున్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరువతో లాభనష్టాలు పక్కనపెట్టి సేవలు కొనసాగిస్తున్నాం. హెలిసేవలకు భవిష్యత్ ఉన్నది. నిర్దేశిత ప్రాంతాలకు శాశ్వతంగా ఈ సేవలు అందించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. రూ.మూడువేల ప్యాకేజీకి డిమాండ్ ఎక్కువగా ఉన్నది.

-భరత్‌రెడ్డి, తెలంగాణ ఏవియేషన్ కార్పొరేషన్ డైరెక్టర్



హెలికాప్టర్‌లో బర్త్‌డే కేక్ కట్‌చేస్తున్న అనంత్‌కృష్ణ

## ఆకాశవీధిలో జన్మదిన వేడుక

**వేములవాడ, నమస్తే తెలంగాణ:** వేములవాడకు చెందిన శ్రీసన్నిధి అనంత్‌కృష్ణ తన 9వ జన్మదిన వేడుకలను వినూత్నరీతిలో ఆకాశవీధిలో జరుపుకున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి శనివారం వేములవాడ నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం మీదుగా హెలికాప్టర్‌లో ప్రయాణిస్తూ కేక్ కట్‌చేశాడు. కుమారుడి జన్మదిన వేడుకను ఆకాశంలో జరుపుకోవడం మరిచిపోలేని మధురజ్ఞాపకంగా మిగిలిపోతుందని తల్లిదండ్రులు వెంకటకృష్ణ, దివ్య సంతోషం వ్యక్తంచేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్!

- 15-20 మంది మావోయిస్టులు చనిపోయారని ప్రచారం!
- అధికారికంగా వెల్లడించని అధికారులు
- దండకారణ్యంలో కొనసాగుతున్న ఆపరేషన్ ప్రహార్

**చర్ల రూరల్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతపై అక్కడి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ప్రారంభమైన ఆపరేషన్ ప్రహార్ కొనసాగుతున్నది. బీజాపూర్, దంతేవాడ, సుక్మా, కాంకేర్, నారాయణపూర్ జిల్లాల్లో సుమారు రెండు వేల మంది కోబ్రా, డీఆర్జీ పోలీసు బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో పలుచోట్ల మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పుల ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. నాలుగురోజుల కిందట చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కసల్‌పాడులో భీకర ఎదురుకాల్పులు జరిగాయని తెలుస్తున్నది. ఈ కాల్పుల్లో 15 నుంచి 20 మంది మావోయిస్టులు మృతిచెంది ఉంటారని స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. పలువురు మృతదేహాలను మావోయిస్టులు తీసుకువెళ్లి అంత్యక్రియలు జరిపినట్టుగా శనివారం సమాచారం బయటకు వచ్చింది. ఇందులో వాస్తవమెంత అనేది పోలీసులు ధ్రువీకరించాల్సి ఉన్నది.




నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 23 ఫిబ్రవరి 2020
WWW.NTNEWS.COM

# అంతర్జాతీయంగానూ అప్రతిష్ఠ

విశ్లేషణ



మాధవరం నాగేందర్

దేశంలో పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక ఆందోళనలు తగ్గుముఖం పట్టడం లేదు. షాహీన్‌బాగ్ భారత దేశంలో తియన్ మెన్ స్క్వేర్ అయ్యింది. మతభేదం లేకుండా ప్రజలందరూ షాహీన్‌బాగ్ నిరసనను గమనిస్తున్నారు. భారతీయ స్ఫూర్తికి భిన్నమైన చట్టాన్ని ప్రజలు ఇంతగా నిరసిస్తారని మోదీ ప్రభుత్వం ఊహించి ఉండదు. ఇటీవల ఎన్నికల్లో ఢిల్లీ రాష్ట్ర ప్రజలు కేజ్రీవాల్‌ను ఎన్నుకొని నిరసనలకు ఆమోదం తెలిపారు. కొన్ని రాష్ట్ర శాసనసభలు పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రం కూడా తీర్మానం చేయతలపెట్టింది. ఈ చట్టం పట్ల కేసీఆర్ స్పష్టమైన వైఖరి అవలంబించారు. పార్లమెంటులో చట్టాన్ని వ్యతిరేకించి టీఆర్‌ఎస్ సభ్యులు ఓటు వేసినప్పుడు ఆ చట్టంలో ఉన్న ప్రజా వ్యతిరేక విధానాలు చాలామందికి అవగాహన కాలేదు. ప్రజా నిరసన ఉవ్వెత్తున లేచినప్పుడు మాత్రమే చట్టంలోని ఆందోళనకరమైన అంశాలు చర్చకు వచ్చాయి. గంగా జమున తెహజీబ్ సంస్కృతిని కలిగి ఉన్న అతికొద్ది ప్రాంతాల్లో తెలంగాణ ఒకటి. హైందవ ముస్లిం సంస్కృతుల మేళవింపుగా ప్రజల ఆచారవ్యవహారాలు సాగించే అరుదైన సంప్రదాయం తెలంగాణలో ఉన్నది. ఇదే సంప్రదాయాన్ని శతాబ్దాలుగా కొనసాగించిన లక్నో, వారణాసి, అలహాబాద్, అయోధ్య ప్రాంతాలు మత వైషమ్యాలతో కలుషితమయ్యాయి. కానీ గాంధీ ప్రశంసించిన హైదరాబాద్ సంస్కృతి జీవనదిలా ప్రవహిస్తున్నది.

పౌరసత్వ చట్టంపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం విమర్శకులందరిని పాకిస్థాన్ ఏజెంట్లుగా, దేశద్రోహులుగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేస్తున్నది. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో మైనారిటీలు వివక్షకు గురవుతున్నారని ఈ చట్టంలో చేర్చడం జరిగిందని చెప్తున్నారు. దేశ విభజనతో సంబంధం లేని ఆఫ్ఘనిస్థాన్ ఈ లిస్టులో ఉండాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? హిందూ పక్షపాత ప్రభుత్వం అయినప్పుడు హిందువులకు ఇబ్బందులు కలిగిస్తున్న శ్రీలంక, భూటాన్ దేశాలను ఈ లిస్టులో ఎందుకు చేర్చలేదు? లౌకిక కాంగ్రెస్ ప్రభుత్వం అశ్రద్ధ వహించి ఉండవచ్చు కానీ హిందూ ధర్మ పరిరక్షణ కోసం అవతరించిన ఈ ప్రభుత్వం శ్రీలంక శరణార్థులకు మానవతా దృక్పథంతో పౌరసత్వం ఎందుకు ఇవ్వలేకపోయింది? దశాబ్దాలుగా శ్రీలంక శరణార్థులు దయనీయమైన జీవనం సాగిస్తున్నారు. భూటాన్ మత వివక్ష విధానం వల్ల లోట్స్యాంపాలుగా పిలవబడుతున్న హిందువులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2011లో యాభై వేల మంది హిందువులను క్యాంపుల్లో నిర్బంధిస్తే ప్రపంచదేశాలు జాలిపడి తమతమ దేశాల్లో పౌరసత్వం ఇచ్చాయి. అమెరికా 42 వేల మంది హిందువులకు పౌరసత్వం ఇచ్చింది. గమనించవలసిన విషయమేమంటే ఈ దేశాలన్నీ క్రైస్తవ మత ప్రాబల్యం కలిగినవి. సుమారు లక్ష మంది హిందువులను భూటాన్ నుంచి వెళ్లగొట్టారు. 76,000 మంది ఇంకా క్యాంపుల్లో నిర్బంధంలో ఉన్నారు. మానవహక్కుల పరిరక్షణ కోసమైనా భారత ప్రభుత్వం తన నిరసనను తెలిపి ఉండాల్సింది. మోదీ ప్రభుత్వమే తీవ్ర మత వివక్ష అవలంబించడం వల్ల ఇతర దేశాలకు సలహాలిచ్చే అర్హతను కోల్పోయింది. హిందువులపై ఈ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే శ్రీలంక, భూటాన్ శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఉండాల్సింది. ఏ మైనారిటీ భారతీయుడు అభ్యంతరం తెలిపి ఉండేవాడు కాడు. శ్రీలంక, భూటాన్ కూడా ముస్లిం దేశాలై ఉంటే పౌరసత్వ చట్టంలో కాందిశీకులకు మేలు జరిగి ఉండేదేమో అనే అనుమానం కలుగుతున్నది.

పౌరసత్వ సవరణ చట్టంలోని సెక్షన్ 7 ప్రకారం ప్రవాస భారతీయులకు కూడా ఇబ్బందులను కలిగించే అంశాన్ని పెట్టారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2005లో ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా అనే ఓసీఐగా పిలవబడుతున్న కార్డును ప్రవాస భారతీయులకు ప్రవేశపెట్టడం జరిగింది. ప్రవాస భారతీయులకు ఓటు హక్కు తప్ప పౌరులతో సమానంగా అన్ని హక్కులు లభించాయి. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం ఓసీఐ కార్డును రద్దుచేసే అధికారం తీసుకున్నది. బ్రిటిష్ వాళ్లు ప్రవేశపెట్టిన అనేక చట్టాలలో ఏ సెక్షన్ ప్రకారమైనా దొంగ కేసు పెట్టి భారతీయ మూలాలకు అనుబంధమైన ఓసీఐ కార్డును రద్దుచేయడానికి అవకాశం ఉన్నది. ఇటీవల మోదీ అమెరికా పర్యటించినప్పుడు ఏడు వేల మంది నిరసన ప్రదర్శన చేశారు. ఆధారాల్లేకున్నా రాజద్రోహం, దేశద్రోహం అనే కేసులు పెట్టడానికి బ్రిటిష్ చట్టాల్లో అనేక అవకాశాలున్నాయి. అర్బన్ నక్సలైట్ అని ముద్రవేసి ఎనభై ఏండ్లు దాటిన వృద్ధులను కూడా సంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. విదేశాల్లో నిరసన గళం విప్పుతు న్న ప్రవాసభారతీయుల ఓసీఐ కార్డును రద్దుచేసి, వీసా కూడా ఇవ్వకుండా ఇబ్బం దులకు గురిచేసే కుట్రపూరితమైన ఆలోచనలా కనిపిస్తున్నది.




**శరణార్థుల పట్ల శ్రద్ధ ఉంటే వారికి పౌరసత్వం కేసు పరిష్కారమయ్యేంతవరకు తాత్కాలిక వసతితో పాటు విద్య, వైద్య, ఉద్యోగ సౌకర్యాలు కల్పించి ఉండాల్సింది. అభివృద్ధి చెందిన దేశాలు మత ప్రమేయం లేకుండా శరణార్థులందరికీ కనీస అవసరాలు తీరుస్తాయి. ఉగాండాలో, భూటాన్‌లో వివక్షకు గురైన హిందువులకు అమెరికా అలాంటి వసతులు కల్పించింది. 113 కోట్ల మంది నివసిస్తున్న దేశంలో 31 వేల మందికి పౌరసత్వం ఇవ్వడానికి ఈ ప్రభుత్వం ఇంతటి రాజకీయం చేయాల్సిన అవసరం ఉన్నదా? ప్రతి అంశం రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకోవాలని ప్రయత్నించడమే ఇప్పుడున్న అలజడులకు కారణం. ఆఫ్ఘనిస్థాన్‌లో గత రెండు దశాబ్దాలుగా భారతదేశం వేలకోట్ల ఖర్చుతో మౌలిక సౌకర్యాలు కల్పించింది. దక్షిణాసియాలో అన్నిదేశాలు చైనా ప్రభావంలోకి వెళ్లాయి. ఒక్క బంగ్లాదేశ్ మాత్రమే భారతదేశం వైపున ఉన్నది.**

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అణిచివేతకు గురై భారతదేశంలోకి వలసవచ్చిన లక్షలాదిమంది హిందూ శరణార్థులకు ఈ చట్టం వల్ల ప్రయోజనం కలుగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పాడు. ఆయన ఆధ్వర్యంలో ఉన్న ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ పార్లమెంటు కమిటీకి సమర్పించిన లెక్కలు వేరుగా ఉన్నాయి. ఈ చట్టం ప్రకారం పౌరసత్వం అర్హతలు కలిగిన హిందువులు 25,447, సిక్కులు 5,807, క్రైస్తవులు 55, బౌద్ధులు 2, పార్శీలు 2–మొత్తం 31,313 మంది ప్రయోజనం పొందుతారు. పాశ్చాత్య దేశాల్లోని చట్టాల వలె పొరుగు దేశాల్లో మత వివక్షకు గురై, వలసవచ్చి ఐదేండ్ల పైబడి భారతదేశంలో నివసిస్తున్న వారికి మత ప్రస్తావన లేకుండా పౌరసత్వం ఇచ్చినట్లయితే ఇప్పుడు ఉన్న 31,313 మంది ఇంత రభస లేకుండానే ప్రయోజనం పొందేవారు.

శరణార్థుల పట్ల శ్రద్ధ ఉంటే వారికి పౌరసత్వం కేసు పరిష్కారమయ్యేంతవరకు తాత్కాలిక వసతితో పాటు విద్య, వైద్య, ఉద్యోగ సౌకర్యాలు కల్పించి ఉండాల్సింది. అభివృద్ధి చెందిన దేశాలు మత ప్రమేయం లేకుండా శరణార్థుల అందరికీ కనీస అవసరాలు తీరుస్తాయి. ఉగాండాలో, భూటాన్‌లో వివక్షకు గురైన హిందువులకు అమెరికా అలాంటి వసతులు కల్పించింది. 113 కోట్ల మంది నివసిస్తున్న దేశంలో 31 వేల మందికి పౌరసత్వం ఇవ్వడానికి ఈ ప్రభుత్వం ఇంతటి రాజకీయం చేయా ల్సిన అవసరం ఉన్నదా? ప్రతి అంశం రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకోవాలని ప్రయత్నించడమే ఇప్పుడున్న అలజడులకు కారణం. ఆఫ్ఘనిస్థాన్‌లో గత రెండు దశాబ్దాలుగా భారతదేశం వేలకోట్ల ఖర్చుతో మౌలిక సౌకర్యాలు కల్పించింది. దక్షిణాసియాలో అన్ని దేశాలు చైనా ప్రభావంలోకి వెళ్లాయి. ఒక్క బంగ్లాదేశ్ మాత్రమే భారతదేశం వైపున ఉన్నది. షేక్ హసీనా నాయకత్వంలో 8 శాతం అభి వృద్ధి రేటుతో బంగ్లాదేశ్ లౌకికవాద దేశంగా అద్భుత ప్రగతి సాధిస్తున్నది. బట్టలు ఎగుమతిలో చైనాతో పోటీ పడుతున్నది. ఇప్పుడు చైనాలో వచ్చిన వైరస్ వల్ల బంగ్లాదేశ్ బట్టలు ఎగుమతిలో ప్రథమ స్థానం వహించే అవకాశం ఉన్నది. భారతదేశం అవకాశం ఇస్తే సగం మంది బంగ్లాదేశీయులు భారత్ వస్తారని కేంద్ర మంత్రి అనడం ఆ దేశాన్ని అగౌరవపరుచడమే. భారతదేశం 4 శాతం ఆర్థిక వృద్ధితో కుంటి నడక నడుస్తుంటే బంగ్లాదేశ్ ప్రగతి కొన్ని రంగాల్లో చైనాకు ఇబ్బందికరంగా తయా రైంది. ఆర్థికరంగంలో ప్రపంచదేశాలతో పోటీ పడాల్సిన భారతదేశం మతవాద రాజకీయాల కోసం పొరుగున ఉన్న మిత్రదేశాలతో అకారణంగా వైరం తెచ్చుకొని దశాబ్దాల తరబడి పెంచుకున్న స్నేహబంధాన్ని తెంచుకొనే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వచర్యలు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాల్లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా భారతదేశానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. వాటిని సరిదిద్దడానికి కొన్ని దశాబ్దాలు పడుతుంది.

**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు, వాషింగ్టన్ డీసీ)**

# ప్రేమతత్వం.. జాను!

సినిమా



కె.వి.రవికుమార్

ప్రేమకన్నా మధురమైనది.. అనే పేరుతో నా అభిమాన రచయితల్లో ఒకరైన రంగనాయకమ్మగారు గతంలో ఒక నవల రాశారు. ఆత్మగౌరవానికి, ప్రేమకు మధ్య వైరుధ్యం తలెత్తినప్పుడు ప్రేమను వదులుకొని ఆత్మగౌరవం బాటన నడువాలన్నది ఆ నవల సారాంశం. రంగనాయకమ్మగారి ఇతర రచనల్లాగే ఇదికూడా ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. కానీ, ఆ నవల చెప్పే ఆదర్శం పైనే ఉంది సమస్యంతా. ఇటీవల విడుదలైన జాను అనే సినిమా (తమిళంలో 96 అనే సినిమా దీనికి మూలం) నేపథ్యంలో ప్రేమ గురించి, ప్రేమతత్వాన్ని (Philosophy of Life) గురించి మరోసారి మాట్లాడుకోవాల్సిన అవసరం వచ్చింది.


వినటానికి ఆశ్చర్యంగా ఉండవచ్చు గానీ.. ప్రేమకు ఆత్మగౌరవానికి పొసగదు. దీనిని జీర్ణం చేసుకోవటం కష్టం అనుకుంటే.. ప్రేమకు, స్వార్థానికి పొసగదని మనకు తెలిసిన మాటల్లోకి మార్చుకోవచ్చు. అప్పుడు స్వార్థమంటే ఏమిటన్న ప్రశ్న వస్తుంది. తనకు, తన ప్రయోజనాలకు సంబంధించినదే స్వార్థం. నేను, నా జీవితం, నా సంపద, నా హోదా, నా సుఖం, నా సంతోషం.. ఈ జాబితాలోకి 'నా గౌరవం' కూడా వస్తుంది. 'నా గౌరవం' అనేది కూడా స్వార్థమే. 'నా' అనేదానిని ఆత్మ (self) అన్న పదంతో కూడా పూరించవచ్చు. కాబట్టి.. నా గౌరవం అంటే ఆత్మ గౌరవమే. 'నా' అనేదానిని సంపూర్ణంగా పక్కనపెట్టినప్పుడే అవధుల్లేని, అపరిమితమైన, సంపూర్ణమైన ప్రేమను ఆస్వాదించటం సాధ్యమవుతుంది. ఈ 'నా' అనేదాంట్లో సంపద, హోదా, సుఖం, సంతోషం వంటి సుపరిచిత మాటలే కాదు.. ఆత్మగౌరవం కూడా ఉంటుందని జాను సినిమా తెలియజేస్తుంది.

రామచంద్ర, జానకి అనే ఇద్దరు చిన్ననాటి స్నేహితుల కథే ఈ సినిమా. స్కూల్ రోజుల్లోనే వీరి మధ్య గాఢమైన స్నేహం మొదలవుతుంది. పదో తరగతి తర్వాత రామ్ కుటుంబం వేరే ఊరికి వెళ్లిపోవటంతో వీరి అనుబంధం భౌతికంగా నిలిచిపోయినా మానసికంగా కొనసాగుతుంది. వాళ్లిద్దరూ ఒకర్నొకరు తల్చుకోని రోజంటూ ఉండదు. మూడేండ్ల తర్వాత జానకిని కలుసుకోవటానికి రామ్ ఆమె చదివే కాలేజీకి వస్తాడు. కానీ, ఆ ఊరిలో తనను వెంబడించి వేధిస్తున్న ఒక పోకిరీ వచ్చాడని జానకి పొరపాటుగా భావించి అతడిని కలుసుకోవటానికి నిరాకరిస్తుంది. ఏదో కారణాల వల్ల జానకి తనను అసహ్యించుకుంటున్నదని, అందుకే తనను కలుసుకోలేదని భావించి రామ్ అక్కడ్నించి వెళ్లిపోతాడు. ఆ తర్వాత దాదాపు 20 ఏండ్లకు వారి స్కూల్ బ్యాచ్ పునఃసమావేశం సందర్భంగా వారిద్దరూ కలుసుకొని మాట్లాడుకున్నప్పుడు.. నాడు జరిగిన పొరపాటు తమ జీవితాలను ఏ విధంగా విడదీసిందో తెలుస్తుంది. అప్పటికి, జానకి పెళ్లి చేసుకొని సింగపూర్‌లో స్థిరపడుతుంది. ట్రావెల్ ఫొటోగ్రాఫర్‌గా వృత్తిపరంగా స్థిరపడిన రామ్.. జానకి జ్ఞాపకాలతోనే జీవిస్తూ పెళ్లి చేసుకోకుండా ఉండిపోతాడు. ఆ తర్వాత వాళ్లిద్దరూ తమ భావోద్వేగాలను పంచుకోవటం, తీవ్రమైన ఆవేదనతో జానకి సింగపూర్‌కు తిరిగి వెళ్లిపోవటంతో సినిమా ముగుస్తుంది.

ఇక్కడ మనం మాట్లాడుకోవాల్సిన విషయమేమంటే.. జానకి తనను అసహ్యించుకుంటున్నదని (పొరపాటుగానే) రామ్ అనుకున్నప్పటికీ ఆమెను అలా దశాబ్దాల పాటు ప్రేమిస్తూ, ఆమె జ్ఞాపకాలనే ఆలంబనగా చేసుకొని జీవించటం ఎలా సాధ్యమైంది? అలాగని.. రామ్ వ్యక్తిత్వం లేని మనిషి కాదు. తాను ఎంచుకున్న ట్రావెల్ ఫొటోగ్రఫీ అంటే అతడికి ప్రాణం. ఫొటోలు తీయటం కోసం సముద్రాల లోతుల్లోకి, మారుమూల అడవుల్లోకి, ఎడారుల్లోకి, పర్వతాలపైకి వెళ్లే సాహసి, పూర్తిస్థాయి ప్రొఫెషనల్. పనిలో భాగంగా పేదల వాడల్లో ఉండి వారితో సావాసం చేయగలడు.. స్టార్ హోటళ్లలోనూ గడుపగలడు. తన వృత్తితో అంతగా మమేకమైన వ్యక్తి అతను. తనచుట్టూ ఉన్నవారిని.. వారి హోదాతో సంబంధం లేకుండా గౌరవిస్తాడు. తన లగేజీని మోసుకెళ్లే రిక్షావాలా ఇబ్బంది పడుతుంటే.. అతడిని పక్కన నిల్చోబెట్టుకొని ఆ రిక్షాను తానే లాగేంత సహృదయుడు. తన వద్ద ఫొటోగ్రఫీ నేర్చుకునే తన స్టూడెంట్స్ పట్ల తండ్రిలాగా ఎంతో ప్రేమ చూపుతూనే.. వారిని కట్టుదిట్టమైన క్రమశిక్షణలో ఉంచే మంచి ఉపాధ్యాయుడు. హాస్య చతురత, స్నేహితులతో కలిసిపోయే తత్వం.. ఇవన్నీ రామ్ వ్యక్తిత్వంలోని అంశాలు. ఇటువంటి రామ్ పిచ్చివాడిలాగా జానకినే ఆరాధిస్తూ, పెండ్లి కూడా చేసుకోకుండా ఎందుకు ఉండిపోతాడు? అదికూడా జానకి తనను ద్వేషిస్తున్నదని తెలిసి (పొరపాటుగానే అయినప్పటికీ), ఆమె పెండ్లి చేసుకున్నదని, ఆమెకు ఒక కూతురు కూడా ఉన్నదని తెలిసి కూడా ఎందుకు ఆమె మీద అతడికి అంత ప్రేమ? అతడికి ఆత్మగౌరవం లేదా? లేదు. రామ్ జీవితాన్ని పరిశీలిస్తే జానకికి సంబంధించినంతవరకూ అతడికి ఆత్మగౌరవం లేదనే మనకు అర్థమవుతుంది. జానకిని ప్రేమించే విషయంలో రామ్‌కు 'నా' అనేదేమీ లేదు. ఆ 'నా'లో అతడి గౌరవం కూడా ఉంది. దానిని కూడా పక్కనపెట్టాడు. రామ్ జానకిని ప్రేమిస్తాడు.. అంతేతప్ప ఆమె నుంచి ఏమీ ఆశించడు.. చివరికి గౌరవాన్ని కూడా. ఆమె ప్రేమించినా, ద్వేషించినా అతడినుంచి ఆమె వైపు ప్రవహించేది అనురాగమే. ఎందుకంటే, రామ్‌కు రామ్, జానకి అనే ఇద్దరు వ్యక్తుల్లో జానకే సర్వస్వం.. రామ్ అవసరమే లేదు. అతడి ప్రేమ ఏ స్థాయిలో ఉంటుందంటే.. ఆమెకు సంబంధించిన చిన్న చిన్న వస్తువులను కూడా 22 ఏండ్లుగా పదిలంగా దాచుకుంటాడు. జానకిని కలుసుకున్నప్పుడు వాటిని అపురూపంగా చూపిస్తాడు (కాలేజీ రోజుల్లో మా క్లాస్‌లో ఒక స్నేహితుడు ఉండేవాడు. తను రహస్యంగా ప్రేమిస్తున్న అమ్మాయికి ఒకసారి ఒక పుస్తకం ఇచ్చాడు. ఆమె ఆ పుస్తకాన్ని తిరిగి ఇచ్చినప్పుడు ఒక కవర్‌లో పెట్టి ఇచ్చింది. ఆ ప్లాస్టిక్ కవర్‌ను అతడు ఒక ట్రోఫీలాగా, ఆమె జ్ఞాపకంగా దాచుకునేవాడు). ప్రేమ అనేది ఎంత సున్నితమైన, అందమైన భావనో, అదెంత గాఢంగా ఉంటుందో ఎంతటి అపురూపమైన త్యాగాలనైనా ఎంత సహజంగా, సులభంగా చేయిస్తుందో తెలియజేసే సినిమా జాను. ఈ సినిమాకు మూలమైన తమిళ సినిమా '96' ఇంకా అద్భుతంగా ఉంటుంది. వీలైతే అది చూసి ఒక గొప్ప ప్రేమకావ్యాన్ని ఆస్వాదించవచ్చు.

**జానకిని ప్రేమించే విషయంలో రామ్‌కు 'నా' అనేదేమీ లేదు. ఆ 'నా'లో అతడి గౌరవం కూడా ఉంది. దానిని కూడా పక్కనపెట్టాడు. రామ్ జానకిని ప్రేమిస్తాడు.. అంతేతప్ప ఆమె నుంచి ఏమీ ఆశించడు.. చివరికి గౌరవాన్ని కూడా. ఆమె ప్రేమించినా, ద్వేషించినా అతడినుంచి ఆమె వైపు ప్రవహించేది అనురాగమే. ఎందుకంటే, రామ్‌కు రామ్, జానకి అనే ఇద్దరు వ్యక్తుల్లో జానకే సర్వస్వం.. రామ్ అవసరమే లేదు.**

ఇంతగా ప్రేమించుకున్న వ్యక్తులు కలిసి ఉండకపోవటం ఎంతటి అన్యాయం? వాళ్లు ఎందుకు కలిసి ఉండలేరు? ఎందుకంటే, మనమున్న సమాజంలో ప్రేమించుకున్నవాళ్లు ఒకటి కాకుండా అడ్డుపడే అంశాలు అనేకం. కులం, మతం, ప్రాంతం, ఆర్థికహోదా మాత్రమే కాదు.. పెళ్లికూడా ప్రేమకు అవరోధమే (దీని గురించి చలం రాసినంత స్పష్టంగా ఎవరూ రాయలేదు). రామ్ అంటే జానకికి అంతులేని ప్రేమ. కానీ, అతడితో కలిసి ఉండలేదు. ఎందుకంటే, ఆమెకు భర్త, కూతురు ఉన్నారు. వారిని వదిలివేయలేదు. రామ్‌తో కలిసి ఉండలేదు. అంటే, ప్రేమను చంపుకొని ఆమె బతుకాల్సిందే. ప్రేమను చంపే సమాజం మనది. మరి, దీనికి పరిష్కారం ఏమిటి? మాతృకేంద్రక వ్యవస్థలే దీనికి పరిష్కారం. ఎటువంటి ఆర్థిక, సామాజిక అంతరాలు మాత్రమే కాదు.. వివాహమనేది కూడా లేని ఆ సమాజంలోనే స్త్రీ, పురుషుల ప్రేమబంధానికి ఎటువంటి అవరోధాలుండవు. పిల్లలు ఉండేది తల్లితోనే కాబట్టి.. పిల్లలకు తల్లి దూరమయ్యే మాటే ఉండదు. మరి పురుషులకు పిల్లలతో అనుబంధం ఉండదా అంటే.. ఉంటుంది. ఆ వ్యవస్థల్లో పురుషులకు తమ సొంత పిల్లలతో కంటే (తమ ప్రియురాలికి పుట్టిన పిల్లలతో కంటే) తమ అక్కాచెల్లెళ్ల పిల్లలతోనే ఎక్కువ అనుబంధం ఉంటుంది. తల్లి కేంద్రంగా అన్నాదమ్ములు, అక్కాచెల్లెళ్లతో కూడిన కుటుంబమే మాతృకేంద్రక వ్యవస్థలకు మూలం. వీరి ప్రణయ సంబంధాలు బయటివారితో ఉంటాయి. వారికి ఈ కుటుంబంలో ప్రవేశం ఉండదు. మానవ సమాజాన్ని పదుల వేల ఏండ్లపాటు నడిపించి బహుశా ఓ ఐదు వేల ఏండ్ల నుంచి కనుమరుగైన మాతృకేంద్రక వ్యవస్థలు మాత్రమే నేడు మనం చూస్తున్న అన్ని సమస్యలను పరిష్కరించగలుగుతాయి.



ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఇచ్చిందన్న ఆరోపణతో చిన్న బాలికపై దేశద్రోహ నేరం మోపడం ద్వారా మనం భయపడిపోతామని ప్రభుత్వం అనుకుంటున్నది. దీనిద్వారా మనకు రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి-మనమంతా ప్రాణభయంతో ఉండాలి. రెండవది-నిరుద్యోగ సమస్య నుంచి దృష్టి మళ్లించడం.

**శేఖర్ గుప్తా**




ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసిందన్న ఆరోపణపై చిన్న అమ్మాయిపై దేశద్రోహం కేసు పెట్టడం హాస్యాస్పదం, అత్యుత్సాహం. ఇది ప్రభుత్వం ఎంత అహేతుకంగా వ్యవహరిస్తున్నదో, ఎంతగా అభద్రతా భావంతో ఉన్నదో తెలుపుతున్నది.

**సబా నఖ్వీ**



సమకాలీన ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్ మాయాజాలం ఇది. నీళ్లను ప్లాస్టిక్ బాటిళ్లలో అమ్ముతారు. బాటిల్ నీళ్ల కోసం అంతకు పదింతల నీటిని కాలుష్యం చేస్తారు.

**శేఖర్ కపూర్**



ఉద్ధవ్ ఠాక్రేకు పౌరసత్వ సవరణ చట్టం గురించి అర్థమయ్యేటట్లు చెప్పాల్సిన అవసరం ఉన్నది. ఎన్పీఆర్ అనేది ఏ విధంగా ఎన్నార్సీపై ఆధారపడి ఉన్నదో చెప్పాలి. ఎన్పీఆర్ అమలుచేస్తే ఎన్నార్సీని ఆపలేరు. సీఏఏ భారత రాజ్యాంగ సూత్రాలపై ఆధారపడి ఉండాలి, కానీ మత ప్రాదిపదికన కాదు.

**మనీష్ తివారీ**

# జల శాస్త్రజ్ఞుడు కేసీఆర్

విశ్లేషణ



జూలూరు గౌరీశంకర్

అతడొక జలశాస్త్రం. జలాలు సమాజ ముఖచిత్రాన్ని ఎట్లా మార్చగలవో తెలుసుకొని తన చేతులతో జలాలను ఒడిసిపట్టుకుని బీడు భూములపైకి గంగమ్మను ప్రవహింపచేశాడు. నీళ్లే నాగరికతకు పురుడుపోశాయని చెప్పుకోవటం కాదు ఆ నీళ్లను తన నేలపైకి మళ్లించి తెలంగాణ సమాజ నిర్మాణానికి పటిష్ఠత తెచ్చేందుకు కేసీఆర్ రేయనక పగలనకా శ్రమించి జలదీక్ష చేపట్టాడు. ఈ సృష్టి ప్రాణకోటికి ఇచ్చిన జలాలను మహా జనావళికి అందించటమే అసలైన మానవసేవ. ఆ మానవసేవను అందజేసిన జల మాధవుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు.

మంచినీళ్ల కోసం కోసులదూరం నడిచిపోయి ఒంటెల కడుపుల్లో నీళ్లు దాచుకున్నట్లు బిందెలతో తల్లులు నీళ్లు మోసుకొచ్చిన దృశ్యాలను చూసిన బిడ్డలం కాదా మనందరం. వూళ్లకు వూళ్లు కరువులు బారినపడి వలవల ఏడ్చుకుంటూ ముంబైలు, దుబయిలు ఎక్కడికంటే అక్కడికి పొట్టచేతబట్టుకుని పోయారు కదా! తెలంగాణ గూడు చెదిరిన పక్షుల గుంపుగా మారింది. కల చెదిరింది కల్లోలాలు కరువుల రూపేణా తెలంగాణ ఉక్కిరిబిక్కిరి చేసినప్పుడు, తలపక్కన కృష్ణా గోదావరి నదులు ప్రవహిస్తున్నప్పుడు కదా కవులు కట్టలు తెగిన ఆగ్రహాన్ని ప్రకటించారు. గుండె గొంతుకల్లోంచి వచ్చిన మహావాక్యాలు కదా 'పొక్కిలి', 'మత్తడి' కవిత్వసం కలనాలైంది. మలిదశ ఉద్యమ పొలికేకగా కేసీఆర్ తన కంఠాన్ని పగులుగొట్టుకొని అసెంబ్లీలో నీటికేక వేసింది. అడుగడుగున జరిగిన మోసాల, ద్రోహాల గుట్టు విప్పి అసెంబ్లీ సాక్షిగా కదా కేసీఆర్ కంఠం ఉద్యమప్రళయ సంగీతమైంది. అది మహోజ్వల మలిదశ ఉద్యమ జలపాతంగా మారింది. జల సంగీతాలను వినిపించింది. జలప్రళయ ఉద్యమభేరీలు మోగించింది.

ప్రాణాలను హ్యాండ్‌బోర్‌లో పెట్టి మంటల్లో రాచకొండలు ఎట్లా మండుతుండెనో కదా! ఆశల కండ్లు నలుపుకొని మేఘాలు ఉరిమినప్పుడల్లా అర్జునా.. ఫల్గుణా అంటూ ఉలికిపడి చూసుకుంటూ బోరుబావుల్లోకి తలలపెట్టి నీటిని కన్నీళ్లతో తోడిపోసుకున్నది నిజం. ఎన్ని బోర్లువేసినా ఎంత తవ్వుకుంటుపోయినా కన్నీళ్ల లోతు తగల టం తప్ప జలపడ్డ శబ్దం వినపడకపోయేది. నీళ్లు లేకుండా పచ్చటి కలలను ఎట్లా కనగలమని కవుల ప్రశ్నలు.

గాలికి తాటాకు లెగిరిన సగం ఒంగిగోడలతో నున్న దృశ్యాలు. నీళ్లులేని భూముల్లో పస్తుల పయిటాలలు, ఏడుపాగని వూర్ల గోసలు, తల్లడిల్లుతున్న బిడ్డలగోసగా మారిన దృశ్యాలను చూసినంకనే నల్లగొండలో 40 బోర్లు వేసినా నీళ్లు పడని హృదయవిదారక దృశ్యాన్ని ఉద్యమ గొం తుకగా కేసీఆర్ పదేపదే చెప్పారు. నీళ్లులేని దుస్థితి, కరెంట్ లేని విషమపరిస్థితి, నీళ్లులేక బత్తాయి తోటలను నరికేసుకుంటూ రైతు గుక్కబెట్టి గుండెపగిలేలా ఏడుపులను విన్న తర్వాత అసెంబ్లీ అదిరేవిధంగా కేసీఆర్ గర్జించారు. పాదయాత్రల ద్వారా ఎండిపోయిన కాలువలను, పూడిపోయిన చెరువులను చూసి ఆ దృశ్యాలన్నింటినీ తన కళ్లనిండా నింపుకోవటం వల్ల మాత్రమే కేసీఆర్ జలశాస్త్రంగా మారారు. తెలంగాణ కన్నీళ్లు తుడవాలంటే మొదట ఈ నేలమీద నీళ్లు పారాలని తొలి ప్రాధాన్యంగా బీడుభూములకు నీళ్లు మళ్లించాలని నిర్ణయించుకొని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమనే కఠోర తపస్సు చేపట్టారు. ఎవరెవరు ఎన్నెన్ని మాట్లాడినా, ఎన్నెన్నో అడ్డంకులు కలిగించినా వెనుదిరగకుండా ముందుకు సాగి తెలంగాణ నేలపైకి గంగమ్మను రప్పించారు.

ఇప్పుడు తెలంగాణకు కేసీఆర్ ఒక జలపాఠం. తెలంగాణకు కేసీఆర్ బీడు భూములపై పచ్చటి పంటైనాడు. పాలమూరు కరువుసీమను ఆకుపచ్చగా మార్చాడు. తెలంగాణ ప్రజల దుఃఖాన్ని పారద్రోలే ఆశ ల జలపాతంగా కాళేశ్వరం మహా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. భగీరథుడే తన్మయంతో చూసే ఒక మహోన్నత స్థితి తెలంగాణలో కల్పించబడింది. ఒక వ్యక్తి వ్యవస్థగా మారి తననుతాను విస్తరించుకున్నప్పుడు మాత్రమే నదిగా మారుతారు. అలాంటివాళ్లే దార్శనికులవుతారు. కేసీఆర్ తనను విస్తరించుకొని కాళేశ్వరంగా మారారు.

**తెలంగాణ దేశానికి మోడల్‌గా మారిందని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నప్పుడు 2001 ఏప్రిల్ 27కు ముందు అసెంబ్లీలో కంఠం విప్పిన కేసీఆర్ గుర్తుకువచ్చాడు. ఒక్కడే.. ఒకే ఒక్కడే.. ఈ బక్కమనిషే అరుస్తున్న అరుపు అది భవిష్యత్ తెలంగాణ రాష్ట్రం అవుతుందని నాడు ఎందరూహించారో!! తెలంగాణ కన్నీటి గాథను వినిపిస్తున్న సందర్భంలో మొత్తంగా అసెంబ్లీ నివ్వెరపోయి చూసింది నిజం.**

మలిదశ తెలంగాణ ఉద్యమం ఎన్నెన్నో పాటల కావ్యాలను ఆవిష్కరించింది. కవిత్వ శంఖారావాలను పూరించింది.

తల్లిస్తైన్యం బిడ్డకందనప్పుడు వేసిక కేక నా తెలంగాణ అంటూ కవిత్వాలు రాసి తలతిప్పుకుపోతున్న కృష్ణా గోదావరులను ఆగ్రహంతో శపించింది నిజం. నల్లగొండలో కవుల సమ్మేళనం జరిగితే ఫ్లోరోసిస్ నీళ్లను చూసి కోదాడ నుంచి కొడంగల్ వరకు పాదయాత్ర చేసి కేసీఆర్ పాటలు కట్టాడు. కేసీఆర్ ఉద్యమ పిడికిలిగా మారారు. ఈడుబోయిన చెలకలా.. ఇసిరిపారేసిన పొట్టపేగుల్లా... తీరని గోసకు ఆర్తులకు ఆర్తిగా నా తెలంగాణ మారింది. పగిలిన పాదల దారుల్లోంచి పత్తిగింజల పెచ్చులు పచ్చపురుగులా ఒంటిమీద అంబాడుతున్న దరిద్రం.. పగిలిన కన్నీళ్ల బిందువులకు చినుకుల వానగా తెలంగాణ మారింది. పగిలిన కన్నీళ్లు గొంతులు తెరిచిన ప్రవాహంగా తెలంగాణ అయ్యింది. పగలగొట్టిన కల నుంచి కలకలలు.. నా కొలిమిల మండింది నా చేతులే.. చరిత్రకు నాగలినిచ్చిన వాకిళ్లు పొక్కిలయ్యాయి. నోటికి మూతికి మధ్య అందని బువ్వగా మారింది గద నా తెలంగాణ అని ఉప్పొంగి కవిత్వమైంది నిజం. యాడబడితే ఆడదొరికే మానవత్వపు పంటల తోపు తెలంగాణ నీళ్లందని నేలయ్యింది.

మెతుకులేని సీమ మెదక్ అని ఎన్నెన్నో పాటలు వచ్చాయి. వానమ్మ వానమ్మ ఒక్కసారైనా వచ్చిపోవమ్మా అని ఎన్నెన్నో పాటలు వచ్చాయి. కరువు కళ్ల నీళ్ల మీద రాయని కవే తెలంగాణలో లేరు. తెలంగాణ నేలలలో గొట్టపు బావుల విషాదాన్ని వర్ణించని కవులు లేరు. నీళ్లులేక నిప్పుల వర్షం కురుస్తున్న తీరు, కాలం ఎదురుతిరిగి నీటివాటా దక్కక తెలంగాణ తల్లడిల్లిపోయింది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ కాదు. నా తెలంగాణ కోటి కత్తుల వాన' అంటూ రాసుకుంటూపోయారు. నేను నా నేల, నా గాలి, నా నీరు, నా ఊరు కావాలని కలమెత్తారు. నదుల గోడలు కూలగొట్టి నా కరువు నేలపై నీళ్లు పారించే వ్యక్తికోసం తెలంగాణ తల్లి మలిదశ ఉద్యమం వైపు చూసింది. తల్లి పాలు దొరుకని శైశవ రోదనలు నేపథ్య స్వరాల్లోని కరువు గీతాల పల్లవిగా కవుల కలం మార్మోగింది. ఎండిన పైరుల మీదుగ తేలివచ్చే పచ్చిగాయాల గొంతుకల్లోని ఉద్యమగీతమైంది తెలంగాణ.

తెలంగాణ దేశానికి మోడల్‌గా మారిందని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నప్పుడు 2001 ఏప్రిల్ 27కు ముందు అసెంబ్లీలో కంఠం విప్పిన కేసీఆర్ గుర్తుకువచ్చాడు. ఒక్కడే.. ఒకే ఒక్కడే.. ఈ బక్కమనిషే అరుస్తున్న అరుపు అది భవిష్యత్ తెలంగాణ రాష్ట్రం అవుతుందని నాడు ఎందరూహించారో!! తెలంగాణ కన్నీటి గాథను వినిపిస్తున్న సందర్భంలో మొత్తంగా అసెంబ్లీ నివ్వెరపోయి చూసింది నిజం.

ఎందరెందరో నేతల్ని చూసి వారు మాట్లాడే మాటల్ని విన్న అసెంబ్లీ కేసీఆర్‌ను చూసి నిబిడాశ్చర్యంతో నిశ్చేష్టురాలైంది. తెలంగాణ కన్నీటి గోసను తీర్చే ఒక నాయకుడు రాబోతున్నాడని అందరికంటే ముందు అసెంబ్లీ భవనం గుర్తించి గర్వంతో మీసం మెలేసింది. ఈ దేశంలో నీటి స్పృహ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాజేంద్రసింగ్ ప్రకటించిన వార్త చదివాక 20 ఏండ్ల కిందట తెలంగాణ ఎట్లుండె? నాటి తెలంగాణ కరువు నోటిలో పడి ఎలా విలవిలలాడిందో? ఈ దుస్థితి నుంచి తెలంగాణ బయటపడాలన్న ఉద్యమద ర్వాజ తెరిచింది అసెంబ్లీలో కేసీఆర్ అరిచిన అరుపు. అదొక ఉరుముగా ప్రళయంగా మారిన పద్నాలుగేండ్ల మలిదశ మహోద్యమం. కదిలిన తెలంగాణ మహాప్రజ. కదిలించిన కేసీఆర్ స్థానం చరిత్రలో చెరిగిపోనిది.

'గోదావరికి కొత్తనడక నేర్పిన పాలకుడు సీఎం కేసీఆర్' అన్న రాజేంద్రసింగ్ మాటలు జలచరిత్రకు పాఠ్యాంశం. ఇప్పుడు కేసీఆర్ నిర్మించిన తెలంగాణ చరిత్ర కాళేశ్వరం ఎత్తిపోతల దృశ్యాలుగా ఎగిసిపడుతూ, మిషన్‌కాకతీయ ప్రాజెక్టుల నుంచి చెరువుల తూముల నుంచి ఎర్రసెలకల మీదకొచ్చి నిక్షిప్తమైంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.




ట్రంప్ పర్యటన నేపథ్యంలో మోతేరా స్టేడియానికి వెళ్లే దారిలో ఉన్న మురికివాడ కనిపించకుండా గుజరాత్ ప్రభుత్వం నిర్మించిన గోడ ఇది. రెండువేల మంది నివసిస్తున్న ఈ కాలనీ కనిపించకుండా నాలుగు అడుగుల ఎత్తుతో దాదాపు అర కి.మీ. మేర గోడ నిర్మించారు.

## 69 లక్షల పోస్టులు పడ్డాయి.. దరఖాస్తు చేసుకోండి!

- ట్రంప్ పర్యటన ఏర్పాట్లపై కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రం

**న్యూఢిల్లీ:** ట్రంప్ పర్యటన కోసం చేస్తున్న ఏర్పాట్లపై కాంగ్రెస్ విమర్శల వర్షం గుప్పిస్తున్నది. 'డొనాల్డ్ ట్రంప్ నాగరిక్ అభినందన్ సమితి' పేరుతో కమిటీని ఏర్పాటుచేసి రూ.వంద కోట్లు కేటాయించడంపై పలు ప్రశ్నలు కురిపించింది. కాంగ్రెస్ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఓ వ్యంగ్య ప్రకటన ఇచ్చింది. 24న నమస్తే ట్రంప్ సభలో చేతులు ఊపేందుకు 69 లక్షల మందిని నియమించుకుంటున్నామని, భత్యంగా 'మంచి రోజులు' (అచ్చేదిన్) వస్తాయని అందులో పేర్కొన్నది. 'మోదీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీలో 69 లక్షలకు నోటిఫికేషన్ వచ్చింది. దరఖాస్తు చేసుకోండి' అని ట్వీట్ చేసింది. మరోవైపు ట్రంప్ పర్యటన కోసం రూ.100 కోట్లు కేటాయించి, ఓ కమిటీ ద్వారా ఖర్చు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధా న కార్యదర్శి ప్రియాంక విమర్శించారు. కాంగ్రెస్ విమర్శలపై బీజేపీ స్పందిస్తూ.. భారత్-అమెరికా సంబంధాల్లో ఈ పర్యటన మైలురాయిగా నిలిచిపోతుందని, ఈ విజయాన్ని అభినందించాలని కోరింది.




## అత్యవసరం అయితే తప్ప సింగపూర్‌కు వెళ్లకండి

**న్యూఢిల్లీ:** చైనాను అతలాకుతలం చేసిన కరోనా వైరస్ (కొవిడ్-19) భారత్‌లో విస్తరించకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నది. భారత ప్రయాణికులు అత్యవసరం అయితే తప్ప సింగపూర్‌కు వెళ్లకూడదని సూచించింది. శనివారం కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సమావేశంలో కరోనా వైరస్ వ్యాప్తి, అడ్డుకట్టకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.



# మతస్వేచ్ఛపై మోదీతో చర్చిస్తాం

సీఏఏ, ఎన్నార్సీపై మేమూ ఆందోళన చెందుతున్నాం ■ ఈ అంశాన్ని మోదీ వద్ద ట్రంప్ ప్రస్తావిస్తారు

అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ వెల్లడి ■ 'ట్రంప్ ప్లాటర్' సిద్ధం చేస్తున్న ఐటీసీ మౌర్య


పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ట్రంప్ చిత్రాన్ని గీస్తున్న కళాకారుడు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్ద 'భారత్‌లో మతస్వేచ్ఛ' అంశాన్ని ప్రస్తావించనున్నారు. ట్రంప్ పర్యటనకు కొన్ని రోజుల ముందే అమెరికాకు చెందిన ఓ సంస్థ 'అంతర్జాతీయంగా మతస్వేచ్ఛ' అనే అంశంపై నివేదికను విడుదల చేసింది. ఇందులో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తర్వాత భారత్‌లో మతస్వేచ్ఛ తగ్గడం ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌజ్‌కు చెందిన సీనియర్ అధికారి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఏఏ, ఎన్నార్సీ గురించి విలేకరులు ప్రస్తావించగా.. వాటిపై తాము కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. 'ట్రంప్ తన పర్యటనలో భాగంగా ప్రజాస్వామ్యం, మతస్వేచ్ఛపై అమెరికా విధానాలను వివరిస్తారు. ముఖ్యంగా మా ప్రభుత్వ ప్రాధాన్య అంశమైన మతస్వేచ్ఛ గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తారు' అని పేర్కొన్నారు. భారత్‌లోని ప్రజాస్వామ్య విధానాలు, సంస్థలపై అమెరికాకు అమిత గౌరవం ఉన్నదని, వాటిని కొనసాగించాలని కోరుతామని చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మోదీ చేసిన మొదటి ప్రసంగంలో భారత్‌లోని మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. అదేసమయంలో భారత్ ప్రజాస్వామ్య విధానాలను, పరమత సహన సిద్ధాంతాన్ని కొనసాగించాలని, మైనార్టీలను గౌరవించాలని ప్రపంచం మొత్తం కోరుకుంటున్నది. ఈ విలువలు భారత రాజ్యాంగంలోనే స్పష్టంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు. భారత్.. మతం, భాష, సంస్కృతి పరంగా భిన్నత్వాన్ని కలిగి ఉన్నదని, ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగు మతాలకు భారత్ పుట్టినిల్లని చెప్పారు. మరోవైపు భారత్‌తో కుదుర్చుకోబోయే వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని అమెరికా అధికారులు తెలిపారు. భారత ఉత్పత్తులకు జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్స్ (జీఎస్పీ) కింద ప్రోత్సాహకాలు అందించడానికి తాము మొగ్గు చూపుతున్నామని, కానీ మోదీ ప్రభుత్వం మాత్రం భారత మార్కెట్‌లోకి అమెరికా ఉత్పత్తులను ప్రోత్సహించడంపై సరిగా స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇంకా చర్చలు జరుగుతున్నాయన్నారు.


భారత పర్యటనలో ట్రంప్ దంపతులు వినియోగించనున్న వస్తువులు ఇవి. బంగారు, వెండి పూత కలిగిన ఈ పాత్రలను ప్రముఖ కళాకారుడు అరుణ్ పబువల్.. 'ట్రంప్ కలెక్షన్' పేరిట తయారుచేశారు.

**ట్రంప్‌కు ఇష్టమైన ఆహార పదార్థాలు సిద్ధం**

ట్రంప్ తన కుటుంబంతో కలిసి బస చేయనున్న ఢిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో ప్రత్యేక వంటకాలను సిద్ధం చేస్తున్నారు. ఆయన అభిరుచికి అనుగుణంగా ఉండే ఆహార పదార్థాలను ఒకే దగ్గరికి చేర్చి 'ట్రంప్ ప్లాటర్' పేరుతో అందుబాటులో ఉంచనున్నారు. అయితే ఇందులో ఏయే ఆహార పదార్థాలు ఉంటాయో మాత్రం వెల్లడించలేదు. ఐటీసీ మౌర్యలోని 'బుఖారా' రెస్టారెంట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. పలువురు అమెరికా అధ్యక్షులు సహా వివిధ దేశాలకు చెందిన అధిపతులు బుఖారాలో విందు ఆరగించారు. ఇందులో 41 ఏండ్లుగా ఒకే మెనూను అమలు చేస్తున్నారు. విదేశీ ప్రముఖులు వచ్చినప్పుడు మెనూలో నుంచి వారి అభిరుచికి తగిన వంటకాలను ఎంపిక చేసి వడ్డిస్తారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా 2010, 2015లో భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఐటీసీ మౌర్య హోటల్ ఆతిథ్యం ఇవ్వగా.. బుఖారా రెస్టారెంట్ 'ఒబామా ప్లాటర్' పేరుతో ప్రత్యేక వంటకాలను సిద్ధం చేసింది. అప్పటి నుంచి ఆ హోటల్‌లో ఒబామా ప్లాటర్ బాగా ప్రాచుర్యం పొందింది. ఇందులో తందూరీ జింగా, మచ్లీ టిక్కా, ముర్గీ బోటి బుఖారా, కబాబ్స్ ఉంటాయి. బుఖారా రెస్టారెంట్‌లో ఎక్కువగా తందూరీ, కబాబ్ సంబంధించిన పదార్థాలే ఉంటాయి. దాల్ బుఖారా, ఖాస్తా రోటీ, భార్వాన్ కుల్చా ఈ హోటల్ ప్రత్యేకం. అంతేకాదు.. ట్రంప్ కోసం ఐటీసీ మౌర్య హోటల్ మరో బహుమతిని అందించనున్నది. ప్రఖ్యాత చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ ఒకసారి బుఖారా రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్నప్పుడు రుచికి ముగ్ధులయ్యారు. ఓవైపు తింటూనే మరోవైపు కాన్వాస్‌పై గుర్రపు బొమ్మ పెయింటింగ్ వేసి బహుమతిగా ఇచ్చారు. అప్పటి నుంచి హోటల్‌కు వచ్చే ప్రముఖులకు మౌర్య యాజమాన్యం ఎంఎఫ్ హుస్సేన్ చిత్రం ప్రతిరూపాలను ఆప్రాన్‌పై ముద్రించి బహుమతిగా అందిస్తున్నది. ట్రంప్ కోసం కూడా ఒక ఆప్రాన్‌ను సిద్ధం చేస్తున్నది. మరోవైపు ట్రంప్ గుజరాత్‌కు వచ్చినప్పుడు ఆయనకు పదుల లక్షల (మిలియన్ల) సంఖ్యలో ప్రజలు స్వాగతం పలుకుతారని ఆరాష్ట్ర సీఎం రూపాని తెలిపారు.

### తాజ్‌కు ట్రంప్ కుటుంబం మాత్రమే

ట్రంప్ కుటుంబం తాజ్‌మహల్ పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరు కాకపోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ట్రంప్‌తోపాటు ఆయన భార్య మెలానియా, కూతురు ఇవాంకా, అల్లుడు కుష్నర్ తదితరులు సోమవారం మధ్యాహ్నం తాజ్‌మహల్‌ను సందర్శిస్తారు. ట్రంప్ కుటుంబం చారిత్రక కట్టడం అందాలను వీక్షించేందుకే వెళ్తారని, కాబట్టి వారితో మోదీ సహా భారత ప్రతినిధులు ఎవరూ ఉండకపోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు ట్రంప్ విమానం సోమవారం ఢిల్లీలో దిగేందుకు వాతావరణం సహకరించకపోతే ప్రత్యామ్నాయంగా జైపూర్ విమానాశ్రయాన్ని ఎంచుకున్నారు. ఈ మేరకు అమెరికాకు చెందిన భద్రతా సిబ్బంది శనివారం జైపూర్ విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలించారు.

## కేజ్రీవాల్‌కు ఆహ్వానం లేదు

- మెలానియా పాఠశాల సందర్శన జాబితాలో దక్కని చోటు

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ ఈ నెల 25న ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించనున్నారు. అయితే ఆమె పాఠశాల సందర్శనకు వచ్చినప్పుడు ఆమె వెంట ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఉండరు. వాస్తవానికి మెలానియా పాఠశాలను సందర్శించడానికి వచ్చినప్పుడు ఆమె వెంట కేజ్రీవాల్, సిసోడియా ఉంటారని ఇంతకుముందు ఖరారైన షెడ్యూల్‌లో ఉన్నది. దీంతో ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న 'హ్యాపీనెస్ పాఠ్య ప్రణాళిక' గురించి మెలానియాకు వివరించాలని వీరిద్దరు భావించారు. కానీ చివరికి షెడ్యూల్ నుంచి వీరిద్దరి పేర్లను తొలిగించారు.

## రాజకీయాలను పక్కన పెట్టి ఆహ్వానిద్దాం

- కాంగ్రెస్‌కు బీజేపీ సూచన

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన సందర్భంగా రాజకీయాలు పక్కనపెట్టి సాదరంగా ఆహ్వానిద్దాం అని కాంగ్రెస్‌కు బీజేపీ సూచించింది. 'ట్రంప్ భారత పర్యటన భారత-అమెరికా సంబంధాల్లో మైలురాయిగా నిలిచిపోనున్నది. దేశం సాధిస్తున్న విజయాలతో ప్రతిపక్షం కూడా గర్వించాలి. రాజకీయపార్టీలు తమ రాజకీయాలను పక్కనపెట్టి ఒకే దేశంగా ఆలోచించాల్సిన సందర్భమిది' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్‌పాత్ర కాంగ్రెస్‌కు సూచించారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద, పురాతన ప్రజాస్వామ్య దేశాల మధ్య జరుగుతున్న భేటీని సంబురంగా జరుపుకోవాల్సిన సమయమిదని చెప్పారు. ఈ భేటీ దేశం స్థాయిని పెంచుతున్నప్పుడు ఎందుకు సంతోషంగా లేరో చెప్పాలంటూ కాంగ్రెస్ నేతలను ఆయన నిలదీశారు.

## 3500 టన్నులు కాదు.. 160 కిలోలే!

- యూపీలో బంగారు నిక్షేపాలపై జీఎస్‌ఐ వెల్లడి

**కోల్‌కతా/సోన్‌భద్ర:** ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో 3,500 టన్నులకుపైగా బంగారు నిక్షేపాలను గుర్తించినట్లు వెలువడిన వార్తలు అవాస్తవమని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) స్పష్టం చేసింది. జీఎస్‌ఐకు చెందిన ఏ అధికారి కూడా ఆ సమాచారాన్ని ఇవ్వలేదని, సోన్‌భద్రలో ఆ స్థాయిలో పసిడి ఉన్నట్లు తాము అంచనావేయలేదని జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ ఎం శ్రీధర్ శనివారం కోల్‌కతాలో పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. సోన్‌పహాడి, హార్డీ గ్రామాల్లో రెండు భారీ బంగారు గనులను గుర్తించినట్లు జిల్లా మైనింగ్ అధికారి కేకే రాయ్ శుక్రవారం తెలిపిన సంగతి తెలిసిందే. సోన్‌పహాడీలో 2,943.26 టన్నులు, హార్డీలో 646.16 కిలోల పసిడి నిక్షేపాలు ఉన్నట్లు చెప్పారు. అయితే వీటిని శ్రీధర్ ఖండించారు. సుమారు 52,806.25 టన్నుల ముడిలోహం ఉన్నదని, అందులో నుంచి 160 కిలోల బంగారాన్ని మాత్రమే తీయవచ్చని తెలిపారు.



జాతీయవాదం, 'భారత్ మాతా కీ జై' వంటి నినాదాలు దుర్వినియోగం అవుతున్నాయి. భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి, మిలిటెంట్ల ఆలోచనలకు ఒక సాధనంగా వీటిని ఉపయోగిస్తున్నారు. భారత్ ప్రభావవంతమైన ప్రజాస్వామ్యంగా, ప్రపంచంలో శక్తిమంతమైన దేశాల్లో ఒకటిగా ఉండటానికి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూనే కారణం. ఒక వర్గం ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నది. అయితే, చరిత్ర అసత్యాలను తిరస్కరిస్తుంది.

**- మన్మోహన్ సింగ్, మాజీ ప్రధాని**



కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను రాహుల్ గాంధీ తిరిగి చేపట్టాలని పార్టీలోని మెజారిటీ వర్గం కోరుకుంటున్నది. పార్టీని నడిపించడానికి ఆయనే సరైన వ్యక్తి. పార్టీలో ఇప్పటికీ రాహుల్ అగ్రనేతే. ప్రస్తుతం కాంగ్రెస్ 'పరివర్తన దశ'లో ఉన్నది. పార్టీలో నాయకత్వ కొరత లేదు. కాంగ్రెస్‌కు చుక్కానిగా సోనియాగాంధీ ఉన్నారు. రాహుల్‌పై ఎవ్వరూ ఒత్తిడి తీసుకురావొద్దు. నిర్ణయం తీసుకునేందుకు ఆయనకు సమయమివ్వాలి.

**- సల్మాన్ ఖుర్షీద్, కాంగ్రెస్ సీనియర్ నేత**

## సుప్రీం తీర్పులకు ప్రజామద్దతు

- అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య న్యాయవ్యవస్థ సమతుల్యత
- డేటా భద్రత, సైబర్ నేరాలతో సవాళ్లు
- అంతర్జాతీయ న్యాయ సదస్సులో ప్రధానమంత్రి మోదీ
- చట్టబద్ధపాలన విజయవంతానికి న్యాయవ్యవస్థే కీలకం: సీజేఐ బోబ్డే


న్యాయ సదస్సుకు హాజరైన పలు దేశాల న్యాయమూర్తులతో ప్రధాని మోదీ, సీజేఐ బోబ్డే

**న్యూఢిల్లీ:** అత్యున్నత న్యాయస్థానం ఇటీవల వెలువరించిన పలు క్లిష్టమైన తీర్పులను 130 కోట్ల మంది భారతీయులు హృదయపూర్వకంగా స్వాగతించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. 'న్యాయవ్యవస్థ-మారుతున్న ప్రపంచం' పేరిట సుప్రీంకోర్టులో జరుగుతున్న అంతర్జాతీయ న్యాయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. రాజకీయంగా అత్యంత సున్నితమైన అయోధ్య కేసు తదితర తీర్పులను ఈ సందర్భంగా ప్రధాని పరోక్షంగా ప్రస్తావించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటిస్తూ న్యాయవ్యవస్థ పర్యావరణ ధర్మశాస్త్రాన్ని పునర్నిర్వచించిందని ప్రశంసించారు. మానవ మేధస్సుకు కృత్రిమ మేధను జోడించడం ద్వారా సత్వర న్యాయం అందించవచ్చన్నారు. డేటా భద్రత, సైబర్ నేరాలు న్యాయవ్యవస్థకు సరికొత్త సవాళ్లను విసురుతున్నాయని చెప్పారు. లింగ సమానత్వం లేనిదే ప్రపంచంలోని ఏ దేశం సమగ్ర అభివృద్ధిని సాధించలేదని ప్రధాని చెప్పారు. తమ ప్రభుత్వం తెచ్చిన ట్రిపుల్ తలాక్ చట్టం, ట్రాన్స్‌జెండర్, దివ్యాంగుల హక్కుల చట్టాలను ఆయన ప్రస్తావించారు. మిలిటరీ సర్వీసుల్లో మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సత్యం, సేవకే గాంధీజీ జీవితాన్ని అంకితం చేశారని, ఆయన చూపిన మార్గమే న్యాయవ్యవస్థకు పునాది అన్నారు.

**ప్రాథమిక విధులను నిర్వర్తించాలి: జస్టిస్ బోబ్డే**

సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఆధునిక రాజ్యాంగాలలో చట్టబద్ధపాలన అన్నది ప్రాథమిక విషయమని, అయితే సవాళ్లకు ఆయా న్యాయవ్యవస్థలు స్పందించే తీరుపై దాని విజయం ఆధారపడి ఉంటుందని చెప్పారు. పౌరులు తమ ప్రాథమిక విధులను తప్పక నిర్వర్తించాల్సిన అవసరం ఉన్నదని నొక్కిచెప్పారు. రాజ్యాంగం బలమైన, స్వతంత్ర న్యాయవ్యవస్థను నెలకొల్పిందని, దాన్ని చెక్కుచెదరకుండా ఉంచేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. భారత్‌కు 2000 ఏండ్ల న్యాయ చరిత్ర ఉన్నదని పేర్కొన్న ఆయన.. వ్యాసస్మృతి గురించి ప్రస్తావించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు, అవినీతిపరులకు గోప్యత హక్కు ఉండదని, అలాంటి వ్యక్తులు వ్యవస్థను దుర్వినియోగం చేయడాన్ని అనుమతించబోమన్నారు.

**ఉగ్రవాదం, సైబర్ నేరాలపై న్యాయవ్యవస్థ స్పందించాలి: జస్టిస్ ఎన్వీ రమణ**

ఉగ్రవాదం, సైబర్ నేరాలు, పర్యావరణ క్షీణత, ఆరోగ్య సమస్యలు నేడు ప్రపంచదేశాలను పట్టిపీడిస్తున్నాయని, వీటిపై న్యాయవ్యవస్థ తగిన విధంగా స్పందించాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. మన తీర్పులపై ప్రపంచ దేశాల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. భారత న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసిన ఆస్ట్రేలియా న్యాయమూర్తి జస్టిస్ మైఖెల్ కిర్బీ.. తమదేశ హైకోర్టు తీర్పుల్లో అనేకమార్లు మన తీర్పులను ప్రస్తావించారని తెలిపారు. రాజ్యాంగ నైతికతను అనుసరించి, సందర్భానుసారం సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు రాజ్యాంగానికి అర్థం చెబుతున్నదని పేర్కొన్నారు. బహుళవాదంపై న్యాయవ్యవస్థ పాత్ర మీద సదస్సులో చర్చించాలన్నారు. పాపులిస్ట్ నిర్ణయాలు రాజ్యాంగ హక్కులపై ప్రభావం చూపుతాయని చెప్పారు. ప్రధాని మోదీపై సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ అరుణ్ మిశ్రా ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ 'ప్రపంచం మెచ్చిన దార్శనికుడు', 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అని కొనియాడారు.


## రైతులకు 50,850 కోట్లు

- 'పీఎం కిసాన్' పథకం కింద 8.46 కోట్ల మందికి ఇచ్చాం
- కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ:** ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన(పీఎం కిసాన్)లో భాగంగా శనివారంనాటికి రూ.50,850 కోట్లకు మించి పంపిణీ చేసినట్టు కేంద్ర వ్యవసాయశాఖ ప్రకటించింది. గత ఏడాది ఫిబ్రవరి 24న యూపీలోని గోరఖ్‌పూర్‌లో ప్రధాని మోదీ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కానీ 2018 డిసెంబర్ నుంచే పెట్టుబడి పథకం అమల్లోకి వచ్చింది. ఐదెకరాల్లోపు రైతులందరినీ అర్హులుగా పరిగణించారు. ఈ నేపథ్యంలో ఏడాదికాలంలో సాధించిన ప్రగతి నివేదికను కేంద్ర వ్యవసాయశాఖ విడుదల చేసింది. ఒక్కో రైతుకు ఏడాదిలో మూడు దఫాలుగా రూ.ఆరు వేలు పెట్టుబడి సాయంగా నగదు బదిలీ చేయడమే ఈ పథకం లక్ష్యం. 2015-16 జనాభా లెక్కల ప్రకారం ఈ పథకంలోకి వచ్చే లబ్ధిదారుల సంఖ్య 14 కోట్లు కాగా, ఏడాది వ్యవధిలో ఫిబ్రవరి 20నాటికి 8.46 కోట్ల మందికి ప్రయోజనం కలిగించినట్టు కేంద్రం తెలిపింది. 2019 డిసెంబర్1నాటికి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖతాలను పరిగణనలోకి తీసుకున్నారు. అసోం, మేఘాలయ, జమ్ముకశ్మీర్, లడఖ్‌కు మాత్రం ఈ ఏడాది మార్చి వరకు మినహాయింపు ఇచ్చారు.

## పాఠకుల నమ్మకాన్ని తిరిగి పొందాలి

- సంప్రదాయ మీడియాకు రాష్ట్రపతి కోవింద్ సూచన
- సోషల్ మీడియా ప్రజాస్వామ్య జర్నలిజమని వ్యాఖ్య



**బెంగళూరు, ఫిబ్రవరి 22:** ప్రస్తుత సమాజంలో తన పాత్రపై సంప్రదాయ మీడియా స్వీయ పరిశీలన చేసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచించారు. ఇంటర్నెట్ వాడకంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ప్రజల జీవితాల్లోకి సోషల్ మీడియా చొచ్చుకొని వచ్చిందని, దీంతో వార్తల వాస్తవికత ప్రశ్నార్థకమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సంప్రదాయ మీడియా పాఠకుల నమ్మకాన్ని తిరిగి పొందాలని సూచించారు. ప్రముఖ వార్తా సంస్థ 'ది హిందూ' బెంగళూరులో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 'ది హడల్' అనే చర్చా కార్యక్రమాన్ని శనివారం కోవింద్ ప్రారంభించారు. రాష్ట్రపతి మాట్లాడుతూ.. 'కొత్తగా వచ్చిన మీడియా(సోషల్ మీడియా) వేగవంతమైంది. అలాగే అందరి మన్ననలు పొందింది. అయితే, సృజనాత్మకతతో కూడిన విశ్వసనీయమైన వార్తలను గత కొన్నేండ్లుగా సంప్రదాయ మీడియా ప్రజలకు అందిస్తున్నది' అని అన్నారు. ప్రస్తుత సమాజంలో తన పాత్రపై సంప్రదాయ మీడియా స్వీయ పరిశీలన చేసుకోవడంతోపాటూ.. పాఠకుల నమ్మకాన్ని తిరిగి పొందడానికి పలు మార్గాల్ని అన్వేషించాలని కోవింద్ సూచించారు. నిష్పక్షపాత జర్నలిజం లేకుండా ప్రజాస్వామ్యమనే వ్యవస్థ పరిపూర్ణం కాలేదని అన్నారు. ఇంటర్నెట్, సోషల్ మీడియాను ప్రజాస్వామ్య జర్నలిజంగా అభివర్ణించిన కోవింద్.. ఇది ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తూనే.. కొన్ని సందర్భాల్లో ఆందోళనలకు కారణమౌతున్నదన్నారు.


## అన్నీ అబద్ధాలే

- నిర్భయ దోషి వినయ్ ఆరోగ్యంగానే ఉన్నాడు
- ఢిల్లీ కోర్టుకు తీహార్ జైలు అధికారుల వెల్లడి
- వినయ్ పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు దోషుల్లో ఒకడైన వినయ్ కుమార్ శర్మ చెప్పేవన్నీ అబద్ధాలేనని తీహార్ జైలు అధికారులు స్పష్టం చేశారు. అతడు ఆరోగ్యంగానే ఉన్నాడని, మానసిక స్థితి బాగానే ఉన్నదని ఢిల్లీ కోర్టుకు తెలిపారు. మార్చి 3న ఉరిశిక్ష అమలు కాకుండా ఉండేందుకు దోషులు పలు విధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న తీహార్ జైలులోని 3వ నంబర్ సెల్‌లో ఉన్న దోషి వినయ్ కుమార్ శర్మ తన తలను గోడకు బాదుకున్నాడు. స్వల్పంగా గాయపడటంతో జైలు అధికారులు చికిత్స అందజేశారు. అయితే నాటి నుంచి వినయ్ ఆరోగ్యం, మానసిక స్థితి సరిగా లేదని, తన తల్లిని, న్యాయవాదిని గుర్తుపట్టలేకపోతున్నాడని, మెరుగైన చికిత్స అందించాలని కోరుతూ అతడి తరపు న్యాయవాది ఏపీ సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. శనివారం అదనపు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రానా దీనిపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా తీహార్ జైలు తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. దోషి వినయ్ కావాలనే గాయపర్చుకున్నాడంటూ సంబంధిత సీసీటీవీ దృశ్యాలను కోర్టుకు సమర్పించారు. జైలులోని వైద్యులు అతడికి చికిత్స అందించారని, పైపై గాయాలు మాత్రమే అయ్యాయని, అతడు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య నివేదికలు ధ్రువీకరిస్తున్నాయన్నారు. కోర్టుకు హాజరైన సైకాలజిస్టు కూడా వినయ్ మానసిక స్థితి బాగానే ఉన్నదని చెప్పారు. కాగా వినయ్ తన తల్లి, న్యాయవాదితో మాట్లాడాడని, వారిని అతడు గుర్తుపట్టకపోతున్నట్లు పేర్కొనడం తప్పని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న కోర్టు మెరుగైన చికిత్స కోసం దోషి వినయ్ పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టేసింది.

## ఎన్పీఆర్‌తో ముస్లింల పౌరసత్వం గల్లంతు

- అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను అమలు చేసి దాదాపు 8 కోట్ల మంది ముస్లింల పౌరసత్వాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఒకవేళ ఎన్పీఆర్ అమలైతే దేశంలో వందల ఏండ్ల నుంచి నివసిస్తున్న ముస్లింలు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. శనివారం ఆయన ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ 'బీజేపీ ప్రభుత్వం పథకం ప్రకారం ముస్లింలపై ఆరాచకంగా వ్యవహరిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలో 20 మంది యువకులను తుపాకులతో కాల్చిచంపారు. కర్ణాటకలోని ఓ పాఠశాలలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో సీఏఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారంటూ ప్రధానోపాధ్యాయురాలిపై, ఓ విద్యార్థిని తల్లిపై కేసుపెట్టి జైలుకు పంపారు' అని మండిపడ్డారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లకు వ్యతిరేకంగా ప్రతి ముస్లిం పౌరుడు పోరాడాలని ఒవైసీ పిలుపునిచ్చారు.

## గుజరాత్‌లో ఏం జరిగిందో గుర్తుచేసుకో!




- వారిస్ పఠాన్‌కు బీజేపీ ఎమ్మెల్సీ గిరీశ్ వ్యాస్ హెచ్చరిక

**నాగపూర్:** గుజరాత్‌లో ఏం జరిగిందో గుర్తుచేసుకోవాలంటూ ఎంఐఎం నేత వారిస్ పఠాన్‌ను ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్సీ గిరీశ్ వ్యాస్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కర్ణాటకలోని కలబురిగిలో జరిగిన సీఏఏ వ్యతిరేక సభలో పఠాన్ మాట్లాడుతూ.. 'గుర్తుంచుకోండి (మనం) 15 కోట్ల మందిమే అయినా, వంద కోట్ల మంది కంటే బలవంతులం' అని అన్నారు. దీనిపై వ్యాస్ శుక్రవారం స్పందించారు. 'మేమెంతో సహనంతో ఉన్నాం. అయితే దీనర్థం వారిని డీల్ చేయలేమని కాదు. గుజరాత్‌లోని కల్బూర్‌లో జరిగిన ఘటనలను గుర్తుచేసుకోండి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే అక్కడి ముస్లింలు మరోసారి సాహసించరని నేను భావిస్తున్నా' అని గుజరాత్ అల్లర్ల గురించి పరోక్షంగా ప్రస్తావించారు.

## మూడున్నరేండ్లలో రామాలయం

- భక్తుల విరాళాల్ని స్వీకరిస్తాం
- ట్రస్ట్ కోశాధికారి గిరీజీ మహరాజ్



**జైపూర్:** అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తికావడానికి మూడు నుంచి మూడున్నరేండ్ల సమయం పడుతుందని శ్రీరామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరీజీ మహరాజ్ శనివారం తెలిపారు. ఆలయం నిర్మాణం కోసం భక్తులు సమర్పించే విరాళాల్ని స్వీకరిస్తామని ఆయన తెలిపారు. జైపూర్‌లో నిర్వహించిన ఓ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అక్షర్ ధామ్ నిర్మాణానికి మూడేండ్లు పట్టింది. గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహాన్ని మూడేండ్లలో నిర్మించారు. ఇదేవిధంగా మూడు నుంచి మూడున్నరేండ్ల సమయంలో గొప్ప రామ మందిరాన్ని నిర్మిస్తామని భావిస్తున్నాం' అని తెలిపారు. మందిర నిర్మాణం కోసం భక్తులు ఇచ్చే విరాళాల్ని స్వీకరిస్తారా? అన్న ప్రశ్నకు గిరీజీ స్పందిస్తూ.. 'మందిరం నిర్మాణం కోసం అప్పట్లో ఇటుకలను పంపిన భక్తులు.. ఇప్పుడు అదే మందిరం నిర్మాణం కోసం విరాళాలు పంపొచ్చు' అని చెప్పారు. ప్రజాధనంతో, ప్రజల సహకారంతో ఆలయం నిర్మాణం జరుగుతుందన్నారు. అయితే, ఆలయ నిర్మాణం ఎప్పుడు ప్రారంభం అవుతుందన్న విషయం ఇప్పుడే చెప్పలేమని, నృపేంద్ర మిశ్రా నేతృత్వంలోని ఆలయ నిర్మాణ కమిటీ.. ఆలయ నిర్మాణానికి పట్టే సమయంపై ఇచ్చే సూచనలను అనుసరించి ఆ తేదీ ఆధారపడి ఉంటుందన్నారు.కాగా కమిటీ మరో 15 రోజుల్లో తన సూచనలతో కూడిన నివేదికను ఇవ్వనున్నది. ఆ తర్వాత ట్రస్ట్ సభ్యులు సమావేశమై మందిరం నిర్మాణం ప్రారంభం తేదీపై నిర్ణయం తీసుకోనున్నారు.

## బీజేపీ ఎమ్మెల్యేకు క్లీన్‌చిట్

**భదోహి:** గ్యాంగ్‌రేప్ కేసులో యూపీ బీజేపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ త్రిపాఠికి పోలీసులు శనివారం క్లీన్‌చిట్ ఇచ్చారు. ఆయనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆయన మేనల్లుడిని మాత్రం అరెస్ట్ చేశామన్నారు. 2017లో తనపై లైంగికదాడి చేశారన్న 40ఏండ్ల మహిళ ఫిర్యాదుమేరకు త్రిపాఠితోపాటు ఆయన బంధువులు ఐదుగురిపై కేసు నమోదుచేసిన సంగతి తెలిసిందే.

## రోడ్డు ప్రమాదాల్లో 21 మంది మృతి

- గుజరాత్‌లో 12 మంది.. కశ్మీర్‌లో తొమ్మిది మంది

**వడోదరా/జమ్ము:** రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 21 మంది మృతి చెందారు. గుజరాత్‌లోని వడోదరా జిల్లా మహువడ్ గ్రామం సమీపంలో శనివారం రాత్రి ట్రక్కు, లారీ ఢీకొనడంతో 12 మంది మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. మరోవైపు, జమ్ముకశ్మీర్‌లోని కథువా జిల్లా మల్లార్ గ్రామంలో ప్రయాణికులతోవెళ్తున్న ఓ సుమో అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలు, మరో ముగ్గురు పిల్లలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## ఇద్దరు లష్కరే ఉగ్రవాదుల హతం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో శుక్రవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు లష్కరే తాయిబా ఉగ్రవాదులు హతమైనట్టు పోలీసులు తెలిపారు. మృతులను కుల్గామ్ జిల్లాకు చెందిన నవీద్ అహ్మద్ భట్‌గా, వాన్‌పొరాకు చెందిన అఖిబ్ యాసిన్ భట్‌గా గుర్తించినట్టు రాష్ట్ర డీజీపీ దిల్‌బాగ్ సింగ్ పేర్కొన్నారు. దక్షిణ కశ్మీర్ బిజ్‌బెహర్ ప్రాంతంలోని సంగం వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు తెలిపారు. ఘటనాస్థలంలో పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 2018లో లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థలో చేరిన నవీద్ అహ్మద్ భట్ అనేక ఉగ్రదాడుల్లో పాల్గొన్నాడని తెలిపారు. అతడిపై ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2019 జూన్‌లో ఉగ్రవాద సంస్థలో చేరిన అఖిబ్ యాసిన్ భట్ కూడా అనేక ఉగ్రదాడుల్లో పాల్గొన్నాడని డీజీపీ వెల్లడించారు.

**హిజ్బుల్ కమాండర్ అరెస్టు**


జునైద్ ఫరూఖ్

ఉత్తర కశ్మీర్ బారాముల్లా జిల్లాలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన కమాండర్ జునైద్ ఫరూఖ్ పండిత్‌ను పోలీసులు అరెస్టుచేశారు. ఫిబ్రవరి 5న నర్బాల్ నగర శివారులో భద్రతా బలగాల బృందంపై దాడి ఘటనకు ఇతడే సూత్రధారి అని పోలీసులు పేర్కొన్నారు. ఆ ఘటనలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు.



జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి రాకేశ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. భూపాలపల్లి జిల్లాలోని సమస్యలను వివరించి అభివృద్ధికి అండగా నిలువాలని కేటీఆర్‌ను కోరినట్టు ఆమె తెలిపారు. - కాటారం



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా పెద్దపట్నం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పెద్దపట్నం దాటేందుకు పోటీపడ్డారు. - చేర్యాల, నమస్తేతెలంగాణ



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో శనివారం తెలుగు రాష్ట్రాల స్థాయి బండ లాగుడు పోటీలను హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. - మేళ్లచెర్వు



# కాళేశ్వర గంగ పరవళ్లు

- లింక్-1, 2లో ఉప్పొంగుతున్న జలాలు
- ఎస్సారార్‌కు.. అక్కడి నుంచి ఎల్ఎండీకి..
- ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి తరలుతున్న నీరు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ /కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లింక్-1,2లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగుతుండగా, పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో 5,6,7వ మోటర్లు, అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్‌లో 3, 6, 7, 8వ మోటర్లు నిరంతరాయంగా నీటిని ఎత్తిపోస్తున్నాయి. లింక్-2లో భాగంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో 5, 6వ మోటర్లు నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కులు నంది రిజర్వాయర్‌లోకి తరలుతున్నాయి. 7వ ప్యాకేజీలోని జంటసొరంగాల ద్వారా 8వ ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడా 2, 3వ పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, శనివారం కూడా అవే మోటర్లను నడిపించారు. గాయత్రి పంప్‌హౌజ్‌లో శనివారం సాయంత్రానికి 7.95 టీఎంసీల జలాలను ఎత్తిపోసినట్టు అధికారులు తెలిపారు. ఎత్తిపోతల ప్రక్రియను ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**ఎస్సారార్ @24.989 టీఎంసీలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం(ఎస్సారార్) నుంచి ఎల్ఎండీకి శనివారం 4,232 క్యూసెక్కుల నీటిని పంపించారు. ఎస్సారార్ జలాశయం రివర్స్ స్లూయిస్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 24.989 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

**ఎల్ఎండీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**


ఎస్సారార్ జలాశయం స్లూయిస్ గేట్ల నుంచి ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శనివారం 3,308 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో రాగా, 5,773 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఎల్ఎండీలో ప్రస్తుతం 11.059 టీఎంసీల నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.


**రాంపూర్, రాజేశ్వర్‌రావుపేటలో ఎత్తిపోతలు**

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా మల్యాల మండలం రాంపూర్, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్‌ల నుంచి కాళేశ్వర జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాంపూర్ పంప్‌హౌజ్‌లోని 7వ నంబర్ మోటర్ ద్వారా రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ ఎత్తిపోస్తున్నట్టు వరద కాల్వ ఈఈ సుధాకిరణ్ తెలిపారు. రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌజ్ నుంచి 3, 6వ మోటర్ల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నారు.

**నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీరు**

**గంగాధర :** వేసవిలో పంటలకు నీరందించి రైతులను ఆదుకోవాలన్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి మేరకు శనివారం సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నారాయణపూర్ జలాశయానికి నీటిని విడుదల చేశారు. ఇటీవల కరీంనగర్ జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే విన్నవిస్తూ.. వేసవిలో నారాయణపూర్ రిజర్వాయర్ పరిధిలో నీటిఎద్దడితో రైతులు వేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని తెలిపారు. ఎల్లంపల్లి పైపులైన్ ఎత్తిపోతల ద్వారా టీఎంసీ నీటిని విడుదల చేయాలని కోరగా, వెంటనే సీఎం కేసీఆర్ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా అధికారులు ఎత్తిపోతల ప్రారంభించగా శనివారం మధ్యాహ్నం 2గంటలకు మొదటి పంపు ద్వారా 247 క్యూసెక్కుల ఎల్లంపల్లి జలాలు నారాయణపూర్‌కు చేరుకున్నాయి. మరో పంపు సాయంత్రం ప్రారంభించగా, రాత్రి వరకు మరో 247 క్యూసెక్కులు వస్తాయని అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లోకి నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.





జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌజ్ డెలివరీ సిస్టర్న్‌ల నుంచి బయటికి వస్తున్న నీరు. (ఇన్‌సెట్‌లో) కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ జలాశయంలోకి వస్తున్న ఎల్లంపల్లి నీరు




పటాన్‌చెరులో పట్టణ ప్రగతిపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు సోలిపేట, గూడెం, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి

## ప్రజలతో మమేకం కావాలి

- పట్టణ ప్రగతిలో అందరిని భాగస్వాములను చేయాలి
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

**సంగారెడ్డి ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మున్సిపాలిటీలు ప్రగతి బాట పట్టాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం బాధ్యతగా పనిచేయని ప్రజాప్రతినిధులు, అధికారుల పదవులుపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఉమ్మడి మెదక్ జిల్లా పట్టణ ప్రగతిపై మంత్రి సమీక్షించారు. కౌన్సిలర్లు, కమిషనర్లు, ప్రజాప్రతినిధులు కొత్త మున్సిపల్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పచ్చదనం పెంపునకు 10 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని, నాటిన మొక్కలు 85 శాతం దక్కకపోతే ప్రజా ప్రతినిధులపై కూడా చర్యలు ఉంటాయన్నారు. ఆయా మున్సిపాలిటీల్లోనే చెత్త నుంచి ఎరువులు తయారుచేసుకునే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్నిచోట్ల శ్మశాన వాటికలు, డంప్ యార్డుల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించుకుని, 24 నుంచి వెనుకబడిన ప్రాంతంగా ఉన్న వార్డు నుంచి పట్టణ ప్రగతి మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, గూడెం మహిపాల్‌రెడ్డి, సీహెచ్ మదన్‌రెడ్డి, మాణిక్‌రావు, సోలిపేట రామలింగారెడ్డి, ఎం భూపాల్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క బరాజ్ పనులను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్

## మే 10లోపు 'సీతారామ' పనులు పూర్తవ్వాలి

నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** మే 10 వరకు సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరుకు సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండే, ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధర్‌రావుతో కలిసి ఆయన శనివారం ఉదయం చేరుకున్నారు. అక్కడి నుంచి అధికారుల బృందంతో కలిసి మండలంలోని కుమ్మరిగూడెం వద్ద దుమ్ముగూడెం ఆనకట్టను సందర్శించారు. అక్కడే ఏర్పాటు చేసిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను చూసి, పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ప్రతిపాదిత సీతమ్మ ప్రాజెక్టు (దుమ్ముగూడెం బరాజ్) పనులను వ్యూ పాయింట్ నుంచి పరిశీలించారు. తర్వాత భీముని గుండం కొత్తూరు వద్ద సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మొదటి పంప్‌హౌజ్‌ను సందర్శించి.. త్వరితగతిన ట్రయల్‌రన్ పూర్తి చేయాలని ఆదేశించారు.

**మార్చి 22 వరకు సమ్మక్క బరాజ్ పనులు పూర్తిచేయాలి**

**ములుగు జిల్లా ప్రతినిధి :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్క బరాజ్ పనులను మార్చి 22 వరకు పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తుపాకులగూడేన్ని సందర్శించిన ఆయన పనులను పరిశీలించారు. మార్చి 22 నాటికి 30 గేట్లకు షట్టర్స్ నిర్మాణం పూర్తిచేస్తామని, ఏప్రిల్ వరకు 50 గేట్లకు షట్టర్స్ బిగింపు ప్రక్రియను పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు రజత్‌కుమార్‌కు వివరించారు.


Telangana State Co-operative Marketing Federation Ltd.,
Email: proc.tsmarkfed2018@gmail.com, Ph.No: 040-2460 7108, Fax: 040-2460 7100
CORRIGENDUM-IV
In accordance to the Corrigendum-II issued dated on 10.02.2020 for tender notification published for disposal of Agricultural Commodities. (a) Red Gram- Schedule-I (b) Red Gram- Schedule-II (c) Bengal Gram (d) Jowar. It is hereby requested to note that the opening of tender for the above commodities scheduled dated on 22.02.2020 is here by postponed to 27.02.2020. For further details please contact. Ph: 7288879806, and 7288879829.
Date : 22.02.2020 Sd/- MANAGING DIRECTOR

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ
5-10-193, 2వ అంతస్తు, "HACA భవన్" పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా, హైదరాబాద్-500004
CIN:UO1407TG2015SGC097542
షార్ట్ టెండరు ప్రకటన
No.TSSDC/Mrkt/e-tender/K'2020/2019-20 తేది: 22-02-2020
C1 ఇండియా లిమిటెడ్, హర్యానా ద్వారా నిర్వహించే ఇ-వేలం ద్వారా TSSDC లిమిటెడ్‌కు సోయాబీన్ సర్టిఫైడ్ విత్తనం మరియు పచ్చిరొట్టె T/L విత్తనాలు ఖరీఫ్-2020లో సరఫరా చేయుటకు ఆసక్తిగల పార్టీల నుండి బిడ్స్ కోరబడుచున్నవి. బిడ్డరు ఆన్‌లైన్ ట్రేడింగ్ సిస్టమ్ కోసం వెబ్‌సైట్ https://tssdcl.eproc.inను చూడగలరు. వివరాలు www.tssdcl.telangana.gov.inలో మాత్రమే తేది: 23-02-2020 నుండి ఉంచబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 7337346243/+91-124-4302033/36/37;email: tssdclsupport@c1india.com. ఇ-వేలం నిర్వహించబడు తేది: 05-03-2020
DIPR RO. No. 690-PP/CL/Advt/1/2019-20, Dt: 22/02/2020 సం/- మేనేజింగ్ డైరెక్టర్


నగరపాలక సంస్థ కార్యాలయం:ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖమ్మం నగరపాలక సంస్థ, ఖమ్మం జిల్లా, తెలంగాణ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద దిగువ విధంగా స్వల్పకాలిక టెండరు ప్రకటన ప్రకారం ఆసక్తి వ్యక్తీకరణ & రేట్ కాంట్రాక్టు కోరుతున్నారు.
NIT No. 18/DB/KMC/1624/2019-20, తేది: 22.02.2020
1. ఎ) మొత్తం పనుల సంఖ్య : 3 నం.లు, బి) పనుల యొక్క స్వభావం: i) BOOT ప్రాతిపదికన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కొరకు EoI-1 నం., ii) ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ ''పట్టణ ప్రగతి'' కొరకు JCB నియోగించుటకు రేటు కాంట్రాక్టు-1 నం. iii) ఫాగింగ్ మెషీన్లు సేకరణ కొరకు రేటు కాంట్రాక్టు-1నం. 2. పని యొక్క మొత్తం విలువ: NA, 3. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.02.2020న ఉ. 10.30 గం॥, 4. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 25.02.2020న సా. 04.00 గం॥, 5. బిడ్ తెరచు తేది: 25.02.2020న సా. 04.30 గం॥ కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు & చిరునామా: అసిస్టెంట్ ఇంజినీర్, ఖమ్మం నగరపాలక సంస్థ, మొబైల్: 7901298207 (అసిస్టెంట్ ఇంజినీర్). తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: http://tender.telangana.gov.in (రేటు కాంట్రాక్టు పనుల కొరకు) & http://khammamcorporation.telangana.gov.in (EoI కొరకు)లో చూడవచ్చును.
DIPR RO No. 696-PP/CL/Advt/1/2019-20, Dt: 22.02.2020 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఖమ్మం నగరపాలక సంస్థ

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
దిగువ తెలిపిన పనుల కొరకు TS ట్రాన్స్‌కో ఆన్‌లైన్ బిడ్లు కోరుతోంది: స్పెసిఫికేషన్ నెం. e-TSTLI-05/2019: (i) 2 నెం.ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరాతోసహా RS ఘన్‌పూర్ (రాజవరం) వద్ద 132/33-11KV సబ్‌స్టేషన్. (ii) ప్రస్తుతమున్న 132 KV ధర్మసాగర్-రఘునాథపల్లి నుండి ప్రతిపాదిత 132/33-11KV RS ఘన్‌పూర్ (రాజవరం) వరకు 1 కి.మీ. 132KV LILO లైన్. (iii) 132/11KV సబ్‌స్టేషన్ రంగారావుపల్లి వద్ద 11KV 12.5 MVAR కెపాసిటర్ బ్యాంక్ మరియు (iv) వరంగల్ (పాత) జిల్లాలో టర్న్‌కీ ప్రాతిపదికన ములుగు సబ్‌స్టేషన్‌లో 132/33KV అసోసియేటెడ్ యాక్సెసరీస్ (కెపాసిటర్ బ్యాంక్ సరఫరా లేకుండా) వద్ద 33KV 15 MVAR కెపాసిటర్ బ్యాంక్ సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట. వెబ్‌సైట్‌లో టెండరు లభ్యత: తేది: 20-02-2020. గమనిక: తదుపరి వివరాలను వెబ్‌సైట్: tender.telangana.gov.inలో చూడవచ్చును.
ఫోన్/ఫ్యాక్స్ నెం. : 040-23323565, 040-23396000, Extn. 3752, 3724, 3349,3502.
R.O.No. 52/19 సం/- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్




వెల్లంకి చెరువులో నుంచి కారును బయటకు తీస్తున్న పోలీసులు







దర్నె మధు, మణికంఠ, నన్నూరి శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

## ముగ్గురు జలసమాధి


మొదటిపేజీ తరువాయి...


4 గంటలకు రాణి తన భర్త మధుకు ఫోన్ చేయగా వస్తున్నామని చెప్పారు. ఆ కొద్దిసేపటి తరువాత మొబైల్ స్విచ్ ఆఫ్ కావడంతోపాటు రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన సర్పంచ్ రాణి అతని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించింది. ఏసీపీ సత్తయ్య, సీఐ ఏవీ రంగా, ఎస్సై సీహెచ్ సాయిలు వెల్లంకిలోని వ్యవసాయ బావివద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం పోలీసులు మరోసారి బావి వద్దకు వెళ్లారు. వ్యవసాయ బావి వద్ద నుంచి సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న ఈదుల చెరువు వద్ద మధు సెల్‌ఫోన్ సిగ్నల్ చూపించడంతో గ్రామస్థుల సహాయంతో చెరువులో సుమారు గంటకు పైగా గాలించగా కారు కనిపించింది. వెంటనే జేసీబీ, తాళ్ల సహాయంతో కారును బయటకు తీసి అద్దాలను పగులగొట్టి అందులోని మృతదేహాలు బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రామన్నపేట దవాఖానకు తరలించారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో కారు అదుపుతప్పి ఈదుల చెరువులోకి దూసుకెళ్లడంతో ముగ్గురు జలసమాధి అయ్యారని పోలీసులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సైతం వెల్లంకి గ్రామానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. భర్తను, కొడుకును కోల్పోయి కన్నీరు మున్నీరైన సర్పంచ్ రాణిని ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న సర్పంచ్ రాణి

## తుపాకీ మిస్‌ఫైర్..

కానిస్టేబుల్‌కు తీవ్రగాయం

**తిర్యాణి:** ఎస్ఎల్ఆర్ తుపాకీ శుభ్రం చేస్తున్న క్రమంలో మిస్‌ఫైర్ జరిగి టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం 4.50 గంటల ప్రాంతంలో జరిగింది. స్టేషన్‌లో సెంట్రీగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ డ్యూటీ దిగే సమయంలో తుపాకీని శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ కావడంతో ఎడమ దవడ నుంచి తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. తీవ్ర రక్తస్రావంతో స్పృహ కోల్పోగా సిబ్బంది వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ సుధీం ద్ర రాత్రి ఘటన స్థలాన్ని పరిశీలించారు. తుపాకీని బట్టతో శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయ్యిందనీ, ప్రమాదంపై అనుమానాలు లేవన్నారు. కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ స్వస్థలం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం చౌటపల్లి.



కిరణ్‌కుమార్

## కన్న కొడుకునే కడతేర్చిన తల్లి

వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని దారుణం


**నల్లగొండ సిటీ:** వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని ఓ తల్లి తన కొడుకునే హత్యచేసిన ఘటన శుక్రవారం రాత్రి నల్లగొండ మండలం బుద్దారం గ్రామంలో చోటుచేసుకున్నది. నల్లగొండ రూరల్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలేటి వెంకన్న-విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. వెంకన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా, విజయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డితో విజయకు కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం వెంకట్‌రెడ్డి, విజయలు ఇంట్లో సన్నిహితంగా ఉండగా ఆమె చిన్నకొడుకు నాగరాజు అలియాస్ చింటు(9) చూశాడు. ఈ విషయాన్ని తన భర్తకు చెబుతాడనే భయంతో విజయ.. వెంకట్‌రెడ్డితో కలిసి నాగరాజును గొంతుపిసికి చంపింది. అనంతరం తన కొడుకు అనారోగ్యంతో మృతి చెందినట్టు గ్రామస్థులకు తెలిపింది. గ్రామస్థులు చూసేందుకు ఇంటికి రాగా.. నాగరాజు మెడ కనిపించకుండా పదేపదే దుప్పటి కప్పుతుండటంతో అనుమానం వచ్చిన ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి దుప్పటి తీసి చూశారు. బాలుడి మెడ నల్లగా కమిలిపోయి ఉండటంతో అనుమానంవచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. విజయను అరెస్టు చేసి విచారించగా తానే తోకల వెంకట్‌రెడ్డితో కలిసి కొడుకును హత్య చేసినట్టు ఒప్పుకొన్నదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



నాగరాజు (ఫైల్)

## ఆడుకునే గోలి మింగి చిన్నారి మృతి

**కోరుట్లటౌన్:** ఆడుకునే సీసపు గోలి మింగి 11 నెలల చిన్నారి మృతిచెందిన విషాదఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. స్థానిక పోచమ్మవీధికి చెందిన కోరుట్ల రవిరాజ్, అపర్ణ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. రవిరాజ్ మేడిపల్లి మండలం దమ్మన్నపేట పంచాయతీ సెక్రటరీగా పని చేస్తుండగా, అపర్ణ జగిత్యాలలో ఓ ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తూ జగిత్యాలలోనే నివసిస్తున్నారు.మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం కోరుట్లలోని సొంతింటికి కుటుంబంతో వచ్చారు. శనివారం ఉదయం వీరి కొడుకు అభియంత్(11నెలలు).. కాలనీకి చెందిన పిల్లలతో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. అక్కడే ఉన్న సీసపు గోలిని అభియంత్ నోట్లో పెట్టుకోగా. గొంతులోకి జారింది. ఊపిరాడకపోవడంతో వెంటనే స్థానిక పిల్లల వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి జగిత్యాలకు తీసుకువెళ్లగా బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పండుగ పూట కొడుకు అకాలమరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.



అభియంత్

## చేపల వేటకు వెళ్లి తండ్రీకొడుకుల మృతి

**బోధన్ రూరల్:** సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మరణించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం మినార్‌పల్లిలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మినార్‌పల్లికి చెందిన కోల దీప్ల(60), శ్రీను(27) తండ్రీకొడుకులు. శనివారం వీరు చేపలు పట్టేందుకు శివారులోని మద్దికుంట చెరువుకు వెళ్లారు. చెరువులో నీరు తక్కువగా ఉండటంతో కుంటలాంటి చోట దిగారు. చేపలు పడుతున్న క్రమంలో జారి లోతులోకి వెళ్లిపోవడంతో నీట మునిగిపోయారు. సమీపంలో పశువులు మేపుతున్న వారు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు కలిసి చెరువులో గాలించగా తండ్రీకొడుకుల మృతదేహాలు లభించాయి. దీప్లకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనుకు మూడేండ్ల కుమార్తె ఉండగా ప్రస్తుతం అతని భార్య గర్భిణి. తండ్రీకొడుకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బోధన్ రూరల్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారులు

**జనగామ, నమస్తేతెలంగాణ:** రిటైర్డ్ అటెండర్ నుంచి లంచం తీసుకుంటూ శనివారం ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. ఉమ్మడి వరంగల్ ఏసీబీ ఏసీపీ మధుసూదన్ వివరాల ప్రకారం.. రేణుకుంట్ల ఐలయ్య జనగామలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి 2019 డిసెంబర్ 31న రిటైర్‌అయ్యారు. తనకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పింఛన్, ఇతర రిటైర్‌మెంట్ ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసేందుకు డీఎస్సీడీవో గట్టుమల్లు రూ.10 వేలు డిమాండ్ చేయగా, రూ. 5 వేలకు ఒప్పందం కుదిరింది. కాగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఉదయం ఐలయ్య నుంచి డీఎస్సీడీవో గట్టుమల్లు రూ.3 వేలు, ఆఫీసు సూపరింటెండెంట్ ఖదీరుద్దీన్ రూ.2 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.


## యువతిపై లైంగికదాడికి యత్నం

**నేరేడుచర్ల :** సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఓ యువతి(19)పై కారింగుల కిరణ్ అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి లైంగికదాడికి యత్నించాడు. యువతి కేకలు వేయడం తో ఆమె కుటుంబసభ్యులకు చెందిన ద్విచక్ర వాహనాన్ని దహనం చేసి పారిపోయాడు. పట్టణంలోని ఓ కాలనీలో భర్తను కోల్పోయిన ఓ మహిళ తన కుమార్తె, కుమారుడితో కలిసి నివసిస్తున్నది. నల్లగొండలోని కళాశాలలో చదువుతున్న ఆమె కుమార్తె శివరాత్రి సందర్భంగా ఇంటికి వచ్చింది. నర్సుగా పని చేస్తున్న తల్లి నైట్ డ్యూటీకి వెళ్లగా.. కుటుంబసభ్యులతో కలిసి యువతి నిద్రిస్తున్నది. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో కిరణ్ వీరి ఇంటి తలుపు తట్టాడు. ఎవరో వచ్చారని తలుపులు తీయగా.. కిరణ్ లోపలికి వచ్చి యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించగా కేకలు వేసింది. పారిపోయిన కిరణ్ అరగంట తర్వాత మళ్లీ వచ్చి ఇంటి ముందున్న యువతి సోదరుడి ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మా భూమి ఇప్పించండి

- ఫోర్జరీ సంతకాలతో పట్టాచేసుకొన్న వారిపై చర్యలు తీసుకోండి
- జనగామ జిల్లా మేకలగట్టు గ్రామవాసుల వినతి

**రఘునాథపల్లి:** ఫోర్జరీ సంతకాలతో వ్యవసాయ భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయంచేయాలని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన ముక్క రాజు, సిద్దిరాములు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. అక్రమంగా పట్టా చేయించుకోవడమే కాకుండా ఇతరులకు విక్రయించారని, విచారణ జరిపి తమ భూమిని తిరిగి ఇప్పించాలని తాసిల్దార్‌ను వేడుకొన్నారు. శనివారం బాధితులు ముక్క రాజు, సిద్దిరాములు తమ గోడును మీడియాకు వెళ్లబోసుకొన్నారు. మేకలగట్టు గ్రామంలోని సర్వే నంబర్ 175లో 2.20 ఎకరాల భూమిని ఇల్లందుల చంద్రయ్య వద్ద ముక్క వెంకటయ్య 1995లో కొనుగోలు చేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఆ భూమిని పట్టాచేయించుకోలేదు. వెంకటయ్య మరణానంతరం ఆయన కుమారులు ముక్క రాజు, సిద్దిరాములు సాదా బైనామా కింద పట్టాచేయాలని రెండేండ్ల క్రితం అప్పటి వీఆర్వో కొమురయ్యకు దరఖాస్తు చేసుకొన్నారు. రికార్డులు సరిగా లేవనే కారణంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వో పట్టాచేయలేదు. అప్పటినుంచి అన్నదమ్ములిద్దరూ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో తమ భూమిని వారిపేరిట పట్టా చేయించుకోవడమే కాకుండా ఇతరులకు విక్రయించినట్టు బాధితులు గుర్తించారు. 25 ఏండ్లుగా కబ్జాలో ఉండి వ్యవసాయం చేసుకొంటున్న తమ భూమిని కాజేసినవారిపై విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని, తమ భూమిని తిరిగి ఇప్పించాలని రాజు, సిద్దిరాములు రెవెన్యూ అధికారులను వేడుకొంటున్నారు.




అధికారులకు సమర్పించిన దరఖాస్తును చూపుతున్న ముక్క రాజు, సిద్దిరాములు

నమస్తే తెలంగాణ /nt.zindagi
ఆదివారం 23 ఫిబ్రవరి 2020
జిందగీ
WWW.NTNEWS.COM


అప్పటి కశ్మీర్.. నిత్యం తుపాకుల మోత, జవాన్ల కవాతు చప్పుళ్లు, ఎప్పుడు ఎక్కడ బాంబు పేలుతుందో తెలియని భయం. శత్రువు ఎవరో? మిత్రుడెవరో? తెలియని సందిగ్ధం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలమెల్లదీసిన దైన్యం. మొత్తంగా మనకు తెలిసిన కల్లోల కశ్మీర్ అది. ఇప్పటి కశ్మీర్.. ప్రకృతి రమణీయతలో ఓలలాడుతూ.. స్వేచ్ఛావాయువును మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తున్నది. తెల్లటి మంచుదుప్పటి పరుచుకున్న పర్వతాలపై 'ఆజాదీ' పలకరింపులతో పులకరించిపోతున్నది. అక్కడి భావితరం బంధనాలు తెంచుకున్న పక్షిలా స్వేచ్ఛగా విహరిస్తున్నది. అందుకు ప్రతీకలు వీరే.



# కశ్మీర్ స్వేచ్ఛకు ప్రతీకలు

**'మాకు శాంతి** కావాలి. అభివృద్ధి విస్తృతంగా జరుగాలి. స్వార్థ రాజకీయ విషాన్ని మా బుర్రల్లో ఎక్కించుకునేందుకు మేం సిద్ధంగా లేం. ఆ ఆలోచనే మాకు లేదు. ఆర్టికల్ 370 తీసేయడంతో మాకు మేలే జరుగుతుందని మా భావన. అదొక్కటే మా భవిష్యత్తును మార్చదు. మాకు సరైన ఉద్యోగాలు కావాలి, మావాళ్లకు ఉపాధి చూపాలి. అప్పుడే మాకు న్యాయం జరిగినట్లు' ఇదీ.. కశ్మీరీ లోయలోని చిన్నారుల హృదయ వేదన. స్వేచ్ఛ ఇచ్చిన సాంత్వన. 'ఏ వతన్‌కో జానో' కార్యక్రమం ద్వారా దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి.. తమ ప్రాంతంలో కూడా విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాలు రావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారీ కశ్మీర్ విద్యార్థులు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న 'భారత్ దర్శన్' యాత్రతో ఒక్కసారిగా ఇంతటి విశాల భారతాన్ని, స్వేచ్ఛావాయువులతో, ఎంతో గొప్ప జీవితాలు జీవిస్తున్న తమ భారతీయ సోదరులను చూసి ఒకింత ఆశ్చర్యం, ఆనందం పొందుతున్నారు.

### ఆర్టికల్ 370 తొలిగించడం మంచిదే..



**నేను** ఈ ఫౌండేషన్‌లో 15 ఏండ్లుగా వలంటీర్‌గా, స్థానిక స్కూళ్లలో టీచర్‌గా చేస్తున్నా. కశ్మీరి వ్యాలీలో పరిస్థితి ఎంతో భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ఆడపిల్లలు గడపదాటి బయటికి వచ్చే పరిస్థితి ఉండదు. కానీ ఇప్పుడు మా బృందంలో ఏకంగా 26 మంది అమ్మాయిలు ఉన్నారు. వాళ్ల తల్లిదండ్రులు పిల్లలను బయటికి పంపారంటే ఎంతో గొప్ప విషయం. ఇప్పుడు అనిపిస్తుంది.. ఆర్టికల్ 370 తొలిగించడం మంచిదేనని. వీళ్లకు మన దేశం అంటే ఏంటి? ఎంత సుందరంగా, శాంతియుతంగా ఉంటుంది. మన దేశం ఎంత అభివృద్ధి చెందింది? మన భవిష్యత్తు కోసం బయటి ఎన్ని అవకాశాలు ఉన్నాయి? వంటి అనేక మంచి ఆలోచనలు వాళ్లకు కల్గించడమే మా యాత్ర ముఖ్య ఉద్దేశం. వీరిని చూసి కొందరి పిల్లల్లోనైనా మార్పు వస్తుందని మా అభిప్రాయం. ఈ యాత్ర ద్వారా సానుకూల దృక్పథాన్ని అలవాటు చేశాం.

**- ఖుర్షీద్,** వలంటీర్, బార్డర్‌లెస్ వరల్డ్ ఫౌండేషన్

### జవాన్లను చూస్తే పారిపోయేవాళ్లం..



**కశ్మీర్‌లోని** బారముల్లా జిల్లా నుంచి వచ్చా. నేను రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చేస్తున్నా. ఇక్కడ వీరిని చూసి చాలా సంతోషంగా అనిపించింది. ఇక్కడ వాతావరణం బాగుంది. మేం కశ్మీర్‌లో ఉన్నప్పుడు యూనిఫాంలో ఉన్న మిలిటరీ, సీఆర్‌పీఎఫ్ జావాన్లు ఎవరినీ చూసిన ఎంతో భయం వేసేది. వాళ్లు ఎదురుపడ్డా తలవంచుకొని అక్కడ నుంచి తప్పుకొని వెళ్లేవాళ్లం. ఎందుకో తెలియదు చిన్నప్పటి నుంచి మాకు అలవాటైంది. కానీ ఇక్కడికి వచ్చిన తర్వాతే తెలిసింది.. వాళ్లంతా బార్డర్‌లో మాకోసమే పహారా కాస్తున్నారని. వాళ్ల రక్షణ వల్లే మేం అక్కడ ఉండగల్గుతున్నామని అర్థమైంది. ఇక్కడ సీఆర్‌పీఎఫ్ వాళ్ల మమ్మల్ని ఎంతో బాగా చూసుకుంటున్నారు. ఎంతో ప్రేమగా మాతో మాట్లాడుతున్నారు. అన్ని ప్రదేశాలు చూపుతున్నారు. అంతా మా అన్నదమ్ములు, బంధువులే అన్న ధైర్యం మాకు ఇప్పుడు వచ్చింది.

**- రుబీనా ఆయాజ్,** పీజీ స్టూడెంట్, బారముల్లా

ఒకప్పుడు తుపాకీ చేతబట్టిన జవాన్ దగ్గరకు వెళ్లాలంటేనే భయపడే పిల్లలంతా.. ఇప్పుడు అదే భద్రత అధికారులతో కలిసి సెల్ఫీలు తీసుకునేంతలా ఈ భరోసా యాత్ర వారిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నది. ఇందులో భాగంగా సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సందర్శనకు వచ్చారు కశ్మీరీ లోయకు చెందిన 46 మంది విద్యార్థులు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అక్కడ పరిస్థితి ఎలా ఉంది? వాస్తవంగా కశ్మీరీ యువత ఏం కోరుకుంటున్నది? అనే అంశాలను 'జిందగీ'తో పంచుకున్నారు.

### దేశాన్ని తెలుసుకుంటున్నారు..

'ఏ వతన్‌కో జానో' కార్యక్రమం ద్వారా దేశం గురించి తెలుసుకొనే అవకాశం కశ్మీర్ విద్యార్థులకు కల్పించింది భారత ప్రభుత్వం. ఇందులో భాగంగా.. మొత్తం 46 మంది విద్యార్థులకు దేశంలో ప్రముఖ ప్రాంతాలను చూపిస్తూ.. అక్కడ జరుగుతున్న అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ, విద్యా అవకాశాల గురించి వివరిస్తున్నారు. ఇందులో 26 మంది బాలికలు, 20 మంది బాలురు ఉన్నారు. ఈ 46 మందిలో చాలామంది ఈ లోకాన్ని కొత్తగా చూస్తున్నవారే ఉన్నారు. ఎందుకంటే వారు పుట్టి బుద్ధి ఎరిగిన తర్వాత సొంత గ్రామాలు దాటి బయటికి రావడం ఇదే మొదటిసారి. ఇన్నేండ్ల జీవితంలో వారు మహా అయితే ఐదు, పది కిలోమీటర్లే తిరిగి ఉంటారు. ఇల్లు లేదంటే బడి/కాలేజీ. నిత్య అలజడుల మధ్య కలుగుల్లో ఎలుకల్లా ఎక్కడో ఒక మూలన దాచుకునే పిల్లలు 'ఏ వతన్‌కో జానో' కార్యక్రమం ద్వారా స్వేచ్ఛా విహంగాలయ్యారు.

### మాకు అభివృద్ధి కావాలి..



**ఆర్టికల్** 370 తీసేసిన తర్వాత కొంత వరకు మాకు రిలీఫ్ ఉంది. కానీ ఇంకా కూడా రాత్రి 10 దాటితే చెకింగ్‌లు ఉంటున్నాయి. మాకు డెవలప్‌మెంట్ కావాలి. రాజకీయాలు కాదు. ఉత్త మాటలు చెప్పడంతో మా కడుపులు నిండవు. మాకు ఉద్యోగాలు రావు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చి, మాకు ఉపాధి, ఉద్యోగాలు దొరికితే మంచిది. కానీ మా వరకైతే 370 ఉందా లేదా కాదు. మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందా? లేదా? మాకు ఉద్యోగాలు వస్తున్నాయా లేదా? అన్నదే ముఖ్యం. వస్తాయన్న నమ్మకం ఉంది. ఈ టూర్‌లో బయటికి వచ్చిన మాకు విశ్వాసం పెరిగింది. ఇక్కడ ఎంతో వేడిగా ఉంది. మా దగ్గర ఈ టైంలో మొత్తం మంచు కుప్పలే కనిపిస్తాయి.

**- ఉఫత్‌అలీ,** పొలిటికల్ హిస్టరీ విద్యార్థి, బందీపొర

### లక్ష్య నిర్దేశణపై స్పష్టత ఇచ్చాం



**విద్యార్థులను** తమకు నచ్చిన జీవిత లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవడం, అందుకోసం ఎలా పోరాడాలన్న ఆత్మవిశ్వాసం వారిలో నింపితే తప్పక విజయం సాధిస్తారు. ఇందుకోసం మేం ప్రత్యేక అంశాలతో వర్క్‌షాప్‌ను టీనేజ్ ఫౌండేషన్ అనే మా ఎన్‌జీఓ ద్వారా నిర్వహిస్తున్నాం. వారి స్వస్థలం తప్ప మిగిలిన ప్రపంచాన్ని చూడని ఈ కశ్మీరీ విద్యార్థుల్లో ఉన్న సృజనను బయటికి తీసేలా వారితో ఎన్నో కార్యక్రమాలు చేయించాం. వారంతా విజయవంతమైన పౌరులుగా తమను తాము ఎలా మార్చుకోవాలో వివరించాం.

**- డా.లలితా ఆనంద్,** టీనేజ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ

### మొదటిసారి రైళ్లను చూశారు..

కశ్మీర్ జిల్లాలోని భాండీపుర, భారముల్లా ప్రాంతానికి చెందిన ఈ విద్యార్థుల్లో దాదాపు అందరు వారి స్వస్థలాలు దాటి.. అంటే ఐదు కిలోమీటర్ల దూరం దాటి బయటికి తొలిసారి వచ్చారంటే ఆశ్చర్యం కలుగక మానదు. మొత్తం 46 మంది విద్యార్థుల్లో దాదాపు 40 మంది తొలిసారిగా రైలును చూశారు. దాదాపు అందరు విద్యార్థులు తొలిసారిగా విమానం ఎక్కడంతో వారి సంతోషానికి అవధుల్లేవు. ఈ యాత్ర ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఐజీ రాములునాయక్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్, టీనేజ్ ఫౌండేషన్ సంస్థ చేస్తున్న ప్రయత్నం అభినందించదగినది. మీరంతా తోడుగా ఉంటే 'హమ్‌బీ హోంగే కామ్‌యాబ్'(మేం కూడా విజయం సాధిస్తాం)అని ఉత్సాహంగా చెబుతున్నారు ఈ కశ్మీర్ భవిత.


### సంతోషం, శాంతి మొదటి సారి చూస్తున్నా..



**మొదటిసారి** మా ఊరు దాటి బయటికి వచ్చాను. ఎన్నో విషయాలను చూస్తున్నా, నేర్చుకుంటున్నా. ఎంతో సంతోషంగా ఉంది. మా కశ్మీర్ లోయ ప్రాంతంలో ఎప్పుడు ఇంత శాంతిగా, ఇంత సంతోషంగా ఉండదు. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక గొడవ ఉంటూనే ఉంటుంది. ఆర్టికల్ 370 తొలిగించిన తర్వాత పరిస్థితి బాగానే ఉంది. అప్పుడు స్కూళ్లకు వెళ్లాలన్నా ఎంతో భయం ఉండేది. టీచర్లు కూడా భయం భయంగానే చదువు చెప్పేవాళ్లు. ఈ ఆర్టికల్ 370 తీసేసిన తర్వాత మాకు ఎంతో బాగా అనిపిస్తుంది. ఆ ఆనందం మాటల్లో వర్ణించలేనిది.

**- కుష్బు ముస్తాక్,** 9 తరగతి విద్యార్థి, బందీపొర

### మొదటిసారి విమానం ఎక్కా..



**ఇక్కడ** చాలా బాగుంది. ఇది చాలా అందమైన ప్రదేశం. మేం మొదటిసారి విమానం, రైలు ఎక్కాం. కానీ మేం ఢిల్లీ ఎయిర్‌పోర్టులోకి రాగానే కొందరు మమ్మల్ని చూసి బూతులు తిట్టారు. ఎంతో బాధగా అనిపించింది. 'ఈ కశ్మీరీ వాళ్లు మళ్లా ఇక్కడికి ఎందుకు వస్తున్నారు. మిమ్మల్ని ఎవడు రమ్మంటున్నారు'అని తిట్టారు. కానీ, ఇక్కడ ప్రజలు ఎంతో మంచివాళ్లు. ప్రేమగా చూసుకుంటారు. ఈ వాతావరణం కూడా మాకు ఎంతో కొత్తగా ఉంది. మొదట భయం అనిపించింది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. భారతదేశం అంటే ముందు నుంచి ఉన్నదానికంటే ఇదంతా చూసిన తర్వాత ప్రేమ పెరిగింది.

**- ఉల్ఫద్ రెహమాన్,** బీఏ ఫస్ట్ ఇయర్ బందీపొర

... **నాగోజు సత్యనారాయణ,** స్టేట్ క్రైం రిపోర్టర్
జి.చిన్నయాదగిరిగౌడ్

# సన్మార్గంలో నడిపించి..



కోల్‌కతాలోని మురికివాడల్లో ఉండేవారు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. దీనిల్ల వారి భవిష్యత్‌తోపాటు తమ బిడ్డల జీవితాలు చీకటిమయమవుతున్నాయి. అటువంటి వారిని చేరదీసి సన్మార్గంలో నడిపించాలనుకున్నది కోల్‌కతాకు చెందిన మొయిత్రాబెనర్జీ అనే మహిళ. మురికివాడల్లో నివసించే కొందరు భిక్షాటన చేస్తూ వచ్చిన ఆదాయంతో మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. ఆహారం తీసుకోకుండా వారంతా మాదకద్రవ్యాలతోనే గడిపేస్తున్నారు. వారి పిల్లలూ అదే బాటలో పయనిస్తున్నారు. మొయిత్రా అటువంటి వారిలో మార్పు తీసుకురావాలని సంకల్పించింది. అసలు వారంతా ఎందుకిలా చెడువ్యసనాలకు బానిసలవుతున్నారో తెలుసుకొనేందుకు సిద్ధమయింది. అందుకోసం మొయిత్రా శేఒరాపులి రైల్వే స్టేషన్ పరిధిలో ఉండే కొంతమంది చిన్నారులను ఆరాతీసింది. వారి సమస్యలను పరిష్కరించేందుకు మొయిత్రాబెనర్జీ సిద్ధమైంది. అందుకోసం కోల్‌కతాకు చెందిన' మహాజిబాన్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరింది. మత్తుపదార్థాలకు బానిసలైన వారిని చేరదీసి వారికి అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వడం మొదలు పెట్టింది. పలురకాల వర్క్‌షాప్‌లు నిర్వహించి నెమ్మదిగా వారిలో మార్పు తీసుకువచ్చింది. 'జీవితమంటే ఇలా గడపడం కాదు. ఎన్నో సాధించాలంటూ' వారికి హితబోధ చేసింది. నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారి విజయ గాథలను గురించి వారికి చెబుతూ ఆదర్శభావాలను నింపింది. మురికివాడలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో నివసించే 110 మంది చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నది. ఇండ్లు లేనివారికి ఆశ్రయం కల్పించింది. మహిళలకు చేతివృత్తులపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అందించింది. మొయిత్రా అందించిన సహకారంతో ప్రస్తుతం అక్కడి మురికివాడల్లో నివసించేవారంతా సుఖసంతోషాలతో ఉన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. చెడుదారి పట్టిన వారందరినీ సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేసిన మొయిత్రాను అందరూ ప్రశంసిస్తున్నారు.

**మురికివాడల్లో నివసించేవారు మత్తు పదార్థాలకు బానిసలవ్వడమేకాకుండా వారి జీవితాలను చీకటిమయం చేసుకుంటున్నారు. అటువంటి వారిలో మార్పు తెచ్చేందుకు ఓ మహిళ ముందుకు వచ్చింది. వారికి పునరావాసం కల్పించి సన్మార్గంలో నడిపిస్తున్నది.**

# మాంసం వాసనొస్తున్నదా?

- కోడిమాంసం, రొయ్యలు సహజంగా నీచు వాసన వస్తుంటాయి. వండే ముందు వీటికి కొంచెం పసుపు రాసి పక్కన పెడితే వాసన రావు.
- ఆమ్లెట్ వేసేటప్పుడు ఆ మిశ్రమంలో ఒక స్పూన్ శనగపిండి వేస్తే ఆమ్లెట్ చక్కగా వస్తుంది. మంచి రుచి కూడా ఉంటుంది.
- పచ్చి మిరపకాయల్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవాలంటే మిరపకాయల తొడిమలు తీసేసి గాజు సీసాలో వేసి వాటిపై కాస్త పసుపు చల్లి మూత బిగించి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువరోజులు నిల్వ ఉంటాయి.
- గోధుమ పిండి, శనగపిండి, బియ్యంపిండిలో పురుగులు పట్టకుండా ఉండాలంటే ఓ మంచి గుడ్డముక్కలో కాస్త ఉప్పు వేసి వాటిలో పెడితే పురుగు పట్టకుండా ఉంటాయి.
- ప్లాస్టిక్ డబ్బాలో నెయ్యి, నూనె, వనస్పతి పేరుకుపోయి కడగడం ఇబ్బందైతే ఆ డబ్బాలో కాస్తంత వేడి నీళ్లు పోస్తే గడ్డ కట్టినది పైన పేరుకుపోతుంది.
- నిమ్మకాయలు అన్నిసందర్భాల్లో దొరకవు. అందుకని దొరికినప్పుడే కొనేసి ఒక బాటిల్‌లో రసం పిండుకొని భద్రపర్చాలి. ఐస్ ట్రేలో నిమ్మరసాన్ని పోసి ఒక రోజంతా ఉంచితే ఐస్ లెమన్ క్యూబ్స్ తయారవుతాయి. వాటిని జిప్ లాక్ బ్యాగ్‌లో పెట్టుకొని ఫ్రిజ్‌లో భద్రపర్చుకోవాలి. ఇలా ఎప్పుడు కావాలంటే అప్పుడు ఐస్ లెమన్ క్యూబ్స్ వాడుకోవచ్చు.



# వంటిట్లో ఔషధాలు!



**ఔషధాలు ఎక్కడుంటాయి? ఠక్కున మెడికల్ షాప్‌లో అని మాత్రం సమాధానం చెప్పొద్దు. వంటింట్లో, మన చుట్టూనే ఉంటాయి. అవేంటో తెలుసుకుంటే అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు తక్షణ పరిష్కారం పొందొచ్చు.**

**గ్రీన్ టీ:** దీనిలో క్యాటచిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. దీనివల్ల శరీరంలో క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది బెస్ట్ డ్రింక్. రోజుకు రెండు లేదా మూడుకప్పుల గ్రీన్ టీ తాగితే బరువు పెరుగరు.

**అల్లం టీ:**

వాపు, నొప్పిని తగ్గించే గుణాలు అల్లంలో అధికంగా ఉంటాయి. ఇవి ఆర్థరైటిస్‌ను, వాపును నివారిస్తాయి. రెండు కప్పుల వేడినీళ్లలో రెండు అల్లం ముక్కలు వేయండి. కొద్దిగా తేనె, తాజా నిమ్మ రసం కలుపండి. ఆర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్న వారు రోజుకు రెండు కప్పుల చొప్పున వారం పాటు అల్లం టీ తాగితే ఫలితం ఉంటుంది.

**మందార టీ:**

ఇది రక్తపోటును నివారిస్తుంది. మందారలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి. టేబుల్ స్పూను ఎండిన మందార పూల రెక్కలను కప్పు నీటిలో వేసి, 10 నిమిషాల పాటు వేడి చేసి, చల్లారాక తాగండి. రోజుకు రెండు కప్పుల మందార టీ తాగితే రక్తపోటు అదుపులో ఉంటుంది.

**పుదీనా:**

ఇది నొప్పిని తగ్గించే అనలెస్టిక్ మాత్రలాగా పనిచేస్తుంది. పూర్వపు తలనొప్పి, ఆందోళన, ఒత్తిడిలో ఉన్నప్పుడు వచ్చే తలనొప్పిని పుదీనా తగ్గిస్తుంది. ఒక టేబుల్ స్పూను ఎండిన పుదీనా ఆకుల్ని మరిగించిన నీటిలో వేయాలి. పదినిమిషాల తర్వాత ఆ నీటిని తాగితే తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**కలబంద:**

ఇది వాపు, నొప్పిని తగ్గిస్తుంది. కలబంద లోపలి తెల్లని గుజ్జును తీసుకొని కాలిన శరీర భాగాల మీద రుద్దితే నొప్పి తగ్గుతుంది. అలా రోజుకు రెండుసార్లు చేస్తే కాలిన గాయాల బాధ నుంచి ఉపశమనం లభిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది కూడా.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
ఆదివారం 23 ఫిబ్రవరి 2020



సుశీల్, కేటీఆర్, సుజోయ్, అభిషేక్ నామా, నరేష్, మధుర శ్రీధర్‌రెడ్డి

# ‘ప్రెజర్ కుక్కర్’ వాస్తవికతకు అద్దంపట్టింది

‘‘నవ్యమైన కథాంశానికి ఉల్లాసభరితమైన వినోదం, అంతర్లీనంగా చక్కటి సందేశం కలబోసి సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా ‘ప్రెజర్ కుక్కర్’ను తీర్చిదిద్దారు. నటీనటుల అభినయం, సాంకేతిక నిపుణుల పనితీరు అద్భుతంగా ఉంది’ అని అన్నారు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్. సాయిరోనక్, ప్రీతిఅస్రాని జంటగా నటించిన చిత్రం ‘ప్రెజర్ కుక్కర్’. సుజోయ్, సుశీల్ దర్శకులు. సుశీల్‌సుభాస్ కారంపురి, అప్పిరెడ్డి నిర్మాతలు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ చిత్రాన్ని శనివారం హైదరాబాద్‌లోని రామానాయుడు ప్రివ్యూ థియేటర్‌లో కేటీఆర్ ప్రత్యేకంగా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ‘చిత్ర దర్శకుల్లో ఒకరైన సుజోయ్‌తో నాకు పదిహేనేళ్లుగా అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సుజోయ్ క్రియాశీలకంగా పనిచేశాడు. ఆ సమయంలో అతను నిర్వహిస్తున్న బ్లాగ్‌ను బాగా ఫాలో అయ్యేవాడిని. అలా సుజోయ్ రాతలకు అభిమానిగా మారాను. తెలంగాణ సిద్ధించిన తర్వాత నాతో కలిసి పనిచేయమని కోరాను. కానీ ఆయన సినీ దర్శకత్వం వైపు మళ్లాడు. సుజోయ్ బహుముఖప్రజ్ఞాశాలి. చిత్రలేఖనంలో కూడా గొప్ప ప్రతిభాశీలి. ఆయన రచనల్లో సృజనాత్మకత, కవితాభావాలు కనిపిస్తాయి. అతని కూతుళ్లకు కూడా పొయెటిక్‌గా పేర్లు పెట్టుకున్నాడు. ‘ప్రెజర్ కుక్కర్’ చిత్రాన్ని వినోదం, సందేశం మేళవింపుతో అద్భుతంగా తీశారు. చిత్రంలో నాయకానాయికలు చక్కటి నటన కనబరిచారు. డాలర్స్ డ్రీమ్స్‌తో అమెరికా వైపు పరిగెత్తడం, తల్లిదండ్రులు గర్వంగా ఉన్నా మరోవైపు పైకి చెప్పుకోలేక బాధపడటం వంటి అంశాల్ని చాలా సహజంగా వాస్తవికతకు అద్దం పడుతూ ఆవిష్కరించారు. పరిమితమైన వనరుల్లో నాణ్యతతో సినిమా రూపొందించడం అభినందనీయం. సుజోయ్ తదుపరి సినిమాల కోసం ఎనిమిది టైటిల్స్ రిజిస్టర్ చేయించాడని తెలిసింది. అతను భవిష్యత్తులో మరిన్ని గొప్ప సినిమాలు తీయాలని ఆకాంక్షిస్తున్నా. ‘ప్రెజర్ కుక్కర్’ సినిమాను అందరూ చూసి విజయవంతం చేయాలని కోరుతున్నా’ అన్నారు.

# పీరియాడిక్ వార్ డ్రామా?



మహేష్‌బాబు



రాజమౌళి



ప్రభాస్

‘బాహుబలి’ సిరీస్ చిత్రాలతో తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవేదిక మీద ఘనంగా చాటారు అగ్ర దర్శకుడు రాజమౌళి. ఆయన సినిమా అంటే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజమౌళి ప్రస్తుతం ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో ‘ఆర్‌ఆర్‌ఆర్’ సినిమాను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకులముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓ వైపు ‘ఆర్‌ఆర్‌ఆర్’ నిర్మాణంలో ఉండగానే రాజమౌళి తర్వాతి సినిమా గురించి తెలుగు సినీవర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం ‘ఆర్‌ఆర్‌ఆర్’ పూర్తయిన వెంటనే అగ్ర కథానాయకులు ప్రభాస్-మహేష్‌బాబులతో పాన్‌ఇండియా స్థాయిలో భారీ మల్టీస్టారర్‌కు రాజమౌళి శ్రీకారం చుట్టబోతున్నారని తెలుస్తున్నది. రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తానని ‘సరిలేరు నీకెవ్వరు’ ప్రచార సందర్భంలో మహేష్‌బాబు పలు మార్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు అగ్రహీరోలను దృష్టిలో పెట్టుకొని రాజమౌళి స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని సమాచారం. పీరియాడిక్ కథాంశంతో యుద్ధనేపథ్యంలో ఈచిత్రాన్ని రూపొందించబోతున్నారని చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ తెరకెక్కించబోతున్నదని ఫిల్మ్‌నగర్ వర్గాల్లో వినిపిస్తున్నది. అయితే ‘ఆర్‌ఆర్‌ఆర్’ సినిమా పూర్తయిన తర్వాతే రాజమౌళి-ప్రభాస్-మహేష్‌బాబు భారీ మల్టీస్టారర్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు.

# తేజ కొత్త చిత్రాలు



వినూత్న కథా చిత్రాల ద్వారా తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక పంథాను సృష్టించుకున్నారు సీనియర్ దర్శకుడు తేజ. శనివారం ఆయన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా రెండు కొత్త సినిమాలకు సంబంధించిన వివరాల్ని వెల్లడించారు. ఇందులో ఓ చిత్రంలో గోపీచంద్, మరో సినిమాలో రానా కథానాయకులుగా నటించబోతున్నారు. ఈ సినిమాల కోసం ‘రాక్షస రాజు రావణాసురుడు’ ‘అలివేలు మంగ వెంకటరమణ’ అనే రెండు టైటిళ్లను రిజిస్టర్ చేయించారు. వీటికి సంబంధించిన పోస్టర్స్‌ను కూడా విడుదల చేశారు. అయితే ఈ రెండు సినిమాల కథానాయకులు ఎవరనే విషయాల్ని మాత్రం వెల్లడించలేదు. రానా నటించబోయే సినిమా ఏది? గోపీచంద్ చిత్రమేది? అనే విషయాల్ని సస్పెన్స్‌లో ఉంచారు. ఈ సినిమాలకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని త్వరలో ప్రకటించనున్నారు.



తమన్నా

# హృదయం చెప్పిందే వింటా!

మిల్కీబ్యూటీ తమన్నా సినిమాల జోరు పెంచింది. ‘సరిలేరు నీకెవ్వరు’ చిత్రంలో ప్రత్యేకగీతంలో తళుక్కున మెరిసిన ఈ సొగసరి ప్రస్తుతం తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నది. శనివారం ట్విట్టర్ ద్వారా తన అభిమానులతో ముచ్చటించిన ఈ సుందరి పలు ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. చిత్రసీమలోకి ప్రవేశించి పదిహేనేళ్లు పూర్తయ్యాయని, ఈ ప్రయాణం సంతృప్తిగా సాగిపోతున్నదని చెప్పింది. భవిష్యత్తు ప్రణాళికల్ని తాను నమ్మనని, ప్రతిరోజును నిత్యనూతనంగా ఆస్వాదించాలన్నదే తన సిద్ధాంతమని పేర్కొంది. చిత్రసీమలో తనకు కాజల్ అగర్వాల్, సమంత, రకుల్ ప్రీత్‌సింగ్ మంచి ఫ్రెండ్స్ అని..తాము ముగ్గురం కలిస్తే సరదాలకు లోటు ఉండదని చెప్పింది. ప్రతి విషయంలో స్వీయ నిర్ణయాల్ని తీసుకుంటానని, హృదయం చెప్పిన మాటే వింటానంది. అపజయాలకు తాను క్రుంగిపోనని, మనం చేసుకునే ఎంపికల్ని మరోసారి పునఃపరిశీలన చేసుకోవడానికి ఫెయిల్యూర్స్ ఉపకరిస్తాయని చెప్పుకొచ్చింది.



రక్షిత్, నక్షత్ర

# పలాసలో ఏం జరిగింది?

రక్షిత్, నక్షత్ర జంటగా నటిస్తున్న చిత్రం ‘పలాస 1978’. కరుణకుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. మార్చి 6న ప్రేక్షకులముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘1978 ప్రాంతంలో పలాసలో జరిగిన యథార్థ సంఘటనల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించాం. సెన్సార్ బోర్డ్ ఎక్కువ కట్స్ సూచించడంతో రివైజ్ కమిటీకి వెళ్లాం. వారు సినిమాను చూసి ప్రశంసించారు. ప్రివ్యూ చూసిన చాలా మంది బాగుందని అంటున్నారు. 1978ల నాటి కాలమాన పరిస్థితుల్ని ప్రతిబింబిస్తూ వాస్తవికత ప్రధానంగా సాగే చిత్రమిది. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం’ అన్నారు. రఘు కుంచె, తిరువీర్, జనార్ధన్, లక్ష్మణ్, శృతి, జగదీష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అరుల్ విన్సెంట్, సంగీతం: రఘు కుంచె, సమర్పణ: తమ్మారెడ్డి భరద్వాజ, రచన-దర్శకత్వం: కరుణ కుమార్.



కాసర్ల శ్యామ్, రూపేష్‌కుమార్, ప్రభాస్, శివకుమార్

# మార్ మార్ కే జీనా హై..

రూపేష్ కుమార్ చౌదరి, సలోని మిశ్రా జంటగా నటిస్తున్న చిత్రం ‘22’. శివకుమార్ బి దర్శకుడు. మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై సుశీలా దేవి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాసర్లశ్యామ్ రచించిన ‘మార్ మార్ కే జీనా హై..బార్ బార్ యహ మర్నాహై’ లిరికల్ వీడియోను శనివారం అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ఈ వీడియోసాంగ్, టీజర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. బీఏ రాజుగారితో నాకు ఎప్పటినుంచో సాన్నిహిత్యం ఉంది. రూపేష్ పోలీస్‌గెటప్‌లో బాగున్నాడు. దర్శకుడిగా శివకుమార్ విజయం సాధించాలని, సినిమా అందరి ఆదరణ పొందాలని కోరుకుంటున్నాను’ అన్నారు. ‘ఈ సినిమా కథ గురించి ప్రభాస్ అడిగి తెలుసుకున్నారు. కథలో నవ్యత ఉంది.. తప్పకుండా సక్సెస్ అవుతుందని చెప్పారు. యాక్షన్ థ్రిల్లర్ కథాంశమిది. తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిస్తుంది’ అని దర్శకుడు తెలిపారు. రూపేష్‌కుమార్‌చౌదరి మాట్లాడుతూ ‘నా తొలి సినిమా పాటను ప్రభాస్‌గారు ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఆనందాన్ని పంచుకోవడానికి మాటలు సరిపోవడం లేదు. నేను పోలీస్‌డ్రెస్‌లో బాగున్నానని ఆయన చెప్పడం గొప్ప అవార్డులా భావిస్తున్నా’ అన్నారు. ‘22’ టీమ్ తరపున ప్రభాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని బీఏ రాజు తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ ‘టాకీ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం’ అన్నారు. విక్రమ్ జీత్ విర్క్, దేవిప్రసాద్, జయప్రకాష్, రవివర్మ, శశిధర్ కోసూరి, ఫిదా శరణ్య, రాజశ్రీనాయర్, పూజా రామచంద్రన్ తదితరులు చిత్ర తారాగణం.



ప్రియ, రాజేంద్రప్రసాద్, రాహుల్ విజయ్

# సందేశంతో ‘కాలేజ్ కుమార్’

రాహుల్ విజయ్, ప్రియ వడ్లమాని జంటగా నటిస్తున్న చిత్రం ‘కాలేజ్ కుమార్’. ఎమ్ ఆర్ పిక్చర్స్ పతాకంపై లక్ష్మణ్ గౌడ సమర్పణలో ఎల్.పద్మనాభ నిర్మిస్తున్నారు. హరి సంతోష్ దర్శకుడు. రాజేంద్రప్రసాద్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సీనియర్ నటుడు సాయికుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ‘ప్రతి తండ్రికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఇందులో నేను మంచి పాత్ర చేయాల్సింది కానీ కుదరలేదు. ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ చిత్రం అందరికి నచ్చుతుంది’ అన్నారు. ‘కన్నడంలో మంచి విజయం సాధించిన ఈ చిత్రాన్ని తెలుగు రీమేక్ చేయడం ఆనందంగా ఉంది. ఇందులో నేను మంచి పాత్రలో నటించాను. వినోదం, సెంటిమెంట్, ప్రేమ..ఇలా అన్ని అంశాల కలబోతగా సందేశాత్మకంగా సాగుతుంది. రొటీన్ సినిమాలకు భిన్నంగా ఆకట్టుకుంటుంది’ అని రాజేంద్రప్రసాద్ చెప్పారు. నేటి తరానికి నచ్చే వినూత్నమైన కథ ఇదని హీరో రాహుల్ విజయ్ తెలిపారు. ‘మార్చి 6న సినిమాను విడుదల చేయబోతున్నాం. యువతతో పాటు కుటుంబప్రేక్షకుల్ని మెప్పించే కథ ఇది. తప్పకుండా కొత్తదనంతో అలరిస్తుంది’ అని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గురుప్రశాంత్ రాజ్, సంగీతం: కుతుబ్ ఇ క్రిప, సంభాషణలు: సందీప్‌రాజ్, దర్శకత్వం: హరీ సంతోష్.






నమస్తే తెలంగాణ

# చింతన

[ కరీంనగర్ ]

ఆదివారం 23 ఫిబ్రవరి 2020

## పర్వదినాలు

- శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు: రథోత్సవం, ద్వాపర యుగాది, దర్శ అమావాస్య, శ్రీశైలం బ్రహ్మోత్సవాలు: మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం (నేడు)
- శ్రీశైలం బ్రహ్మోత్సవాలు: అశ్వవాహనం, పుష్పోత్సవం, శయనోత్సవం, కీసర బ్రహ్మోత్సవాలు ముగింపు (24వ తేది)
- యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం (26వ తేది)
- అహోబిలం నృసింహస్వామి బ్రహోత్సవాలు ప్రారంభం (28వ తేది)
- స్కందషష్ఠి (29వ తేది)

## నమో నమామి



### అద్భుతదేవుడు నారసింహుడు

అద్వైతన్నరహరి రూపమద్భుతం
తే దృష్టం న: శరణద సర్వలోక శర్మ
సోయం తే విధికర ఈశ విప్రశాపాత్త స్యేదం
నిధనమనుగ్రహాయ విద్మ: || 58 ||

**- శ్రీ మద్భాగవతం, సప్తమ స్కంధం**

**సమస్త** లోకాలకూ సుఖాలను ప్రసాదించే ఓ దేవదేవా! అద్భుతమైన నీ నరహరి రూపంతో అసురుణ్ణి సంహరించినావు. ఆ అనితర సాధ్యమైన దృశ్యాన్ని మేము మా కండ్లారా చూసి తరించాము. ఇంతటి ఘన కార్యాన్ని మేమెప్పుడూ చూడలేదు. ఈ రాక్షసాధినేత ఓ బ్రాహ్మణుని శాప ప్రభావంతోనే ఇలాంటి అసురబుద్ధి గలవాడైనాడు. హిరణ్యకశిపునికి నీ వల్ల సంభవించిన ఈ మరణంతో శాపవిముక్తి లభించింది.

## మంచిమాట



ఒక చెట్టులా ఉండండి. తన కాండాన్ని గొడ్డలితో నరికే వారికి సైతం అది నీడనిస్తుంది.


**- చైతన్య మహాప్రభు**

జయంతి: 18 ఫిబ్రవరి,
వర్ధంతి: 14 జూన్
జీవితకాలం: క్రీ.శ. 1486–1534

## ప్రత్యేకవ్యాసం

# సంకీర్తన ఉద్యమ ప్రేమమూర్తి!

**లక్షలాది చంద్రులనుండి వెలువడే వెన్నెలకన్నా కమ్మనైనవి నిత్యానంద ప్రభువుల కోమల పాదపద్మాలు. ఇంతటి విశిష్టమైన నిత్యానంద ప్రభువు ప్రార్థనలో అనిర్వచనీయమైన ఆనందం ఉంటుంది. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. ఇటీవలె 'నిత్యానంద త్రయోదశి'ని జరుపుకొన్న సందర్భంగా స్వామి దివ్యగాథను తెలుసుకొని తరించవలసిందిగా విన్నపం. హరేకృష్ణ!**



## నిత్యానంద ప్రభువు దివ్యకథ

**నిత్యానంద** ప్రభువుల ఆవిర్భావ దినోత్సవాన్ని 'నిత్యానంద త్రయోదశి' పండుగగా జరుపుకుంటాం. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు నవద్వీపంలో శ్రీచైతన్య మహాప్రభువుగా ఉద్భవించి, కలియుగ ధర్మమైన 'సంకీర్తన ఉద్యమాన్ని' స్థాపించారు. కలహాలకు నిలయమైన కలియుగంలో సంకీర్తన మాత్రమే శాంతిని, సామరస్యాన్ని పెంపొందిస్తుంది. దేవాదిదేవుని లక్ష్యాన్ని నెరవేర్చడంలో సహాయానికి బలరాముడే నిత్యానంద ప్రభువుగా అవతరించారు. నిత్యానంద ప్రభువు క్రీ.శ.1474 మాఘశుక్ల త్రయోదశి రోజున ఏకచక్రలో జన్మించారు. చిన్నతనంలో వీరిని 'నితై' అని పిలిచేవారు. వారి స్నేహితులతో కలిసి ఆయన శ్రీకృష్ణుని లీలలను అనుకరించే వారు. ఏకచక్రవాసులందరూ 'నితై' చేష్టలకు మంత్రముగ్ధులయ్యేవారు. ఎల్లప్పుడు శ్రీకృష్ణ రసభావంలో ఉండడం వల్ల, గ్రామస్థులందరూ 'నితై' శ్రీకృష్ణుని అవతారమేనని భావించేవారు. ఇంత చిన్నతనంలో శ్రీకృష్ణుని వివిధ లీలలు వారికి ఎలా తెలిశాయని గ్రామస్థులు నివ్వెరపోయేవారు.

ఒకసారి 'నితై' స్నేహితుడు ఒకరు అక్రూరుడిగా వేషం వేసుకొని, కంసుడి ఆజ్ఞమేరకు కృష్ణబలరాములను బృందావనం నుండి తీసుకెళుతున్న సన్నివేషాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రియతమ శ్రీకృష్ణుడు తమను విడిచి వెళ్లిపోతున్నాడన్న గోపికల విరహ వేదనను జ్ఞప్తికి తెచ్చుకొని, 'నితై' నిజంగానే తీవ్ర దుఃఖానికి లోనయ్యాడు. గ్రామస్థులు విస్తుపోయారు.

నితై అలా శ్రీకృష్ణున్ని, బలరామున్ని ఇంకా వామనున్ని అనుకరిస్తూ అనేక లీలలను ప్రదర్శించాడు. ఎవరైనా ప్రశ్నిస్తే 'అవన్నీ నా దైవలీలలు, మీరు చూసి తరించండి' అనికూడా అనేవారు. వారు చేసిన పాత్రలలోకెల్లా మిక్కిలి హర్షనీయమైన పాత్ర లక్ష్మణుడు. ఇలా 12 సంవత్సరాలు వివిధ లీలలతో గ్రామస్థులను వారు ఆనంద పరిచారు.

### 12 ఏండ్ల వయసులోనే తీర్థయాత్రలు

నిత్యానంద మహాప్రభువు 12 ఏండ్ల వయసులో ఉండగా, వాళ్ళ ఇంటికి ఒక సన్యాసి వచ్చాడు. 'తనకు సపర్యలు, సేవలు చేయడానికి ఒక సేవకుడు కావాలని, దానికి నిత్యానంద ప్రభువు సరైనవాడని' అభ్యర్థించాడు. దాంతో ఆ సన్యాసితో 20 సంవత్సరాలు వివిధ తీర్థయాత్రలకు వెళ్లారు. నిరంతరంగా ప్రయాణిస్తూ పుణ్యధామాలలో తన్మయుడై అవధూత లక్షణాలను ఆయన వ్యక్తపరిచేవారు. వారి కార్యకలాపాలు, ప్రవర్తనారీతులు అనూహ్యంగా, ఆకర్షణీయంగా మారాయి. వారు అలా ప్రవర్తించడానికి కారణమేమిటో ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు. ఉదాహరణకు ఒక వస్త్రాన్ని వారి తలకు కాకుండా నడుముకి కట్టినట్లయితే, వారు ఆనంద పారవశ్యం చెంది నృత్యం చేసేవారు.

కొద్దికాలం తర్వాత నిత్యానంద ప్రభువు బృందావనం చేరుకున్నారు. అక్కడ ఆయన ఆనందం లక్ష రెట్లయింది. శ్రీకృష్ణుడు లీలలు చేసిన ప్రదేశాలు చూసి ఆనందంతో పిచ్చివాని వలె నృత్యం, గానం చేయడం ప్రారంభించారు. 'ఎక్కడ నా కృష్ణుడు? ఎక్కడ నా శ్వాస? ఎక్కడ నా ప్రాణం?' అని రోదించారు. కళ్ళు కుండపోత వర్షం వలె ఆనందభాష్పాలతో నిండిపోయాయి. తర్వాత శ్రీచైతన్య మహాప్రభువు వారి లీలల్లో పాల్గొనేందుకు నవద్వీపం పయనమయ్యారు.

### గృహస్థ జీవనం, అంత్యలీలలు:

బెంగాల్‌కు వచ్చిన తర్వాత చైతన్య మహాప్రభువు ఆజ్ఞను అనుసరించి నిత్యానంద ప్రభువు అవధూత హోదాను విడిచి పెట్టి గృహస్థాశ్రమాన్ని స్వీకరిస్తారు. సూర్యదాస సరఖేల్ కుమార్తెలైన జాహ్నవి, వసుధలను వివాహమాడారు. 'కవికర్ణపుర'లో తెలిపిన విధంగా వీరిరువురు బలరాముని భార్యలైన రేవతీదేవి, వరుణీదేవిల అవతారాలు. కొన్నాళ్లకు వరుణీదేవీ గర్భంలో వీరభద్ర, గంగాదేవిలు జన్మిస్తారు. వీరభద్రుడు గొప్ప వైష్ణవ నాయకుడై వాళ్ళ తండ్రివలె చైతన్య మహాప్రభువు లీలలను విస్తృతంగా ప్రచారం చేశారు. వీరు జన్మించిన కొద్దికాలానికి వసుధదేవి శరీరాన్ని చాలించడంతో, జాహ్నవిదేవి వాళ్ళను తన స్వంతబిడ్డలుగా పెంచుతుంది. కొద్దికాలం తర్వాత జాహ్నవిదేవి, వీరభద్రునితో పాటు చాలా పురుషులు, స్త్రీలకు దీక్షలను ప్రసాదించి ఉత్తమ వైష్ణవులుగా తీర్చిదిద్దారు. నరోత్తమదాస ఠాకూరు, శ్రీనివాస ఆచార్య, శ్యామానంద ప్రభువులు జాహ్నవిదేవిని అత్యంత ప్రముఖ వైష్ణవురాలిగా అంగీకరించారు.

### మహాప్రభువు ప్రేమస్వరూపులు

ఏకచక్రంలో ఉన్న బంకిమ రాయమందిరంలోని బంకిమ రాయ విగ్రహంలో నిత్యానంద ప్రభువు ఐక్యమై వారిలీలలను చాలించారని పూజారులు చెబుతారు. ఈ విగ్రహానికి కుడివైపున జాహ్నవిదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహాల్ని మనం దర్శించవచ్చు. నిత్యానంద ప్రభువు వారి ఉనికిని మనం ఎల్లప్పుడూ మన గురువులో చూడవచ్చు. గురువు సాక్షాత్తు నిత్యానంద మహాప్రభువు ప్రేమస్వరూపం. శిష్యులు భగవంతునికి సేవ చేయాలన్నా, ఆ సేవలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలన్నా నిత్యానంద ప్రభువుల కటాక్షం తప్పనిసరి.




**శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ**
ప్రాంతీయ అధ్యక్షులు, హరేకృష్ణ మూవ్‌మెంట్,
అక్షయ పాత్ర ఫౌండేషన్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)
అధ్యక్షులు, హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్, హైదరాబాద్

### బలరాముని అవతారం

మహారాష్ట్రలోని పండరీపూర్ వద్ద నిత్యానంద ప్రభువు లక్ష్మీపతి తీర్థను కలిశారు. లక్ష్మీపతి తీర్థకు తరచుగా వారి కలలో బలరాముడు దర్శనమిచ్చేవారు. యువకుడైన నిత్యానంద మహాప్రభువును చూసిన తర్వాత, 'అతనే బలరాముడని' వారికి అర్థమైంది. వారిరువురు, ఒకరిపై మరొకరు గాఢమైన ప్రేమబంధాన్ని పెంపొందించుకున్నారు. అప్పుడే నిత్యానంద మహాప్రభువుకు లక్ష్మీపతి తీర్థ బ్రహ్మచారి దీక్షను ఇచ్చి 'స్వరూప' నామధేయం చేశారని కొందరు చెబుతారు. లక్ష్మీపతి తీర్థకు ప్రీతిపాత్రుడైన శిష్యుడు మాధవేంద్ర పురి. 'జీవునికి, కృష్ణునికి మధ్య ఉన్న అతిసుందరమైన తీయటి సంబంధాన్ని వెలువరించడంతో శ్రీకృష్ణచైతన్య మహాప్రభువు వాటిని వారి బోధనల్లో అంతర్భాగంగా చేసుకున్నారు. అంతే కాకుండా శ్రీమతి రాధారాణి ప్రముఖస్థానాన్ని స్పష్టంగా సమాజానికి తెలియజేశారు. వయసులో పెద్దవారు కావడం వల్ల నిత్యానంద మహాప్రభువు మాధవేంద్రపురిని గురువుగా భావించేవారు.

### జగై-మదైలకు ప్రాణభిక్ష



శ్రీచైతన్య మహాప్రభువు, నిత్యానంద ప్రభువు హరిదాస్ ఠాకూర్లవారిని ఇంటింటికి వెళ్లి శ్రీకృష్ణుని గాథలను తెలియజేయమని ఆజ్ఞాపించారు. అలా వెళ్తున్నప్పుడు ఒకసారి ఇద్దరు అన్నదమ్ములైన జగై, మదైలను కలుస్తారు. అప్పుడు వాళ్ళు తప్పతాగి ఆ గ్రామంలో భయాందోళనలను సృష్టిస్తుంటారు. కరుణామయుడైన నిత్యానంద ప్రభువు వాళ్ళను కృష్ణనామంతో, బోధనలతో ఉద్ధరించి భక్తిమార్గం వైపుకు మళ్లిస్తే శ్రీచైతన్య మహాప్రభువు ఉద్యమం మరింత కీర్తిని సంపాదించి విస్తృతమౌతుందని తలుస్తారు. వాళ్ళ దగ్గరకి వెళ్లి కృష్ణనామాన్ని జపించి, దానిలోని మాధుర్యాన్ని ఆస్వాదించ వలసిందిగా కోరుతారు. కానీ, వారు ఆ మాట వినక, నిత్యానంద ప్రభువును అసభ్యకరమైన పదాలతో దూషించడంతో పాటు రోడ్డుపైన వెంబడిస్తారు. ఇంతలో మదై పగిలిన మట్టికుండను నిత్యానంద ప్రభువు పైకి విసురుతాడు. అది బలంగా నిత్యానంద ప్రభువు తలకు తగిలి రక్తస్రావం అవుతుంది. ఈ విషయం తెలుసుకున్న చైతన్య మహాప్రభువు మండిపడి ఆ ప్రదేశానికి పరిగెడుతారు. 'నితై' లాంటి సున్నిత మనస్కులను బాధించే వారెవరు? భగవంతుని కోపం ఎలా ఉంటుందో చూపేందుకు, చైతన్య మహాప్రభువు ప్రకాశవంతంగా రగులుతున్న సుదర్శన చక్రంతో ఇద్దరిని చంపబోతారు. దాంతో నిత్యానంద వారిని నిలువరిస్తారు. 'కలియుగంలోఅందరూ జగై, మదై లాంటి పతితులే. అలాంటి వాళ్ళని ప్రేమతోనే ఉద్ధరించడం మన ఉద్యమలక్ష్యం కదా' అని చైతన్య మహాప్రభువుకు మొర పెట్టుకొంటారు. చైతన్య మహాప్రభువు శాంతించి, సుదర్శనాన్ని విరమిస్తారు. ఇదీ చైతన్య మహాప్రభువు, నిత్యానంద ప్రభువుల ప్రేమబంధం. జ్ఞానోదయం కలిగిన వారిద్దరూ చైతన్య మహాప్రభువు ఉద్యమంలో చేరతారు. అలా వారు భక్తిమార్గాన్ని ఆచరించి, ప్రతీ దినం లక్షమార్లు భగవంతుని పవిత్రనామం జపించి ఉత్తమభక్తులుగా మారతారు.

## ఇలా చేద్దాం

### స్కందోపాసనతో అరుదైన ఫలితాలు



**ఆరు తలలు,** పన్నెండు చేతులతో జాజ్వల్యమానంగా వెలుగొందే స్కందదేవుని (కుమారస్వామి) ఆరాధన, ఉపాసనలతో అరుదైన ఫలితాలు లభిస్తాయని వైదిక విజ్ఞానులు అంటున్నారు. స్కందుడు మన శరీరంలోని 'కుండలినీ శక్తి'కి అధిదేవుడు. రాక్షసరాజు, మహాభయంకరుడైన తారకాసురుని వధించే వేళ తాను సర్పరూపం దాలుస్తాడు. ధ్యానసాధకులకు తమలోని'సర్పశక్తి'ని ప్రాణాయామంతో జాగృత పరచడానికి షణ్ముఖుడు సహాయపడతాడనీ అంటారు. 'మార్గశిర శుక్ల షష్ఠి'నే 'స్కందషష్ఠి'గా జరుపుకొంటాం. ఆ రోజు జరిగే 'వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి' కళ్యాణం సమస్త మానవాళికి కన్నుల పండుగ. స్కందుని అనుగ్రహం వల్ల ఆయురారోగ్యాలతోపాటు ఐశ్వర్యమూ సిద్ధిస్తుందని వారంటారు.

## వేదవిజ్ఞానం



### మూడు లోకాలు


**హైందవ** కాలనిర్ణయం ప్రకారం 'మన్వంతరం' (నాలుగు యుగకాలాల మొత్తానికి 71 రెట్లు అధికం)లోని సత్యయుగం అత్యంత విలక్షణమైంది. ఈ యుగారంభంలో బ్రహ్మదేవుడు ప్రాణికోటిని సృష్టించిన తర్వాత మానవాళికి మహోత్కృష్టమైన జ్ఞానసంపదను, జీవన పరమార్థాన్ని అందించే ఉద్దేశ్యంతో తన నాలుగు ముఖాలనుంచి 4 వేదాలను సృష్టించినట్టు ఆధ్యాత్మికవేత్తలు చెప్తారు. అవి: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం. అప్పుడేం జరిగింది? ఆనాడు రాక్షసజాతి (దుష్టజీవులు) అంటూ ఒకటి ఉంది కనుక, వాళ్లు చూస్తూ ఊరుకోరు కదా. వెంటనే, ఆ వేద సంపదను హయగ్రీవుడు (సోమకాసురుడు) అనే రాక్షసుడు తస్కరించి, సముద్రగర్భంలోకి వెళ్లి దాక్కున్నాడని, దాంతో వాటిని సంరక్షించి, మానవాళికి అందించే లక్ష్యంతోనే విష్ణువు తన తొలి పుట్టుకైన 'మత్స్యావతారం' దాల్చాడన్నది కథనం. ఐతే, సృష్టిలో అప్పుడున్నవి కేవలం మూడే లోకాలు. మర్త్య (భూమి), స్వర్గ, పాతాళాలు. భూమిమీదే మానవులతోపాటు రాక్షసులూ నివసించే వారు. మరి, ఇప్పుడు ఆనాటి రాక్షసజాతి ఏమైంది? మొత్తం అంతరించిందా? అంటే, 'మానవ రూపంలోనే ఆ దుష్టత్వం ఉనికిలో ఉన్నట్టు' కొందరు పేర్కొంటారు.

### 32 అడుగుల ఎత్తయిన మానవులు!



**'స్వర్ణయుగం'గా** అభివర్ణించే తొలి ఒక్క యుగకాల పరిమితే మిగతా (మూడు) యుగాల కంటే అత్యధికం. భారతీయ పౌరాణిక విజ్ఞానం ప్రకారం సత్యయుగ కాలం 17,28,000 సంవత్సరాలు కాగా, త్రేతాయుగం 12,96,000, ద్వాపరం 8,64,000, ఆఖరుదైన (ప్రస్తుత) కలియుగం 4,32,000 సంవత్సరాలు. ఇప్పటికి కలియుగం మొదలై 5,119 సంవత్సరాలు పూర్తవగా, 5,120వ సంవత్సరం నడుస్తున్నదని తెలుగు పంచాంగకర్తల అంచనా. సత్యయుగంలోనే గోమాత రూపంలోని 'ధర్మదేవత' నాలుగు పాదాల సంచరించిందన్నది కథనం. ఈ యుగంలో మానవులు దాదాపు 32 అడుగుల ఎత్తుతో, సుమారు 1,00,000 ఏళ్ల సగటు ఆయుర్దాయంతో జీవించినట్టు చెప్తారు. తర్వాత త్రేతాయుగంలో సగటు ఆయుర్దాయం 10,000 సంవత్సరాలు కాగా, ద్వాపరం నాటికి అది వెయ్యేళ్లకు పడిపోయింది. ద్వాపరయుగం చివర్లో జన్మించిన శ్రీకృష్ణుడు నివసించిన కాలంలో అంటే, సుమారు కలియుగం వచ్చేసరికి మనుషుల సగటు ఎత్తు పదడుగులకు, ఆయుర్దాయం 100 ఏళ్లకు తగ్గిపోయిందని హైందవ మతగ్రంథాలు చెబుతున్నాయి. గడచిన సుమారు 5,120 సంవత్సరాలలో మనిషి ఆయుర్దాయం, సగటు ఎత్తులు మరింత తగ్గిపోయాయన్నది స్పష్టం.

## జీవనవేదం



### రాజధర్మం!

రాజు నాలుగు వేదాలనూ అధ్యయనం చేయగలగాలి. అటువంటి ప్రభువు ప్రజలకు నిజమైన తండ్రి సమానుడు. ఉన్నత వ్యక్తిత్వంతో గుడ్డి వ్యవస్థలను చక్కదిద్దడమేగాక, అన్యాయాలనూ కూకటివేళ్లతో తొలగిస్తాడు. పరాక్రమం, సత్యశీలత, ఉన్నతస్థాయి జ్ఞానంతో విరాజిల్లుతాడు. పరమేశ్వరుని కరుణా కటాక్షాలతో ప్రజలను కన్నబిడ్డలవలె పాలిస్తాడు.

**- యుజుర్వేదం**

## మహామహులు

# ధర్మ పితామహుడు!

మానవాళికి సకలధర్మాలనూ ప్రబోధించిన భీష్మపితామహుని ధర్మనిష్ఠను, భక్తి తత్పరతను, వీరత్వాన్ని తెలిపే చిన్న ప్రస్తావన.

**భారతీయ** ధార్మిక సాహిత్యంలో భీష్ముడంతటి ధన్యజీవి మరొకరు లేరు. ధర్మరాజుకే ధర్మసూత్రాలు బోధించిన మహాపురుషుడు. అంపశయ్యపై సుమారు 58 రోజులు గడిపి, తాను కోరుకొన్నట్లుగా, ఉత్తరాయణ పుణ్యకాలంలో అత్యంత పుణ్యదినమైన రథసప్తమి మర్నాటి అష్టమి నాటివేళ తనువు చాలించిన గొప్ప పుణ్యాత్ముడు. ఆ రోజు (మాఘశుద్ధ అష్టమి)ను మహాపర్వదినంగా జరుపుకోవాలని పురాణశాస్త్రాలు నిర్ణయించాయి. భీష్మాష్టమినాడే భీష్మాచార్యునికి ప్రతీ ఒక్కరూ తర్పణాలు వదలడాన్ని అత్యంత పుణ్యకార్యంగానూ వేదవిజ్ఞానులు విశ్వసిస్తారు.

భీష్ముని పేరు చెబితేనే అనేకమంది భక్తి సాధకులకు తనువులు పులకరిస్తాయి. సమస్త మానవజాతికి మహోన్నతమైన విష్ణుభక్తి స్తోత్రాలను అందించిన ఘనుడాయన. భీష్ముడు ఎంత పరిపూర్ణుడంటే, ఆయనలో కనిపించినంత త్యాగం, సత్యనిష్ఠ, ధర్మచింతన, విష్ణుభక్తి మరెవరిలోనూ కానరావు. పితృవాక్పాలనను జవదాటక, అవ్యాజమైన ప్రేమను చూపించిన శ్రీరామచంద్రమూర్తిని గుర్తుచేసేంత మహానిష్ఠ భీష్మునిది. తండ్రి సుఖం కోసం ఏకంగా ఆజన్మాంతం భీష్ముడు బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. అదే తండ్రి ఆయనకు 'స్వచ్ఛంద మరణాన్ని' వరంగా ప్రసాదించడం గమనార్హం. తాను చేసిన భీషణ ప్రతిజ్ఞకు కట్టుబడి, రాజ్యపాలనాధికారాన్నీ త్యజించాడు. పదకొండు వేలమంది సైన్యం ఒక్కసారే తలపడినా, వారినందరినీ మట్టి కరిపించగల మహావీరునిగానూ భీష్ముడిని మహాభారతం అభివర్ణించింది.

సత్యాన్ని, ధర్మాన్ని భీష్ముడు తలకెత్తుకున్న తీరు అసాధారణం. సత్యమే భారతీయ సనాతన ధర్మానికి మూలం. దీనితో ధర్మం విడదీయరాని బంధాన్ని కలిగి ఉంటుందని భీష్ముడు అంపశయ్య పైనుంచి ధర్మరాజుకు ఉద్బోధించాడు. కాబట్టి, సత్యం లేకుండా ధర్మం ఉండరాదు. సత్యం, ధర్మం రెండూ పరస్పరం సమాన, సమున్నతమైనవి. ధర్మాధర్మ విచక్షణలో భీష్ముడిని మించిన వారు లేరని వేదవిజ్ఞానులు చెప్తారు. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మనే



ఆయనను మూర్తీభవించిన ధర్మమూర్తిగా అభివర్ణించడం గమనార్హం. భక్తిలోనూ భీష్ముడు అనితరసాధ్యుడే. కురుక్షేత్ర రణరంగంలోనే అస్త్రసన్యాసం చేసిన అర్జునునికి శ్రీ కృష్ణుడు ఒకవైపు 'భగవద్గీత'ను ప్రబోధిస్తూనే, మరోవైపు అంపశయ్య పైనుంచే భీష్మునితో అసాధారణ విష్ణుభక్తిని ప్రదర్శింపజేశాడు. భీష్మస్తవ రాజాన్ని, సహస్రనామ స్తోత్రాలను లోకానికి అందించిన ధన్యజీవి భీష్ముడు.

మాఘశుద్ధ చతుర్థినుంచి అష్టమివరకు అయిదు రోజులు, మళ్లీ అదే అష్టమినుంచి ద్వాదశి వరకు మరొక అయిదు రోజులూ (మొత్తం 10 రోజులు) విడివిడిగా 'భీష్మ పంచకం'గానే వ్యవహరిస్తారు. తొలి అయిదు రోజులపాటు భీష్ముడు రోజుకో ప్రాణం చొప్పున తన పంచప్రాణాలను వదిలినట్లు కొందరు భావిస్తారు. భీష్మాష్టమి విశేషాలు తెలుసుకోవాలంటే 'పద్మ పురాణం'లోని 'హేమాద్రి వ్రత ఖండం' చదవాలి. ఆ అష్టమినాటి పట్టపగలు అమృత ఘడియలు వచ్చేవరకు భీష్ముడు ప్రాణాలు వదలకుండా వేచిచూడడం అసాధారణం. ఏకాదశి నాడు పూర్తి ఉపవాసంతో తర్పణాలు వదలాలని పండితులు చెప్తారు. ఆ మాటకొస్తే, అష్టమినాడు, ఇంకా మిగిలిన పది దినాలలోనూ ఏ రోజైనా విధిగా తర్పణాలు వదలవచ్చునని కూడా అంటారు. ఈ ఏకాదశినే 'భీష్మ ఏకాదశి' (జయ ఏకాదశి) గానూ పిలుస్తారు. ఈ పవిత్రదినాలలో విష్ణుసహస్ర నామ స్తోత్రంతోపాటు భీష్మస్తవాన్ని పఠించడం అత్యంత పుణ్యప్రదమని వేదవిజ్ఞానులు అంటారు.

**సావధానశర్మ**

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**నాగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీఎన్)లో నాన్ టీచింగ్, టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

## అప్రెంటిస్

**మధ్యప్రదేశ్ ప్రధానకేంద్రంగా ఉన్న వెస్ట్ సెంట్రల్ రైల్వే (డబ్ల్యూసీఆర్)లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

West Central Railway

- ట్రేడ్ అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 570
- **ట్రేడ్‌లు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వైర్‌మెన్, వెల్డర్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయస్సు:** ఫిబ్రవరి 3 నాటికి 15–24 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్ ద్వారా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మొదట నేషనల్ అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలి.
- **చివరితేదీ:** మార్చి 15 వరకు.
- **వెబ్‌సైట్:** https://wcr.indianrailways.gov.in

## ఐఐఐటీలో



- **మొత్తం ఖాళీలు:** 6
- **పోస్టులవారీగా ఖాళీలు:** జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ ఇంజినీర్, ల్యాబొరేటరీ అసిస్టెంట్.
- **అర్హతలు:** డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- **పోస్టు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **మొత్తం ఖాళీలు:** 11
- **విభాగాలు:** సీఎస్ఈ, ఈసీఈ, మ్యాథ్స్, హ్యుమానిటీస్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 11
- **వెబ్‌సైట్:** https://iiitn.ac.in

## ఈసెట్ - 2020

**ఈసెట్ ప్రకటనను హైదరబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) విడుదల చేసింది.**

- **పరీక్ష పేరు:** తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ ఈసెట్) – 2020
- **ప్రవేశాలు కల్పించనున్న కోర్సులు:** ఇంజినీరింగ్, ఫార్మసీలలో డిగ్రీ.
- **అర్హత:** డిప్లొమా & బీఎస్సీ (మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఈసెట్ ర్యాంకు ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 24 నుంచి
- **చివరితేదీ:** మార్చి 28
- **పరీక్షతేదీ:** మే 2
- **వెబ్‌సైట్:** https://ecet.tsche.ac.in

## హెచ్‌ఎంటీలో

**బెంగళూరులోని హెచ్‌ఎంటీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

HMT Machine Tools Limited

- **మొత్తం ఖాళీలు:** 12
- **పోస్టులు:** జీఎం (హెచ్ఆర్, ఫైనాన్స్), డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్), ఆఫీసర్(లైజన్), జాయింట్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్), మేనేజర్, ఆఫీసర్(లీగల్), డిప్యూటీ ఇంజినీర్,
- **అర్హతలు:** ఇంజినీరింగ్ డిగ్రీ, సీఏ/ సీఎంఏ/ ఐసీడబ్ల్యూఏ, పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఎల్ఎల్‌బీ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 10
- **వెబ్‌సైట్:** http://www.hmtindia.com

# కివీస్‌దే పైచేయి



## తొలి ఇన్నింగ్స్‌లో 216/5 ◆ రాణించిన విలియమ్సన్, రాస్ టేలర్
## ఇషాంత్‌కు మూడు వికెట్లు ◆ భారత్ తొలి ఇన్నింగ్స్ 165 ఆలౌట్

**ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఎదురులేకుండా దూసుకెళ్తున్న టీమ్ఇండియా.. అసలు సిసలు పోరులో తేలిపోయింది. పేస్‌కు సహకరిస్తున్న పచ్చిక పిచ్‌పై న్యూజిలాండ్ బౌలర్లను ఎదుర్కోలేక బ్యాట్స్‌మెన్ మూకుమ్మడిగా చేతులెత్తేయడంతో స్వల్ప స్కోరుకే పరిమితమైంది. కివీస్ బౌలర్లు నిప్పులు చెరిగిన చోట.. మన పేసర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోవడం మరింత ఆందోళనకు గురిచేసింది. కోహ్లీ, పుజారా లాంటి అత్యుత్తమ ఆటగాళ్లు క్రీజులో నిలువలేకపోయిన చోట విలియమ్సన్ చక్కటి ఇన్నింగ్స్‌తో విలువ చాటుకున్నాడు. వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ తన అనుభవాన్నంతా రంగరించి మూడు వికెట్లు పడగొట్టడంతో.. టీమ్ఇండియా పోటీలో నిలిచింది.**


**వెల్లింగ్టన్:** భారత బ్యాట్స్‌మెన్ తడబడ్డ చోట న్యూజిలాండ్ ఆటగాళ్లు అదరగొట్టారు. హేమాహేమీలైన మనవాళ్లు పరుగులు చేసేందుకు ప్రయాసపడ్డ పిచ్‌పై.. ఆతిథ్య జట్టు ప్లేయర్లు అదుర్స్ అనిపించారు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (153 బంతుల్లో 89; 11 ఫోర్లు) క్లాస్ ఇన్నింగ్స్‌కు.. వందో టెస్టు ఆడుతున్న రాస్ టేలర్ (44; 6 ఫోర్లు, ఒక సిక్స్) సంయమనం తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 216/5తో నిలిచింది. న్యూజిలాండ్ పేసర్లు విజృంభించిన చోట భారత ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా (0/62) కనీస ప్రభావం చూపలేకపోయాడు. ఇషాంత్ శర్మ (3/31) ఆకట్టుకున్నాడు. అంతకుముందు పేలవ ప్రదర్శన కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆలౌటైంది. అజింక్యా రహానే (138 బంతుల్లో 46) కాస్త పోరాడాడు. కివీస్ బౌలర్లలో అరంగేట్ర ఆటగాడు జెమీసన్ (4/39), వెటరన్ పేసర్ సౌథీ (4/49) నిప్పులు చెరిగారు. ప్రస్తుతం చేతిలో 5 వికెట్లు ఉన్న న్యూజిలాండ్ 51 పరుగుల ఆధిక్యంలో ఉంది. వాట్లింగ్ (14), గ్రాండ్‌హోమ్ (4) క్రీజులో ఉన్నారు. ఆదివారం ఈ జోడీని విడదీయడం పైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

### ఆరంభంలో ప్రభావం చూపినా..

నెమ్మదిగా ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్‌ను ఆరంభంలో భారత బౌలర్లు ఇబ్బంది పెట్టారు. బుమ్రా, ఇషాంత్, షమీ చక్కటి బంతులతో కివీస్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టారు. క్రీజులో అసౌకర్యంగా కనిపించిన లాథమ్ (11)ను ఔట్ చేసిన ఇషాంత్ భారత్‌కు శుభారంభాన్నిచ్చాడు. ఈ దశలో క్రీజులోకొచ్చిన కెప్టెన్ విలియమ్సన్ తన శైలికి భిన్నంగా దూకుడుగా ఆడాడు. ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ స్కోరుబోర్డును ఉరకలెత్తించాడు. రెండో వికెట్‌కు 47 పరుగులు జోడించాక బ్లండెల్ (30)ను కూడా ఇషాంత్ పెవిలియన్ దారి చూపెట్టాడు. ఇక న్యూజిలాండ్ ఇన్నింగ్స్ కూడా తడబడటం ఖాయం అనుకుంటే.. విలియమ్సన్ చక్కటి ఇన్నింగ్స్‌తో కివీస్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు.

### కేన్ కెప్టెన్ ఇన్నింగ్స్

వందో టెస్టు ఆడుతున్న రాస్ టేలర్‌తో కలిసి విలియమ్సన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఏమాత్రం తొందరపాటుకు పోకుండా.. నింపాదిగా ఆడిన ఈ జోడీ మంచి బంతులను గౌరవిస్తూ చెత్తబంతులపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడింది. ఈ క్రమంలో విలియమ్సన్ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. టీ తర్వాత మరింత దూకుడు పెంచిన ఈ ఇద్దరు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా బుమ్రాను లక్ష్యంగా చేసుకున్న విలియమ్సన్ చూడచక్కటి షాట్లతో అలరించాడు. ఓవర్‌కో బౌండ్రీ చొప్పున బాదుతున్న ఈ జోడీని ఇషాంత్ విడదీశాడు. మూడో వికెట్‌కు 93 పరుగులు జోడించాక టేలర్ ఔటయ్యాడు. ఈ దశలో మనవాళ్లు కాస్త ఒత్తిడి పెంచడంతో పరుగుల రాక మందగించింది. ఒత్తిడికి గురైన విలియమ్సన్.. షమీ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. జిడ్డు బ్యాటింగ్‌తో విసిగించిన నికోల్స్ (62 బంతుల్లో 17)ను అశ్విన్ పెవిలియన్ పంపడంతో భారత్ కాస్త పోటీలోకొచ్చింది.


విలియమ్సన్ (89)

### 43 పరుగులకే ఐదు వికెట్లు

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 122/5తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ క్రితం రోజు స్కోరుకు మరో 43 పరుగులు జోడించి ఆలౌటైంది. ఆట మొదలయ్యాక తొలి ఓవర్‌లోనే సిక్సర్‌తో అలరించిన పంత్ అనూహ్యంగా రనౌటై పెవిలియన్ బాట పట్టాడు. సౌథీ బంతిని పాయింట్ దిశగా ఆడిన రహానే పరుగు కోసం క్రీజు వదిలి బయటకు వచ్చాడు. మొదట ఇది గుర్తించని పంత్ బంతి ఎక్కడుందో చూసేలోపే అజింక్యా సగం పిచ్ వరకు చేరుకున్నాడు. ఇక తప్పని పరిస్థితిలో పరుగు మొదలెట్టిన రిషభ్.. క్రీజులోకి చేరుకునేలోపే ఎజాజ్ పటేల్ వేసిన త్రో నేరుగా వికెట్లను తాకింది. దీంతో జింక్స్ కోసం తన వికెట్ వదులుకున్న పంత్ భారంగా డగౌట్ చేరాడు. మరుసటి బంతికే అశ్విన్ (0) కూడా ఔటయ్యాడు. ప్రధాన బ్యాట్స్‌మన్ అంతా పెవిలియన్ చేరిపోవడంతో బ్యాట్‌కు పనిచెప్పాలనుకున్న రహానే ఓ ఫోర్ కొట్టి.. సౌథీ బౌలింగ్‌లోనే కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. చివర్లో ధాటిగా ఆడిన షమీ (21) కొన్ని విలువైన పరుగులు జోడించాడు.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** పృథ్వీ షా (బ) సౌథీ 16, మయాంక్ (సి) జెమీసన్ (బి) బౌల్ట్ 34, పుజారా (సి) వాట్లింగ్ (బి) జెమీసన్ 11, కోహ్లీ (సి) టేలర్ (బి) జెమీసన్ 2, రహానే (సి) వాట్లింగ్ (బి) సౌథీ 46, విహారి (సి) వాట్లింగ్ (బి) జెమీసన్ 7, పంత్ (రనౌట్/ఎజాజ్ పటేల్) 19, అశ్విన్ (బి) సౌథీ 0, ఇషాంత్ (సి) వాట్లింగ్ (బి) జెమీసన్ 5, షమీ (సి) బ్లండెల్ (బి) సౌథీ 21, బుమ్రా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 68.1 ఓవర్లలో 165 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-16, 2-35, 3-40, 4-88, 5-101, 6-132, 7-132, 8-143, 9-165, 10-165, **బౌలింగ్:** సౌథీ 20.1-5-49-4, బౌల్ట్ 18-2-57-1, గ్రాండ్‌హోమ్ 11-5-12-0, జెమీసన్ 16-3-39-4, ఎజాజ్ పటేల్ 3-2-7-0.

**న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** లాథమ్ (సి) పంత్ (బి) ఇషాంత్ 11, బ్లండెల్ (బి) ఇషాంత్ 30, విలియమ్సన్ (సి) (సబ్) జడేజా (బి) షమీ 89, టేలర్ (సి) పుజారా (బి) ఇషాంత్ 44, నికోల్స్ (సి) కోహ్లీ (బి) అశ్విన్ 17, వాట్లింగ్ (నాటౌట్) 14, గ్రాండ్‌హోమ్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు:** 7, **మొత్తం:** 71.1 ఓవర్లలో 216/5. **వికెట్ల పతనం:** 1-26, 2-73, 3-166, 4-185, 5-207, **బౌలింగ్:** బుమ్రా 18.1-4-62-0, ఇషాంత్ 15-6-31-3, షమీ 17-2-61-1, అశ్విన్ 21-1-60-1.

**ఒక్క** ఇన్నింగ్స్‌లో రాణించకపోవడంతోనే విమర్శలు గుప్పించడం సరికాదు. గత రెండేండ్లుగా మా బౌలింగ్ దళం నిలకడగా 20 వికెట్లు పడగొడుతూ వస్తున్నది. బుమ్రా సామర్థ్యంపై సందేహం అక్కర్లేదు. అతడు ప్రపంచ స్థాయి బౌలర్. తొలి ఇన్నింగ్స్‌తో పోల్చుకుంటే వికెట్ స్లోగా మారింది. ఆరంభంలో టెన్నిస్ బాల్ పిచ్‌లా కనిపించినా.. మేము బౌలింగ్ చేసే సమయానికి వికెట్ నుంచి మూమెంట్ కరువైంది. బంతి సరిగ్గా బ్యాట్‌పైకి వస్తుండటంతో పరుగులు చేయడం తేలికైంది.

**- ఇషాంత్ శర్మ**

**పంత్** రనౌట్ కావడమే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. రహానేను ఔట్ చేసేందుకు మేం ఎలాంటి ప్రత్యేక వ్యూహాలు అనుసరించలేదు. పంత్ ఉంటే జింక్స్ (రహానే ముద్దుపేరు)తో కలిసి వేగంగా పరుగులు చేసేవాడు. ప్రస్తుతం మ్యాచ్‌లో మేం మంచి స్థితిలో ఉన్నాం. ఆదివారం ఇదే జోరు కొనసాగిస్తే తిరుగుండదు.

**- సౌథీ, న్యూజిలాండ్ పేసర్**

# సూపర్ సోఫీ


సోఫీ (75*)

## రికార్డు అర్ధశతకంతో కివీస్‌ను గెలిపించిన కెప్టెన్

**పెర్త్:** కెప్టెన్ సోఫీ డివైన్ (55 బంతుల్లో 75 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో చెలరేగడంతో మహిళల టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టు శుభారంభం చేసింది. శనివారం జరిగిన పోరులో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. మొదట లంక నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. కెప్టెన్ చమారి ఆటపట్టు జయాంగని (41; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), మాధవి (27 నాటౌట్) ఆకట్టుకున్నారు. కివీస్ బౌలర్లలో హేలీ జెన్సన్ 3, అమేలీ కెర్ రెండు వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్.. సోఫీ డివైన్ రెచ్చిపోవడంతో 17.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 131 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్‌లో సోఫీకి ఇది వరుసగా ఆరో అర్ధశతకం కావడం విశేషం.

### థాయ్‌లాండ్‌పై విండీస్ విజయం

ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడిన థాయ్‌లాండ్ అమ్మాయిలకు ప్రతికూల ఫలితం ఎదురైంది. శనివారం వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో థాయ్ జట్టు 7 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన థాయ్‌లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 78 పరుగులు చేసింది. నన్నపట్ కొన్‌చోన్‌కెయి (33) టాప్ స్కోరర్. విండీస్ కెప్టెన్ స్టెఫానీ టేలర్ (3/13) ధాటికి థాయ్‌లాండ్ ప్లేయర్లలో ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అనంతరం లక్ష్య ఛేదనలో విండీస్ 16.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. స్టెఫానీ (26 నాటౌట్), షమైన్ (25 నాటౌట్) రాణించారు.

**నేటి మ్యాచ్**
ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: పెర్త్ సా. 4.30
స్టార్ స్పోర్ట్స్‌లో

# ఆగర్ హ్యాట్రిక్


ఆగర్ (5/24)

## దక్షిణాఫ్రికాపై ఆసీస్ ఘనవిజయం

**జొహాన్నెస్‌బర్గ్:** లెఫ్టామ్ స్పిన్నర్ ఆస్టన్ ఆగర్ (5/24) హ్యాట్రిక్‌తో రెచ్చిపోవడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో ఆస్ట్రేలియా 107 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మొదటి టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసింది. ఫించ్ (42), స్మిత్ (45) రాణించగా.. ఆగర్ (9 బంతుల్లో 20 నాటౌట్), క్యారీ (27) ధాటిగా ఆడారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సఫారీ జట్టు ఆగర్ ధాటికి 14.3 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌటైంది. పొట్టి ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాకు పరుగుల పరంగా ఇదే భారీ పరాజయం కావడం గమనార్హం. 8వ ఓవర్ చివరి మూడు బంతులకు ఆగర్ వరుసగా డుప్లెసిస్ (24), ఫెలుక్వాయో (0), స్టెయిన్ (0)ను ఔట్ చేసి హ్యాట్రిక్ ఖాతాలో వేసుకున్నాడు.

### రాక్‌స్టార్ జడేజా నా ఫేవరెట్

కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేసుకున్న ఆగర్.. భారత స్పిన్నర్ జడేజా తన అభిమాన ఆటగాడని చెప్పాడు. అతని నుంచి స్ఫూర్తి పొందుతానని.. ఫీల్డ్‌లో జడ్డూ ఓ రాక్‌స్టార్‌లా కనిపిస్తాడని అన్నాడు.

# సెమీస్‌లో అజయ్ ఓటమి

**బార్సిలోనా:** స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. బరిలో నిలిచిన ఏకైక ఆటగాడు అజయ్ జయరామ్ సెమీఫైనల్లో పరాజయం పాలయ్యాడు. శనివారం జరిగిన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 పురుషుల సింగిల్స్ సెమీస్‌లో జయరామ్ 20-22, 12-22తో కున్లావత్ వితిద్‌సరన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు. 39 నిమిషాల్లో ముగిసిన పోరులో తొలి గేమ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన అజయ్.. రెండో గేమ్‌లో కనీస ప్రతిఘటన చూపలేకపోయాడు.


శనివారం హైదరాబాద్‌లో స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో స్టార్ షట్లర్ పీవీ సింధును సన్మానిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# క్రీడా విప్లవానికి ఇది నాంది

## ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడలను ప్రారంభించిన ప్రధాని మోదీ



క్రీడాకారులకు అభివాదం చేస్తున్న ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, కేంద్ర క్రీడా శాఖ మంత్రి కిరణ్ రిజిజు, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు


శనివారం ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించి మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

**కటక్:** ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడలు దేశంలో క్రీడా విప్లవానికి నాంది అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం కటక్ వేదికగా తొలి ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలను ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ మాట్లాడారు. 'ఒడిశాలో ఈరోజు కొత్త చరిత్ర మొదలైంది. భారత దేశ క్రీడా చరిత్రలో ఇది చరిత్రాత్మక సందర్భం మాత్రమే కాదు..ఒక గొప్ప ముందడుగు. యువ అథ్లెట్లకు ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ మంచి వేదిక. సామర్థ్యానికి తగ్గట్లు రాణించేందుకు యువతకు అవకాశం. దేశవ్యాప్తంగా అద్భుత ప్రతిభ కల్గిన క్రీడాకారులను వెలికితీయడంలో ఖేలో ఇండియా ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. ఈ గేమ్స్ ద్వారా దేశంలో క్రీడా వసతి, సౌకర్యాలు మరింత మెరుగయ్యాయి. టైర్-2, 3 సిటీల నుంచి మెరికల్లాంటి క్రీడాకారులు దూసుకొస్తున్నారు. వీరంతా దేశానికి కొత్త ఆశలు చిగురింపచేస్తున్నారు. అథ్లెట్ల ఎంపిక విషయంలో మేము పూర్తి పారదర్శకత పాటిస్తున్నాం, దీని వల్లే అంతర్జాతీయస్థాయిలో మెరుగ్గా రాణిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారు'అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో పాటు కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, స్పోర్ట్స్ సెక్రటరీ రాధే శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే నెల 1 వరకు జరిగే గేమ్స్‌లో మొత్తం 159 విశ్వవిద్యాలయాల నుంచి 3400 మంది అథ్లెట్లు 17 విభాగాల్లో పోటీపడుతున్నారు.

### ఓయూ జట్టు ఇదే..

**ఖేలో** ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బరిలోకి దిగుతున్నారు. ఇందులో **టేబుల్ టెన్నిస్:** ఫిడెల్ ఆర్ స్నేహిత్, అలీ, త్రిశిన్, రఘురామ్, శశి కిరణ్, వరుణి జైస్వాల్, రచన, నివేదిత, హనీఫా ఖాతూన్, వించిత్ర యాదవ్, **ఆర్చరీ:** క్రాంతి కుమార్, షేక్ భాయ్‌జాన్, **అథ్లెటిక్స్:** నిత్య, సుచిత్ర, కీర్తి, గంగోత్రి, అనురాగ, **వెయిట్‌లిఫ్టింగ్:** బీకే కాల, సుకన్య, **బాక్సింగ్:** నాగనిక్, తారా కురేస్తి, మోహిసిన్, **లాన్‌టెన్నిస్:** శ్రావ్య శివానీ, శ్రేయ, రాజ్‌మోహన్, అనూష, **అధికారులు:** లక్ష్మీకాంత్ రాథోడ్, రాజేశ్ కుమార్, సునీల్ కుమార్, దీప్లా, శ్రీధర్ రెడ్డి, దీపిక, సయ్యద్ ఫారుఖ్

# మలుపు తిప్పింది ఆమే

■ పూనమ్‌పై మిథాలీ ప్రశంసలు

**సిడ్నీ:** మహిళల టీ20 ప్రపంచకప్ ఆరంభ పోరులోనే డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తుచేసిన హర్మన్‌ప్రీత్ బృందం.. తమ ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుకుందని భారత మహిళల వన్డే జట్టు కెప్టెన్ మిథాలీరాజ్ పేర్కొంది. 'పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ ఉన్న ఆసీస్ ముందు 132 పరుగుల లక్ష్యం పెద్దది కాదని ముందు అంతా అనుకున్నా.. మన అమ్మాయిలు అద్భుత ప్రదర్శన కనబర్చారు. ఈ విజయం భారత జట్టులో ఆత్మవిశ్వాసం నింపుతుంది. తొలి మ్యాచ్ సాగిన విధానం టోర్నీలోని పోటీని స్పష్టం చేస్తున్నది. ఇకపై మనం మరిన్ని రసవత్తర మ్యాచ్‌లు చూసే అవకాశం ఉంది. భారత్, ఆసీస్ మ్యాచ్ అనేక మలుపులు తిరిగింది. విజయం ఇరు జట్లతో దోబూచులాడింది. ముందు భారత్ త్వరగా వికెట్లు చేజార్చుకున్నా.. ఆ తర్వాత పుంజుకుంది. ఛేదన ఆరంభంలో ఆసీస్‌దే పైచేయి అయ్యేలా కనిపించినా.. పూనమ్ యాదవ్ మ్యాచ్‌ను మన వైపు తిప్పింది. చాన్నాళ్లుగా ఆమె భారత ప్రధాన స్పిన్నర్‌గా కొనసాగుతున్నది. శుక్రవారం మ్యాచ్‌లోనే అదే చేసి చూపించింది. బ్యాటింగ్‌లో షెఫాలీ, జెమీమా, దీప్తి ఆకట్టుకున్నారు' అని మిథాలీరాజ్ వివరించింది.

## వరంగల్ బోణీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తెలంగాణ ప్రీమియర్ కబడ్డీ లీగ్(టీపీకేఎల్) మూడో సీజన్‌లో వరంగల్ వారియర్స్ బోణీ కొట్టింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వరంగల్ 46-26తో రంగారెడ్డి రైడర్స్‌పై ఘనవిజయం సాధించింది. వరంగల్ తరఫున స్టార్ రైడర్ రాజు, సంతోష్ పాయింట్లు కొల్లగొట్టారు.



# కరీంనగర్‌లో జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

**కరీంనగర్ స్పోర్ట్స్:** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 5వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 'చీఫ్ మినిస్టర్ కప్-2020' పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగర మేయర్ వై సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ స్వరూపరాణి ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగనున్న ఈ పోటీల్లో 22 రాష్ర్టాలకు చెందిన సుమారు 1400 మంది క్రీడాకారులు, 100 మంది అధికారులు పాల్గొంటున్నారు. సీనియర్స్, జూనియర్స్, కేడెట్స్, సబ్ జూనియర్స్ కేటగిరీలలో బాల బాలికలకు కాటా, కుమిటీ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. ఓపెన్ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ క్రీడాకారులకు రూ.3 లక్షల వరకు నగదును బహుమతిగా అందజేయనున్నారు. పోటీల ప్రారంభోత్సవంలో నిర్వాహకులు శ్రీనివాస్, హరిశంకర్, ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకృష్ణ, కోచ్‌లు పాల్గొన్నారు.

# భారత్ బోనస్ విజయం

**షూటౌట్‌లో ఆసీస్ చిత్తు**



**భువనేశ్వర్:** భారత పురుషుల హాకీ జట్టు అదరగొట్టింది. ఎఫ్‌ఐహెచ్ ప్రో లీగ్ మూడో 'టై' తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంది. శనివారం ఇక్కడి కళింగ స్టేడియంలో ఇరు జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ 2-2తో 'డ్రా' కాగా.. షూటౌట్‌లో విజృంభించిన మనవాళ్లు 3-1తో కంగారూలపై కసి తీర్చుకున్నారు. ఈ విజయంతో భారత్ బోనస్ పాయింట్ సాధించి మొత్తం 10 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా ఖాతాలో కూడా 10 పాయింట్లే ఉన్నా.. గోల్స్ తేడాతో ఆ జట్టు రెండో ప్లేస్‌లో ఉంది. నిర్ణీత సమయంలో భారత్ తరఫున రూపిందర్‌పాల్ సింగ్ (25వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (27వ ని.లో) చెరో గోల్ నమోదు చేయగా.. ఆస్ట్రేలియా తరఫున ట్రెంట్ మిట్టన్ (23వ ని.లో), అరాన్ జాలస్కీ (46వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. అనంతరం జరిగిన షూటౌట్‌లో హర్మన్‌ప్రీత్, వివేక్ సాగర్ ప్రసాద్, లలిత్ ఉపాధ్యాయ్ గోల్స్ చేయగా.. ఆసీస్ తరఫున డానియల్ బేలే ఒక్కడే విజయవంతమయ్యాడు. భారత గోల్ కీపర్ శ్రీజేశ్ ప్రత్యర్థి ప్రయత్నాలను నీరుగార్చడంతో భారత్ విజయం ఖాయమైంది.

# రవికి స్వర్ణం

## బజరంగ్‌కు రజతం
## ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్


రవి

**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు సత్తాచాటారు. గ్రీకోరోమన్ పురుషుల 57 కేజీల విభాగంలో రవి దహియా స్వర్ణం సాధించగా.. స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా (65 కేజీలు) రజతానికి పరిమితమయ్యాడు. శనివారం జరిగిన ఫైనల్ పోరులో రవి దహియ 10-0తో హిక్మతుల్లా (తజకిస్థాన్)పై విజయం సాధించగా.. బజరంగ్ 2-10తో టకూటో ఒటోగురు (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. భారీ అంచనాల మధ్య బరిలో దిగిన బజరంగ్ ఆకట్టుకోలేకపోయాడు. ఓవరాల్‌గా శనివారం భారత్‌కు ఒక స్వర్ణం, మూడు రజత పతకాలు వచ్చాయి. 97 కేజీల ఫైనల్లో సత్యవర్త్ కడియాన్ 0-10 మెజ్తబా (ఇరాన్) చేతిలో ఓడగా.. 79 కేజీల ఫైనల్లో గౌరవ్ బలియాన్ 5-7తో అర్సాలన్ బుడాజపోవ్ (కిర్గిస్థాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు.


బజరంగ్

# హ్యాట్రాఫ్ హసరంగ

## తొలి వన్డేలో విండీస్‌పై లంక విజయం

**కొలంబో:** ఉత్కంఠ పోరులో వెస్టిండీస్‌పై శ్రీలంక పైచేయి సాధించింది. లెగ్ స్పిన్నర్ వణిండు హసరంగ (39 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్స్) బ్యాట్‌తో మెరువడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో లంక బోణీ చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో లంక ఒక వికెట్ తేడాతో విండీస్‌పై నెగ్గింది. ఓపెనర్ షై హోప్ (115; 10 ఫోర్లు) సెంచరీతో మొదట వెస్టిండీస్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 289 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో లంక 49.1 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 290 రన్స్ చేసింది. కరుణరత్నే (52) ఫెర్నాండో (50), కుషాల్ పెరేరా (42), తిషార పెరేరా (32) ఆకట్టుకున్నారు. తిషార ఔటయ్యాక లంకకు ఓటమి తప్పదని భావిస్తే.. చివరి వరుస బ్యాట్స్‌మెన్‌ను కాచుకుంటూ వణిండు హసరంగ చక్కటి షాట్లతో జట్టును గెలిపించాడు.


హసరంగ (42*)

## ఇర్విన్ సెంచరీ: జింబాబ్వే 228/6

**ఢాకా:** కెప్టెన్ క్రెగ్ ఇర్విన్ (107; 13 ఫోర్లు) సూపర్ సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 228 పరుగులు చేసింది. ఇర్విన్‌తో పాటు ప్రిన్స్ మాసురే (64) రాణించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 111 పరుగులు జోడించారు. బంగ్లా బౌలర్లలో ఆఫ్ స్పిన్నర్ నయీమ్ హసన్ 4, అబు జయేద్ రెండు వికెట్లు పడగొట్టారు.